

చైతన్యరథం
భారతదేశ సాంకేతిక రంగంలో...
సువర్ణాధ్యాయానికి నాంది
Google
DATA CENTER
INDIA'S AI FUTURE
BREAKS GROUND IN VIZAG
28th April, 2026
$15 BILLION INVESTMENT
IN VISAKHAPATNAM, ANDHRA PRADESH
Google
POWERING DIGITAL INDIA
CREATING THOUSANDS OF JOBS
STRENGTHENING ANDHRA PRADESH AS A GLOBAL TECH HUB
చరిత్రను అనుకరించడం కాదు... సృష్టిద్దాం

మంగళవారం 28 ఏప్రిల్ 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



మొక్కజొన్నను

## ఆదుకోండి

కేంద్ర వ్యవసాయ మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ

- వివరాలు 2 లో.




## నూతన ఆవిష్కరణలకు

# వర్సిటీలు వేదిక



- రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఏయూ దిక్సూచి
- యువత జాబ్ సీకర్స్ కాదు... జాబ్ క్రియేటర్స్ అవ్వాలి
- గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు కొత్త చరిత్ర
- ఆంధ్ర వర్శిటీ శతాబ్ది వేడుకల్లో సీఎం చంద్రబాబు
- ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించిన సీఎం

3

## ఏయూ ఇనిస్టిట్యూషన్ కాదు..

# ఎమోషన్!




- ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం
- దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి
- ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతోమంది కృషిచేశారు
- దేశంలోనే ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానం సాధించడమే లక్ష్యం
- ఫిజిక్స్‌నుంచి పాలిటిక్స్ వరకు వర్సిటీ మార్క్ శాశ్వతం
- పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం
- రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలి
- ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో మంత్రి నారా లోకేష్

5

## విశాఖ..

## సాంకేతిక పతాక!

*అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సంచరణ రంగంలో ఏపీ ఒక చారిత్రక శిలాఖండాన్ని సాధించబోతోంది. విశాఖపట్నంలో గూగుల్ నెలకొల్పనున్న హైపర్‌స్కేల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ కేవలం పెట్టుబడి మాత్రమే కాదు -భారతీయ సాంకేతిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మైలురాయి. సీఎం చంద్రబాబు చేస్తున్న శంకుస్థాపన ఆధునిక భారతదేశ నిర్మాణ ప్రక్రియలో కీలక ఘట్టంగా చరిత్రలో నిలవడం ఖాయం.*

7

## విద్యుత్ కొనుగోలు ఛార్జీలు

# తగ్గింపునకు ప్రణాళికలు



- యూనిట్‌కు రూ.4.6కు తగ్గించేలా ప్రయత్నాలు
- రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం
- ఇంధనరంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ వర్శిటీ
- ఈవీ వాహనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన
- విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష

2

## రంగంలోకి ముఖ్యమంత్రి

- పెట్రోల్, డీజిల్ కొరతపై నిరంతర పర్యవేక్షణ
- ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో అధికారుల భేటీలు
- క్షేత్రస్థాయి పరిస్థితులపై అనుక్షణం సీఎంకు నివేదిక

4



## శేషాచలం అడవుల్లో మంటలు అదుపుచేయాలి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం

10

## సింగపూర్‌లో మంత్రులకు ముగిసిన శిక్షణ

- డిజిటల్ పాలనపై ఏడోరోజు అధ్యయనం
- సింగ్ పాస్, హెల్త్ హబ్‌పై ఆరా
- పోలీస్ కమాండ్ సెంటర్ సందర్శన

10



చైతన్యరథం

# విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గింపునకు ప్రణాళికలు

- యూనిట్‌కు రూ.4.6కు తగ్గించేలా ప్రయత్నాలు
- రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం
- ఇంధనరంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ వర్సిటీ
- ఈవీ వాహనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన
- పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాల లక్ష్యాలు చేరుకునేలా కార్యాచరణ
- విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని, ఆ సంస్కరణల అమలుకు టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖను సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలువంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు.

ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించుకున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతంమేర విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితోపాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ.5.20 ఉండగా.. మార్చి 2026నాటికి రూ.4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### పునరుత్పాదక విద్యుత్‌పై దృష్టి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో.. అలాంటి చర్యలన్నింటిపైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్‌రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ.4.60కు తగ్గించాలి. ఈదిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్‌రంగంలో సహా ఏ రంగంలోనైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలుచేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ నిరంతరం గుర్తుచేసుకోవాలి. విద్యుత్‌లో రీసెర్చ్ అండ్ అనాలసిస్‌కు పెద్దపీట వేయాలి. దీని కోసం ట్రాన్స్‌కో, జెన్కోవంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వంనుంచి బడ్జెట్ కేటాయింపులు జరిపేలా చర్యలు తీసుకుంటాం. పంప్డ్ స్టోరేజీ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పొల్యూషన్ తగ్గేలా... పర్యావరణహిత విద్యుదుత్పత్తిపై దృష్టి సారించాలి. 2028-29 నాటికి సగానికిపైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగంవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల 2 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటివరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరునాటికి పూర్తి చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నను ఆదుకోండి

## కేంద్ర వ్యవసాయ మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి (చైతన్య రథం): 2025-26 రబీ సీజన్‌లో పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. మొక్కజొన్న రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకాన్ని వర్తింపచేసి ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు కేంద వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాస్తూ.."రాష్ట్రంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళనగా ఉన్నారు. మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ మొక్కజొన్న ధర రూ.1600 నుండి రూ.1700 మధ్య మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర రూ.2400 కంటే చాలా తక్కువగా ప్రస్తుత మార్కెట్ ధర ఉంది. రాష్ట్రంలో సుమారు 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇంకా 14.26 లక్షల మెట్రిక్ టన్నుల పంట కోత దశలో ఉంది. సకాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు నష్టపోతారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుంది. పీఎం-ఆశా కింద నేరుగా రైతులకు ధరల వ్యత్యాసాన్ని చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిగణించి, ధరల వ్యత్యాసంలో 100శాతం నిధులను కేంద్రమే భరించాలి. ఈ పథకాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలి. నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణమే అనుమతులివ్వాలి' అని కోరారు.



వాసిరెడ్డి వెంకట్రాద్రి నాయుడి జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

# టెక్నాలజీతో నాణ్యమైన వైద్యసేవలు

## వందల కిలోమీటర్ల దూరంనుంచి అందుబాటులోకి స్పెషలిస్టుల సేవలు

## దేశంలోనే తొలి టెలీ-రోబోటిక్ సర్జరీ చేసిన ఆస్పత్రులకు సీఎం అభినందన

అమరావతి (చైతన్యరథం): టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ-ఆస్పత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ-ఆస్పత్రుల యజమాన్యాలకు చెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆస్పత్రులు కలిసి టెలి-రోబోటిక్ సర్జరీ నిర్వహించినట్టు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. టెలి-రోబోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు సింధూర, గన్ని భాస్కరరావు సీఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో ఉన్న రోగికి రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు రోబో ద్వారా సర్జరీ చేశామని... అలాగే జీఎస్ఎల్‌లో ఉన్న రోగికి నారాయణ ఆస్పత్రి వైద్యులు దూరం నుంచే శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆస్పత్రుల యజమాన్యాలను సీఎం చంద్రబాబు అభినందించారు.

టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే దూరంగా ఉన్నా సరే నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని ఈ సంస్థలు నిరూపించాయని సీఎం అన్నారు. రెండు రోజుల వ్యవధిలో నాలుగు సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం విశేషమన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులకు కూడా ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన డాక్టర్లు ఎక్కడి నుంచైనా సర్జరీ చేయగలిగే ఈ సాంకేతికత భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని సీఎం పేర్కొన్నారు.



చైతన్యరథం

# నూతన ఆవిష్కరణలకు వర్సిటీలు వేదిక

విశాఖపట్నం (చైతన్య రథం): యూనివర్సిటీలు డిగ్రీలు ఇచ్చే విద్యా కేంద్రాలు మాత్రమే కాదని... సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలకు వేదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. యూనివర్సిటీలు జాతీయ ఆస్తులని, వాటిని కాపాడుకోవాలన్నారు. విశాఖలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పాల్గొన్నారు. యూనివర్సిటీలో రూ.64 కోట్లతో చేపట్టిన ఏయూ ఐ ఫ్యాక్టరీ, నెట్వర్క్ సెంటర్‌ను ప్రారంభించారు. మరో రూ.112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్, కాన్వకేషన్ హాలుతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

## ఉద్యోగాలిచ్చేస్థాయికి యువత ఎదగాలి

"విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా... రోజులు మారాయి.. సాధారణ మనుషులు అసాధారణ శక్తిగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లపై యువత దృష్టి పెట్టాలి. పారిశ్రామిక రంగానికి యూనివర్సిటీ అనుసంధానం కావాలి. మీరు ఉద్యోగం చేయడం కాదు, పది మందికి ఉద్యోగం ఇచ్చే శక్తి మీకు రావాలి... దీనికి సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ... యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన మరో చరిత్ర. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారంటే రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. విశాఖ విశ్వనగరం... గ్లోబల్ సిటీ. ఇది అన్ స్టాపబుల్. ఎవరూ ఆపలేరు. ఏయూ 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ సమావేశం ఏయూలో నిర్వహించాం... అదీ ఏయూ ప్రత్యేకత. 53 యూనివర్సిటీలు రాష్ట్రంలో ఉన్నాయి... అన్నింటికీ ఏయూ దిక్సూచి, లీడర్. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఈ యూనివర్సిటీ వచ్చింది. జైపూర్ రాజ్ విక్రమ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజులు ఈ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. వారిని మనం స్మరించుకోవడం ధర్మం, బాధ్యత. కట్టమంచి రామలింగారెడ్డి ఏయూకు మొదటి వీసీగా చేసి బలమైన పునాది వేశారు. ఆయన కూడా చిత్తూరు జిల్లా వాసే... నేనూ చిత్తూరు జిల్లా నుంచి వచ్చి వందేళ్ల ఉత్సవంలో పాల్గొన్నాను. 2వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణ... దేశ రాష్ట్రపతి అయ్యారు. ఈ రోజు మన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి రాధాకృష్ణ అభిమాని. ఈయనకు రాధాకృష్ణన్ అని పేరు పెట్టారు. కేవలం చదువు చెప్పడమే కాదు... తెలుగు వైభవానికి ఏయూ కృషి చేస్తోంది. విద్య, సాహిత్య, కళారంగాల్లో ప్రముఖులను కళా ప్రపూర్ణ అవార్డుతో గౌరవిస్తున్నారు" అని సీఎం చంద్రబాబు అన్నారు.



- రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఏయూ దిక్సూచి
- యువత జాబ్ సీకర్స్ కాదు... జాబ్ క్రియేటర్స్ అవ్వాలి
- గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు కొత్త చరిత్ర
- ఆంధ్ర వర్సిటీ శతాబ్ది వేడుకల్లో సీఎం చంద్రబాబు
- ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించిన సీఎం





## 26 ఏళ్ల యువకుడిలా నా ఆలోచనలు..

రాష్ట్రంలో ఎంతోమంది నాయకులను తయారు చేసిన గడ్డ ఆంధ్ర యూనివర్సిటీ అని, ఎందరో రాజకీయ ఉద్దండులు ఇక్కడనుంచే వచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఏయూ నుంచే వచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా ఇక్కడినుంచే వచ్చారు. ప్రపంచంలోని చాలా యూనివర్సిటీల్లో ఇక్కడ చదువుకుని వెళ్లిన వారు ప్రొఫెసర్లుగా చేస్తున్నారు. న్యాక్ ఏ ప్లస్‌ప్లస్‌ను ఏయూ సాధిస్తోంది. ఎన్ఐఆర్ఎఫ్‌లో 41వ ర్యాంక్, పబ్లిక్ సెక్టార్‌లో 5వ ర్యాంక్‌లో ఉంది. అన్ని యూనివర్సిటీల్లో విద్యాశాఖామంత్రి, గవర్నర్ ప్రతిభ ఉన్నవారిని వీసీలుగా ఎంపిక చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా వారిని అభినందిస్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెట్రాలజీతో ఎంఓయూలు కుదుర్చుకున్నాం. నాకు 76 ఏళ్లయినా.. నేను 26 ఏళ్ల యువకుడిలానే ఆలోచిస్తాను. ఒకప్పుడు మనం ఐటీ ప్రారంభించాం. హైటెక్ సిటీ కట్టాం. నాలెడ్జ్ ఎకానమీకీ దోహదం చేశాం. నేడు డేటా సెంటర్, ఏఐ, క్వాంటం తీసుకొచ్చాం. వీసీని కోరుతున్నా... ఏయూకు బ్రాండ్ ఉంది. మీరు అడిగితే ప్రపంచంలోని చాలా యూనివర్సిటీలు మీతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. వంద దేశాల విద్యార్థులు మన యూనివర్సిటీల్లో చదివేలా సిద్ధం చేయాలి. సంపద సృష్టించే మార్గదర్శులుగా మారే అవకాశం మీకు ఉంది. ఎంట్రప్రెన్యూర్లుగా ఏయూ ఎంతమందిని తయారు చేస్తుందనేది మీ మీద ఆధారపడి ఉంది. ఇక్కడ ఆర్టీఐహెచ్ ఏర్పాటు చేశాం. భవిష్యత్ డేటా సెంటర్, ఏఐ, క్వాంటం రంగాలదే. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి చదువు. చదువుతో ప్రపంచాన్ని జయించే ఆత్మవిశ్వాసం వారికి వస్తుంది. ఏయూ చాలా సుందరమైన ప్రాంతం. ఒత్తిడి ఉన్నప్పుడు సముద్ర తీరంలో కాసేపు నడిస్తే సేదతీరుతారు" అని సీఎం అన్నారు.

## ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు

"ఏయూలో చదువుకునేవారంతా అదృష్టవంతులు. ఇక్కడ చదువుకుంటే ఎంత బావుటుందో అనే ఆలోచన మళ్లీ నాకూ వస్తోంది. ఈ యూనివర్సిటీ భావితరాల నాయకులను తయారు చేయాల్సి ఉంటుంది. ఉపకులపతికి లక్ష్యం నిర్దేశిస్తున్నాం... ఏయూ దేశంలో యూనివర్సిటీల్లో టాప్-5 జాబితాలో ఉండాలనేది నా ఆకాంక్ష. ప్రపంచంలో 100 అత్యుత్తమ యూనివర్సిటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఉండాలి. ఈ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే నిధులు కావాలి. అందుకే రూ.500కోట్లను ఆంధ్ర యూని వర్సిటీకి ఇస్తాం. రూ.500కోట్ల కార్పస్ ఫండ్ వస్తుంది. ఒక్కో విద్యార్థి ఒక్కో రూపాయి చొప్పున సాయం అందించినా చాలు. ఏయూ పూర్వ విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే అవుతుంది. ఏయూ వందేళ్ల చరిత్ర రోజున చెప్తున్నా...రాబోయే వందేళ్లలో ఏయూ మరో చరిత్ర సృష్టిస్తుంది... బెస్ట్ బ్రాండ్ క్రియేట్ చేస్తుంది" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏయూనుంచే జైత్ర యాత్ర ప్రారంభం

"ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం. ఇక్కడ బంగారంలాంటి విద్యార్థులు ఉన్నారు. మంచి ప్రొఫెసర్లు ఉన్నారు. ప్రపంచంలోని నాలెడ్జ్‌ను ఇక్కడికి తీసుకొస్తాం. నేను, నా మిత్రుడు పవన్‌కళ్యాణ్ ఈ రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ముందుకొచ్చాం. తెలుగుజాతి పునర్వైభవానికి ప్రధాని మోదీ మనకు సహకరిస్తున్నారు. వారి సంకల్పం వికసిత్ భారత్ 2047. మన లక్ష్యం స్వర్ణాంధ్ర 2047. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేది మా సంకల్పం. మా సంకల్ప జైత్ర యాత్ర ఏయూనుంచే ప్రారంభం కావాలి. పని చేసే బాధ్యత మాది, సహకరించే బాధ్యత మాది... దాన్ని నిరూపించుకునే బాధ్యత మీదే" అని విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఒడిశా గవర్నర్ హరిబాబు, కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్, మాజీ క్రికెటర్ సచిన్, దర్శకుడు త్రివిక్రమ్, మంత్రులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# రంగంలోకి ముఖ్యమంత్రి

- పెట్రోల్, డిజీల్ కొరతపై నిరంతర పర్యవేక్షణ
- ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో అధికారుల భేటీలు
- క్షేత్రస్థాయి పరిస్థితులపై అనుక్షణం సీఎంకు నివేదిక
- ఆదివారం నాటికంటే మెరుగైన సరఫరా
- రాత్రిళ్లుకూడా లోడ్ డిస్పాచ్ జరపాలని సీఎం ఆదేశం
- సాధారణ స్థితి నెలకొనేంత వరకు ఆర్టీజీఎస్ నుంచి సమీక్ష

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ కొరతపై నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి... విశాఖకు బయలుదేరే ముందు మరోసారి పరిస్థితిపై సమీక్షించారు. అలాగే విశాఖనుంచి మరోసారి టెలి కాన్ఫరెన్స్ చేపట్టారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్య సాధారణ స్థితికి చేరుకునేంత వరకు ఎవ్వరూ విశ్రమించవద్దని... ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతూ... క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. సోమవారం మొత్తంగా 2679 లోడ్లను రాష్ట్రంలోని వివిధ పెట్రోల్ బంకులకు పంపాలని ప్రణాళికలు సిద్ధం



చేస్తే... వాటిల్లో 2079 లోడ్లు ఇప్పటికే బయలుదేరాయి. వీటిల్లో కొన్ని గమ్యస్థానాలకు చేరుకున్నట్టు అధికారులు వివరించారు. ఇక మిగిలిన మరో 600 లోడ్లను డిస్పాచ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ 2079 లోడ్లల్లో 11909 కిలో లీటర్ల పెట్రోల్, 19707 కిలో లీటర్ల డీజిల్ వివిధ బంకులకు వెళ్లాయి. రాష్ట్రంలోని మూడు ఆయిల్ సరఫరా కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్పీసీఎల్ సంస్థల ద్వారా ఈ మొత్తం లోడ్ డిస్పాచ్ అయింది. ప్రతి లోడ్ కు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అటాచ్ చేసి పంపుతున్నట్టు అధికారులు తెలిపారు. డిస్పాచ్ అయ్యే ప్రాంతం నుంచి దూరంగా ఉండే ప్రాంతాలకు లోడ్లు చేరడం కొంచెం ఆలస్యమవుతోందని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ లోడ్ డిస్పాచ్ రాత్రి పూట కూడా జరపాలని సీఎం ఆదేశించారు. ఆదివారం నాటితో పోల్చుకుంటే సోమవారం నాడు ఆయిల్ సరఫరా మెరుగైంది. ఇక సోమవారం ఉదయంతో పోల్చుకుంటే... అనకాపల్లి, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం, మార్కాపురం వంటి జిల్లాల్లో బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత మెరుగైంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నాడు రాత్రి ఏడు గంటల సమయానికి 6511 కిలో లీటర్ల పెట్రోల్, 9046 కిలోలీటర్ల డీజిల్ అమ్మకాలు జరిగాయి.










*ఆంధ్ర యూనివర్శిటీ శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు ప్రత్యేక విమానంలో విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు భారీ స్వాగతం లభించింది. రాధాకృష్ణన్‌కు ఐఎన్ఎస్ డేగాలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్, పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.*

చైతన్యరథం

# ఏయూ ఇనిస్టిట్యూషన్ కాదు.. ఎమోషన్!




- ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం
- దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి
- ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతోమంది కృషిచేశారు
- దేశంలోనే ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానం సాధించడమే లక్ష్యం
- ఫిజిక్స్‌నుంచి పాలిటిక్స్ వరకు వర్సిటీ మార్క్ శాశ్వతం
- పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం
- రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలి
- ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం (చైతన్య రథం): ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇనిస్టిట్యూషన్ మాత్రమే కాదని, తనలాంటి వారికి ఒక ఎమోషన్ అని, ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈరోజు ఒక గర్వకారణమైన, చరిత్రాత్మక సందర్భం. శతాబ్దకాలంగా వెలుగొందు తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం గొప్పదనాన్ని జరుపుకునేందుకు మనం అందరం ఇక్కడకు వచ్చాం. ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇనిస్టిట్యూషన్ మాత్రమే కాదు..నాలాంటి వారికి ఒక ఎమోషన్. తరతరాలుగా మన మనస్సుల్లో మెదులుతోంది. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు హృదయపూర్వక స్వాగతం పలకడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ సేవాగుణం, నిష్ఠ, ప్రజాసేవపట్ల మీ అంకితభావం తరతరాలకు ప్రేరణగా నిలుస్తోంది. అదేవిధంగా ఏపీ గవర్నర్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు కూడా హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాం. మీ మార్గదర్శకత్వం, నాయకత్వం ఈ గొప్ప సంస్థను మరింత బలపరుస్తోంది. అదేవిధంగా లక్షలాది హృదయాలను గెలుచుకున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. క్రమశిక్షణ, అంకితభావం, ప్రతిభకు ఆయన నిదర్శనంగా నిలుస్తారు. దార్శనికనేత, గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి స్వాగతం. విద్యే అభివృద్ధికి పునాది అని ఆయన విశ్వసిస్తారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ హరిబాబు, ఇక్కడకు విచ్చేసిన ఇతర ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది, విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## ఆంధ్ర యూనివర్సిటీ పేరు కాదు.. వందేళ్ల చరిత్ర

"2014లో రాష్ట్రం విడిపోయింది. కట్టుబట్టలతో మెడపట్టి మనల్ని బయటకు గెంటేశారు. రాజధాని లేదు. సచివాలయంలేదు. అసెంబ్లీ లేదు.ముఖ్యమంత్రి కూర్చోవడానికి కుర్చీ లేదు. ఆ రోజు ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నవి రెండే. ఒకటి ఆంధ్ర యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ మీటింగ్ పెట్టుకోవడానికి ఒక హాల్ కూడా లేదు. ఆ రోజు మొదటి కేబినెట్ మీటింగ్ ఆంధ్ర యూనివర్సిటీలో పెట్టుకున్నాం. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదటి అసెంబ్లీ సమావేశాలు కూడా ఏయూలోనే నిర్వహించాం. ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర" అని విశదీకరించారు.

## దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి

"స్వాతంత్ర్యం రాకముందు తెలుగు ప్రజలు పోరాడి ఆంధ్ర యూనివర్సిటీ సాధించుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి ఎన్నో రికార్డ్స్ ఉన్నాయి. దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి. భాషాప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిది ఆంధ్ర రాష్ట్రం. తెలుగు ప్రజల కోసం మనం యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఈరోజు ఇక్కడ మిమ్మల్ని చూసి అసూయపడుతున్నాను. ఆంధ్ర యూనివర్సిటీలో చదివి ఉంటే ఎంతో బాగుండేదని. పక్కనే వైజాగ్ బీచ్ రోడ్.. అద్భుతమైన సిబ్బంది, ఏయూ స్టూడెంట్స్ జోష్ ఈ రోజు అదిరిపోతోంది. మీ జోష్ చూసిన తర్వాత మీకోసం ఇంకా కష్టపడాలి, పనిచేయాలి. వచ్చే వందేళ్ల చరిత్ర కలిసికట్టుగా సృష్టించాలని కోరుతున్నా" అని లోకేష్ పిలుపునిచ్చారు.

## ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతోమంది త్యాగం ఉంది

"మానసిక వికాసం మానవ జీవితానికి అత్యున్నత లక్ష్యంగాఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతోమంది త్యాగం ఉంది. ఎంతోమంది పోరాటం ఉంది. కష్టం ఉంది. సీఆర్ రెడ్డి మొదటి వైస్ ఛాన్సలర్‌గా ఒక క్లియర్ డైరెక్షన్ మనకు అందించారు. తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. ఆయన విజన్, స్పీడ్, కమిట్‌మెంట్ ఆంధ్ర యూనివర్సిటీకి బలమైన పునాది వేసింది. ఎంతోమంది దాతలు ఏయూ అభివృద్ధికి సహకరించారు. ఎంతోమంది వైస్ ఛాన్సలర్లు ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి కృషిచేశారు. వైస్ ఛాన్సలర్లకి విజన్ ఉంటే ఆంధ్ర యూనివర్సిటీలాంటి గొప్ప యూనివర్సిటీలు తయారవుతాయి" అన్నారు.

## ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం

"యూనివర్సిటీని సాధారణంగా విశ్వవిద్యాలయం అంటారు. కానీ మన ఆంధ్ర యూనివర్సిటీని ఆంధ్ర విశ్వకళా పరిషత్ అంటారు. ఇది అకడమిక్ విద్య, లిబరల్ ఆర్ట్స్ సమ్మిళితం. దీనికి మంచి ఉదాహరణ త్రివిక్రమ్ శ్రీనివాస్. మన ఏయూ నుంచి ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు ప్రఖ్యాత సినీ దర్శకులుగా ఆయన ఎదిగారు. ఆంధ్ర యూనివర్సిటీ చిహ్నం దగ్గరనుంచి కోర్సుల వరకు అన్నీ స్పెషల్. ఉన్నత విద్యలో భిన్నమైన ప్రోగ్రామ్స్‌ను అందిస్తోంది ఆంధ్ర యూనివర్సిటీ. ఏయూలో 7 అనుబంధ కళాశాలలతో కలిపి 68 అకడమిక్ విభాగాలున్నాయి. మొత్తం 121 అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతోపాటు వివిధ పరిశోధనా కార్యక్రమాలు అందిస్తున్నారు. అదే విధంగా ఏయూకి 304 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. సుమారు 85,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 56 దేశాలనుండి వచ్చిన సుమారు 1050 మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు.ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికి గర్వకారణం"అని లోకేష్ ఉద్ఘాటించారు.

## దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్‌లో ఏయూ 3వ స్థానం సాధించడమే లక్ష్యం

"ఆంధ్ర యూనివర్సిటీ ర్యాంక్స్ సాధించడంలో కూడా ముందుంటుంది. ఐఎస్‌వో సర్టిఫికెట్, నాక్ ఏ++ గ్రేడ్, 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 4వ స్థానంలో నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానం, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 100లో స్థానం సంపాదించినప్పుడే విద్యా శాఖ మంత్రిగా నాకు సంతృప్తి. ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ దీనిని ఒక లక్ష్యంగా తీసు కుని ఏయూని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కోరుతున్నా" అని లోకేష్ ప్రతిపాదించారు.

## ఫిజిక్స్‌నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది

"ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్న వారు గొప్పస్థాయికి వెళ్లారు. ఫిజిక్స్‌నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది. లోక్‌సభ తొలి దళిత స్పీకర్‌గా పనిచేసిన జీఎంసీ బాలయోగి ఏయూ విద్యార్థి.ఉప రాష్ట్రపతిగా పనిచేసిన వెంకయ్యనాయుడు, కే.హరిబాబు, దువ్వూరి సుబ్బా రావు, బీవీఆర్ మోహన్‌రెడ్డి, పూర్ణ ఆర్ సగ్గుర్తి, గ్రంధి మల్లికార్జునరావు, చావా సత్యనారాయణ ఏయూ విద్యార్థులే. రాజకీయాల్లో కూడా ఏయూ స్టూడెంట్స్ నెం.1. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఏయూ ప్రొడక్టే. వారి ఎదుగుదల యాధృచ్ఛికం కాదు. నిరంతర పోరాటం, త్యాగం, సంకల్పబలం వల్లే

- (మిగతా వివరాలు 6లో)



## ప్రజలకు సేవ చేయాలని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా

ఇక్కడ ఉన్న స్టూడెంట్స్‌కి నా జీవిత ప్రయాణం గురించి కూడా చెప్పాలని అనుకుంటున్నా. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. వరల్డ్ బ్యాంక్‌లో పనిచేశా. హెరిటేజ్‌లో కూడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నా. ప్రజలకు సేవ చేయాలని 2013లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశా. 2019లో మంగళగిరి నుంచి పోటీ చేసి 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. మొదటిరోజు బాధపడ్డాను. తర్వాత ఆ బాధ నాలో కసి, పట్టుదల పెంచింది. 2024లో మళ్లీ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీ 91వేల ఓట్లతో గెలిచాను. ఇది మీకు ఎందుకు చెబుతున్నానంటే నో రిస్క్, నో స్టోరీ అని గుర్తు పెట్టుకోవాలి. ఇక్కడున్నవారు జీవితంలో ఎన్నో సాధించారు. ఎంతో త్యాగం చేశారు. సవాళ్లను ఎదుర్కొన్నారు. అపజయాలే విజయానికి సోపానాలు" అని పేర్కొన్నారు.




# ఏయూ ఇనిస్టిట్యూషన్ కాదు.. ఎమోషన్!





(5వ పేజీ తరువాయి)

వారు అత్యుతన్నతస్థాయికి ఎదిగారు. సమాజంలో మనం కోరుకున్న మార్పు రావాలంటే రాజకీయాల్లోకి మరింతమంది రావాల్సిన అవసరం ఉంది" అని పిలుపునిచ్చారు.

## పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం

"ఏయూ వందేళ్ల ప్రయాణం పూర్తిచేసుకుంది. కాలం మారుతోంది. సాంకేతికత మారుతోంది. అందుకే వీసీ ఆధ్వర్యంలో మన కరిక్యులమ్‌లో కూడా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం. గౌరవ సీఎం చాలా స్పష్టంగా చెప్పారు. ఇండస్ట్రీ, అకడమీయా కనెక్ట్ అవసరం ఉందని. కేవలం తరగతి గదుల్లో చదువుకోవడం మాత్రమే కాదు. కనీసం ఒక ఏడాదన్నా ఫీల్డ్‌కు వెళ్లాలి. వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉంది. సీఎం ఆదేశాలను నేను స్వీకరిస్తున్నా. ఆ మార్పు కూడా మేం తీసుకువస్తామని తెలియజేస్తున్నా. నాలుగేళ్ల ఇంజనీరింగ్ చేస్తే జాబ్ రాదు. అదే అమీర్‌పేటలో నాలుగు నెలల కోర్సు చేసి జాబ్ కొడతారు. అదే స్కిల్ గ్యాప్. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. దానికి మేం అహర్నిశలు కష్టపడతామని తెలియజేస్తున్నా" అన్నారు.

## ఏడాదిలోగా పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం

"అతి చిన్న వయసులో విద్యాశాఖ మంత్రిగా నన్ను సీఎం చంద్రబాబు నియమించారు. నేను విద్యాశాఖ తీసుకుంటానంటే కష్టమని, వద్దని చాలామంది వారించారు. దేశ చరిత్ర తిరిగి రాయాలంటే మా పిల్లలే రాయాలని నేను ఛాలెంజ్‌ను స్వీకరించడం జరిగింది. ఇంకా మార్పులు తీసుకురావాలి. నిధులు కేటాయించాలి. మౌలిక వసతులే కాదు.. శాశ్వత సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. పెండింగ్ పోస్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సీఎం చెప్పారు. వచ్చే ఏడాదిలోగా పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం. హయ్యర్ ఎడ్యుకేషన్‌పైన ఎక్కువ దృష్టిపెట్టాలని ప్రధాని చెబుతున్నారు. రీసెర్చ్‌ను ఎక్కువగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది" అంటూ మంత్రి లోకేష్ భవిష్యత్ లక్ష్యాలను వివరించారుర.

## రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలని సీఎంను కోరుతున్నా

"ఉత్తరాంధ్ర రాష్ట్రానికి ఒక ఎకనామిక్ జోన్‌గా మారబోతోంది. రేపు గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. గడిచిన ఆరు నెలల్లో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ ప్రారంభించాం. సీఎం చేతులమీదుగా ఇంగోట్ సోలార్ వేఫర్ యూనిట్‌కు శంకుస్థాపన చేయడం జరిగింది. వారికి కావాల్సిన కరిక్యులమ్ తయారుచేసే బాధ్యత ఏయూ తీసుకోవాలని కోరుతున్నా. ఆంధ్ర యూనివర్సిటీకి కనీసం రూ.250 కోట్లు నిధులు కేటాయించి రీసెర్చ్‌ను పెద్దఎత్తున ప్రోత్సహించాలని సీఎంని కోరుతున్నా. వచ్చే వందేళ్ల విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని సిబ్బంది, వీసీని ఆదేశించాం. ప్రతి ఐదేళ్లలో యూనివర్సిటీ ఏం సాధించాలనేది అందులో స్పష్టంగా ఉండాలని, స్టూడెంట్స్ ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశారు.

కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు కే.రామ్మోహన్‌నాయుడు, భారతరత్న, ప్రముఖ ఇండియన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఒడిశా గవర్నర్ కే హరిబాబు, కేంద్రమంత్రులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, సైయెంట్ గ్రూప్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఏయూ వైస్ ఛాన్సలర్ జీపీ రాజశేఖర్, ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# విశాఖ.. సాంకేతిక పతాక!

*అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సంచరణ రంగంలో ఏపీ ఒక చారిత్రక శిలాఖండాన్ని సాధించబోతోంది. విశాఖపట్నంలో గూగుల్ నెలకొల్పనున్న హైపర్‌స్కేల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ కేవలం పెట్టుబడి మాత్రమే కాదు -భారతీయ సాంకేతిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మైలురాయి. సీఎం చంద్రబాబు చేస్తున్న శంకుస్థాపన ఆధునిక భారతదేశ నిర్మాణ ప్రక్రియలో కీలక ఘట్టంగా చరిత్రలో నిలవడం ఖాయం.*




ప్రఖ్యాత గూగుల్ డేటా సెంటర్‌కు నేడు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో..

గత దశాబ్దాలలో ఏపీ అనేక సవాళ్లు అధిగమించింది. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థికంగా, రాజకీయంగా కొత్త పునాదులు నెలకొల్పుకుంటున్న సమయంలో, ప్రపంచంలోనే అతిపెద్ద టెక్నాలజీ కంపెనీ గూగుల్ విశాఖలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించడం రాష్ట్ర ప్రజలకు ఆశాకిరణం. దీన్ని ఒక వ్యాపార నిర్ణయంగా కాదు -ఏపీ భవిష్యత్తుపై గూగుల్ నమ్మకానికి ప్రతీకగా చూడాలి. "విశాఖ ఒక నూతన చరిత్రకు నాంది పలుకుతోంది. డేటా సెంటర్ల రాజధానిగా మారే దిశగా అడుగులు వేస్తోంది" అన్నది సీఎం చంద్రబాబు మాట. కూటమి ప్రజా ప్రభుత్వం పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తుండటంతో -గూగుల్ డేటా సెంటర్ సాకారమైంది. ప్రభుత్వం ఒకే కౌంటర్ ద్వారా అనుమతులు, భూకేటాయింపులు, విద్యుత్ అనుసంధానంవంటి సేవలు అందించడంతో పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందన్న అంతర్లీన అంశం ఇక్కడ ముఖ్యం. విశాఖ తీరప్రాంతం కావడం డేటా సెంటర్ స్థాపనకు అత్యంత అనుకూలమైన అంశం. అంతర్జాతీయ సముద్రగర్భ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుకు సహజమైన అనుకూలత ఉన్న తీరప్రాంతం -ప్రపంచ కనెక్టివిటీకి సహజ ద్వారంగా నిలుస్తోంది. ప్రపంచంలో 95 శాతంకంటే ఎక్కువ డిజిటల్ డేటా సముద్రగర్భ కేబుళ్ల ద్వారా ప్రవహిస్తున్న నేపథ్యంలో, విశాఖ తీరప్రాంతంలో డేటా సెంటర్ ఏర్పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. దీంతోపాటు -త్వరలోనే అందుబాటులోకి రానున్న సబ్ సీ కేబుల్ వ్యవస్థ ద్వారా విశాఖకు వివిధ దేశాలతో నేరుగా అనుసంధానం ఖాయం. ఈ కేబుల్ వ్యవస్థ ద్వారా విశాఖ నుండి అమెరికా, యూరప్, జపాన్, సింగపూర్‌వంటి దేశాలకు నేరుగా అతి వేగవంతమైన డేటా ప్రసారం సాధ్యమవుతుంది. దీని వలన సమాచార ప్రసార జాప్యం తగ్గి, నెట్‌వర్క్‌పై విశ్వాసం పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో అదాని కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా వంటి సంస్థలు భాగస్వాములు.

ఇదిలావుంటే - రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.5 గిగావాట్ల సామర్థ్యంతో మల్టీ-గిగావాట్ డిజిటల్ హబ్‌ను నిర్మించాలనేది ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం. ఇది భారతదేశంలో ఏ రాష్ట్రమూ ఇంతవరకు చేయని అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయ ప్రాజెక్టు. ప్రస్తుతం ఆరంభమవుతున్న ఒక గిగావాట్ ఫేజ్ కేవలం తొలి అడుగు మాత్రమే. దీనిని ఆరు దశలుగా విస్తరించాలని ప్రణాళిక సిద్ధంగా ఉంది. పోలికగా చెప్పాలంటే నేడు బెంగళూరు సుమారు 300 మెగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. విశాఖ లక్ష్యం దానికంటే 20 రెట్లు అధికం. ఇది విశాఖను దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌గా మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సింగపూర్, హాంకాంగ్, టోక్యోవంటి నగరాలు ప్రముఖ డేటా హబ్‌లుగా గుర్తింపుపొందాయి. రానున్న కాలంలో విశాఖ వాటి సరసన చేరే అవకాశం ఉంది. గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను సృష్టించనుంది. నేరుగా డేటా సెంటర్‌లో పని చేసే ఉద్యోగాలే కాకుండా, అనుబంధ రంగాలలో ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగాలు వేలాది సంఖ్యలో ఏర్పడనున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్లు, క్లౌడ్ ఆపరేషన్స్ స్పెషలిస్టులు, మెయింటెనెన్స్ టెక్నీషియన్లు, సైబర్ సెక్యూరిటీ విశ్లేషకులు, క్లౌడ్ ఆర్కిటెక్టులు, డేటా సైంటిస్టులువంటి రంగాల్లో వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పవర్ సిస్టమ్స్, కూలింగ్ టెక్నాలజీ, సర్వర్ తయారీ, నెట్‌వర్కింగ్‌వంటి రంగాల్లో స్థానికంగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్లతో ఏఐ ఎకోసిస్టమ్ ఏర్పాటు కానుంది. ఈ రంగాల్లో పనిచేసే ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, సివిల్ ఇంజినీర్లు, లాజిస్టిక్స్ నిపుణులు వంటివారికీ అవకాశాలు తెరుచుకుంటాయి. నిర్మాణ దశలో వేలాది నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించబడుతుంది. ఒక్క గూగుల్ డేటా సెంటర్ నేరుగా 5,000, పరోక్షంగా 50,000 ఉద్యోగాలు సృష్టిస్తుందని నిపుణులు అంచనా. గూగుల్ సాధారణంగా తన డేటా సెంటర్ స్థాపించే ప్రదేశాలలో స్థానిక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. ఏపీలోనూ వర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలల సహకారంతో ప్రత్యేక ఏఐ/ఎంఎల్ కోర్సులు, క్లౌడ్ కంప్యూటింగ్ సర్టిఫికేషన్లు అందించే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏపీ టెక్ స్కిల్స్ మిషన్ ద్వారా లక్షలమంది యువతకు డిజిటల్ నైపుణ్యాలు అందించేందుకు కార్యక్రమాలు చేపట్టింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఈ మిషన్‌కు కొత్త ఊపు ఇస్తుంది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఒంటరి పెట్టుబడి కాదు. విస్తృతమైన ఏఐ ఎకోసిస్టమ్ నిర్మాణానికి పునాది. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు స్థాపించిన చోట్ల అనేక అనుబంధ పరిశ్రమలు, సేవా రంగ సంస్థలు వెంటనే అనుసరించాయి. విశాఖ విషయంలోనూ ఇదే జరగనుంది. ఏఐ ఎకోసిస్టమ్‌తో ఐటీ స్టార్టప్‌లు, రీసెర్చ్ సెంటర్లు, క్లౌడ్ కంపెనీలు, సెమీ కండక్టర్ కంపెనీలు విశాఖకు క్యూ కట్టే అవకాశముంది.

విశాఖ ఇప్పటికే వీఎస్ఈజెడ్ (విశాఖపట్నం స్పెషల్ ఎకనమిక్ జోన్), ఫిన్‌టెక్ వ్యాలీ ఫ్యూజన్‌వంటి ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రాలు కలిగి ఉంది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు తర్వాత ఈ ప్రాంతాల్లో కార్యకలాపాలు మరింత వేగంగా విస్తరించే అవకాశం లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది -సీడ్ ఫండింగ్, ట్యాక్స్ రిలీఫ్, మెంటర్‌షిప్ కార్యక్రమాలు అందులో భాగం.

## గ్రీన్ ఎనర్జీ -పర్యావరణ బాధ్యత

గూగుల్ సహా ఇతర టెక్ కంపెనీలు ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ల కోసం గ్రీన్ ఎనర్జీని సరఫరా చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గూగుల్ 2030 నాటికి తన అన్ని కార్యకలాపాలను 100శాతం పునరుత్పాదక శక్తితో నడపాలని లక్ష్యం పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో సోలార్, విండ్ ఎనర్జీ సామర్థ్యం అపారంగా ఉండటం గూగుల్‌కు అనుకూలంగా ఉంది. రాష్ట్రం ఇప్పటికే 15,000 మెగావాట్ల పైగా పునరుత్పాదక శక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పింది. 2030నాటికి ఇది 25,000 మెగావాట్లకు పెంచాలని ప్రణాళిక ఉంది. ఈ గ్రీన్ ఎనర్జీ లక్ష్యం గూగుల్‌వంటి కంపెనీలకు ఆంధ్రప్రదేశ్‌ను మరింత ఆకర్షణీయంగా చేస్తోంది.

## సైబర్ సెక్యూరిటీ కేంద్రం

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖ ఒక ప్రధాన సైబర్ సెక్యూరిటీ కేంద్రంగా మారే అవకాశం ఉంది. దేశంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో, విశాఖలో ఒక నేషనల్ సైబర్ సెక్యూరిటీ ఎక్సెలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇది రక్షణరంగ అవసరాలు కూడా తీరుస్తుంది -ఎందుకంటే విశాఖలో ఐఎన్ఎస్ విశాఖ నావల్ బేస్ ఉంది.

## అంతర్జాతీయ హంగులు - వికిసిత్ భారత్-2047

ప్రముఖ టెక్ సంస్థలన్నీ విశాఖవైపు చూస్తుండటంతో ఇప్పుడు నగరానికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాలు కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటు తర్వాత విశాఖ నేరుగా సింగపూర్, దుబాయ్, హాంకాంగ్, లండన్‌వంటి ప్రధాన టెక్ నగరాలతో అనుసంధానమవుతుంది. ఈ విమానాశ్రయం ఏర్పాటుతో టెక్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇన్వెస్టర్లు, రీసెర్చర్లు విశాఖకు నేరుగా వచ్చే అవకాశం కలుగుతుంది. ఇది టెక్నాలజీ పెట్టుబడులను మరింత ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సింగపూర్ టెక్ హబ్ అయిన చంగీ విమానాశ్రయం దగ్గర ఉండటం ఆ నగర అభివృద్ధికి ఎంతగానో దోహదపడిందన్నది చరిత్ర చెప్తోన్న సత్యం.

## ఆసియా ఏఐ హబ్ -విశాఖ పాత్ర

గూగుల్ ఏఐ క్లౌడ్ సేవల ద్వారా విశాఖ ఆసియాలోనే ప్రధాన కేంద్రంగా మారే అవకాశం లేకపోలేదు. దీంతోపాటు ఏఐ ఆధారిత కంపెనీలకూ విశాఖ గమ్యస్థానంగా మారే అవకాశాలున్నాయి. ఇప్పుడు చాలామంది యువ ఇంజినీర్లు అమెరికా, కెనడా వెళ్ళిపోతున్నారు. విశాఖలో గూగుల్‌వంటి కంపెనీలు వస్తే ఈ 'బ్రెయిన్ డ్రెయిన్' తగ్గుతుంది. ప్రపంచంలో ఏఐ కంప్యూటేషన్ అవసరాలు 2030నాటికి ఐదు రెట్లు పెరగనున్నాయని అంచనా. ఈ పెరుగుదలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని నెలకొల్పిన దేశాలు, నగరాలు భవిష్యత్తులో డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ముందుంటాయి. విశాఖ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే, రానున్న 20 ఏళ్ళలో ఇది ఆసియా మ్యాప్‌లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించవచ్చు.

## వికసిత్ భారత్ 2047 -రాష్ట్రం కీలక భూమిక

వికసిత్ భారత్ 2047 విజన్‌కు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్లోబల్ టెక్ కేంద్రంగా మార్చే క్రమంలో గూగుల్ ముందడుగు కానుంది. 2047నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుంది. గూగుల్ పెట్టుబడి ఆ లక్ష్యానికి వేగం తెస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఒక వ్యాపార-అనుకూల రాష్ట్రంగా పేరు పొందింది. గడచిన ఒక సంవత్సర కాలంలో రాష్ట్రం రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. గూగుల్ డేటా సెంటర్ ఈ పెట్టుబడి ప్రవాహానికి కిరీటంలా నిలుస్తుంది.

## నూతన యుగానికి ప్రవేశద్వారం

*పోర్టు సిటీగా ఒకప్పుడు సముద్రపు ఒడ్డున నిలిచిన విశాఖ, నేడు డేటా సిటీగా డిజిటల్ సముద్రంలోకి అడుగు పెడుతోంది. గూగుల్ హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు విశాఖ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది. ఇది కేవలం ఒక ఆర్థిక మార్పు కాదు -సామాజిక, సాంస్కృతిక మార్పుకు కూడా సూచిక. రానున్న దశాబ్దాల్లో విశాఖలో పని చేసే, నివసించే, చదువుకునే ప్రతి ఒక్కరి జీవితంపై ఈ డేటా సెంటర్ ప్రభావం కనిపిస్తుంది. మెరుగైన ఇంటర్నెట్ సేవలు, ఉద్యోగావకాశాలు, అంతర్జాతీయ అనుసంధానం - ఇవన్నీ విశాఖ ప్రజలకు జీవన నాణ్యతను పెంచుతాయి. ఈ సువర్ణావకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం, ప్రైవేటు రంగం, విద్యా సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది.*




# వెల్కమ్ గూగుల్!
# థాంక్యూ లోకేష్!!



విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖలో రెండురోజుల కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు యువత ఘన స్వాగతం పలికింది. 'వెల్కమ్ గూగుల్.. థాంక్యూ లోకేష్' అంటూ నినాదాలతో విశాఖ మార్మోగింది. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తొలిసారి విశాఖ పర్యటనకు వచ్చిన లోకేష్.. ఎయిర్‌పోర్టులో దిగడంతోనే పరిసరాలు మార్మోగేలా నినాదాలు మిన్నంటాయి. విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు పెద్దఎత్తున టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ కలిసి ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. ప్లకార్డులు చేతబూని మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలికిన యువతను పలకరించారు. టీడీపీ నేత చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ (వైజాగ్)' అంటూ ప్లకార్డులు చేతబూని మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు మంత్రి లోకేష్ తరలి వెళ్లారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలకు హాజరుకానున్న పలువురు ప్రముఖులకు సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి లోకేష్ స్వాగతం పలికారు. వర్సిటీ శతాబ్ది ఉత్సవాల అనంతరం –రాత్రికి నోవాటెల్ హోటల్‌లో గూగుల్ ప్రతినిధుల గౌరవార్థం తేనీటి విందులో మంత్రి లోకేష్ పాల్గొన్నారు.














చైతన్యరథం























# ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్‌కు సాదర స్వాగతం

- ఈ నెల 28న శంకుస్థాపనతో పనులకు శ్రీకారం
- విశాఖ వాకిట నవ్యాంధ్రుల కలల సాకారం
- మంత్రి నారా లోకేష్ కృషి అనిర్వచనీయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం ఫలితం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం(చైతన్యరథం): నవ్యాంధ్రుల కలలను సాకారం చేస్తూ ఉత్తరాంధ్రకే మణిమకుటంగా అలరారే గూగుల్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తుండటం ఎంతో ఆనందంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్రాన్ని అగ్రగామిగా మలిచే క్రమంలో భాగంగా లోకేష్ కృషి అనిర్వచనీయమని ప్రశంసించారు. మంగళవారం తర్వువాడలో 266.6 ఎకరాలలో విఖ్యాత ఐటీ కంపెనీ గూగుల్ ఏర్పాటు చేయ నున్న డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగనుందని తెలిపారు. మొత్తంగా విశాఖ కేంద్రంగా మూడు చోట్ల ఏర్పాటు అయ్యే గూగు ల్ డేటా సెంటర్లకు సంబంధించి తొలి దశలో భాగంగా తర్లువాడ డేటా సెంటర్ ఏర్పాటుకు దిగ్గజ సంస్థల అధినేతలు తరలిరావ దం ఉత్తరాంధ్రకే చారిత్రక పరిణామమని అభిప్రాయపడ్డారు.

**సమర్థ నాయకత్వానికి ప్రతిబింబం**

ఇప్పటికే విశాఖ కేంద్రంగా ఐటీ నగరం అభివృద్ధి దిశగా కాగ్నిజెంట్ తో సహా కీలక సంస్థల రాక, కార్యకలాపాల నిర్వాహణ అన్నది సమర్థనీయంగా సాగడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కూటమి సర్కారు ఏర్పాటు అయి రెండేళ్లు పూర్తి కాకముందే ఇప్పటికే లక్ష కోట్ల పెట్టుబడులు రావడం ఆనందదాయకం అని, ఐటీ రంగానికి ఊతం ఇచ్చే దిశగా వైజాగ్ మెగా డేటా పార్కు లిమిటెడ్ పేరుతో 1.35 లక్షల కోట్ల రూపాయల నిధులతో అదానీ భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు అందరి కలలకూ రూపం అని అభిప్రాయపడ్డారు. విద్య, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలతో ముడి పడిన ఈ ప్రాజెక్టు రూపకల్పన నవ్యాంధ్ర సారథి చంద్రబాబు సమర్థతకు సంకేత రూపమని కొనియాడారు. విశాఖ కేంద్రం ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సెమికండక్టర్ రంగాలలో పెట్టు బడులకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న చొరవ సత్ఫలి తాలు ఇస్తోందని, గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకూ వివిధ దశలలో అటు అమెరికా కేంద్రంగానూ ఇటు విశాఖ కేంద్రంగానూ ఆయన తీసుకున్న చర్యలు పురోగామి దిశగా ఉండడం సమర్థ నాయకత్వానికి ప్రతిబింబమని ప్రశంసించారు.

**ఉత్తరాంధ్ర అంటే చంద్రబాబుకి మమకారం**

గూగుల్ హబ్ రాకతో సంబంధిత రంగాల ఆధారంగా ఏర్పాటు అయ్యే కంపెనీలలో దాదాపు రెండు లక్షల మంది వరకూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయని అంచనా. ఆ రోజు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగ అభివృద్ధికి సంబంధించి కనీస చర్యలు లేకపోవడంతో సంబంధిత వ్యవస్థలు అన్నీ కునారి ల్లాయి. మళ్లీ ఐటీ, సంబంధిత రంగాలు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నిర్ణయాల కారణంగా పునరుత్తేజం చెందాయని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర అంటే సీఎం చంద్రబాబుకు ప్రేమ అని అనేందుకు ఇదే నిదర్శనమని ప్రశంసించారు.

## ద్రోణి ప్రభావంతో పిడుగులతో వర్షాలు

**ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో అప్రమత్తం - విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరిక**




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. సోమవారం మార్కాపురం జిల్లా కంభంలో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డుస్థాయిలో నమోదైనదని పేర్కొన్నా రు. మొత్తం 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 227 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి 41 డిగ్రీలకు పైగా నమోదైనట్లు వెల్లడించారు. మంగళవారం అధిక ఉష్ణోగ్రతలతో పాటు 19 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 21 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. మరోవైపు రాయల సీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కర్నూ లు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆకస్మికంగా ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చ రించారు. మంగళవారం తీవ్ర వడగాడ్పులు వీచే మండలాలలో విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లాలో బలి జిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాలు ఉన్నాయని వెల్లడించారు.

## శేషాచలం అడవుల్లో మంటలు అదుపుచేయాలి

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం**



అమరావతి(చైతన్యరథం): తిరుపతి పట్టణానికి సమీపంలోని శేషాచలం అడవుల్లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా అటవీ సంపదకు భారీ స్థాయిలో నష్టం జర గడం దురదృష్టకరమన్నారు. వేసవి తీవ్రత తగ్గే వరకు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదానికి కొంతమంది గంజాయి, మద్యం సేవించిన ఆకతాయిలు కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్న క్రమంలో తీవ్రంగా స్పందించారు. ఘటనకు కారకులైన వారిని గుర్తించి అరెస్టు చేయాలని, అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బంది సమీప గ్రామాల ప్రజల సహకారం తీసుకుని తక్షణ నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు. శనివారం తిరుపతి పట్టణానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలోని బయోట్రిమ్ వెనుక భాగంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద ఘటనపై పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, ఇతర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంటలను సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తీసుకువచ్చే విధంగా తక్షణం చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. తిరుపతి ఘటనపై పీసీసీఎఫ్ వివరణ తీసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి వారి కార్యాలయ అధికారులను ఆదేశించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే యాంటీ ఫైర్ స్క్వాడ్ సిబ్బంది 20 మంది, పోలీసులు, మరో 10 మంది టీటీడీ సిబ్బంది మంట లను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు. యాంటీ రెడ్ శాండర్స్ స్క్వాడ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కి వెళ్లిన సమయంలో అనుమానాస్పద చర్యలపై ఓ కన్నేసి ఉంచాలి. జూన్ చివరివరకు ఉండే వేసవిలో అటవీ ప్రాంతంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టా లని సూచించారు.

# సింగపూర్‌లో మంత్రులకు ముగిసిన శిక్షణ

- డిజిటల్ పాలనపై ఏడోరోజు అధ్యయనం
- సింగ్ పాస్, హెల్త్ హబ్‌పై ఆరా
- పోలీస్ కమాండ్ సెంటర్ సందర్శన






అమరావతి/సింగపూర్(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా సింగపూర్‌లో జరుగుతున్న ఏపీ మంత్రుల ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఏడో రోజున సింగపూర్ ప్రభుత్వ డిజిటల్ పరివర్తన, పౌరసేవల్లో సాంకేతికత వినియోగంపై మంత్రుల బృందం సమగ్ర అధ్యయనం చేసింది. సింగపూర్ పర్యటనలో ఏపీ మంత్రులు కింజరాపు అచ్చె న్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనిత, సత్య కుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. సింగపూర్ ప్రభుత్వం అనుసరిస్తున్న 'డిజిటల్ టు ది కోర్, అండ్ సర్వ్ విత్ హార్ట్' అనే నినాదం మంత్రులను విశేషంగా ఆకర్షించింది. సింగపూర్ ప్రభు త్వ టెక్నాలజీ విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న టాన్ ఎంగ్ ఫెంగ్ మంత్రులకు అక్కడి డిజిటల్ వ్యూహాల గురించి వివరిం చారు. సింగపూర్ పౌరులు, నివాసితులకు అందించే అత్యంత సురక్షితమైన డిజిటల్ గుర్తింపు కార్డు సింగ్‌పాస్. దీని ద్వారా ప్రభుత్వ సేవలను అత్యంత వేగంగా, భద్రంగా ఎలా పొంద వచ్చో మంత్రులు తెలుసుకున్నారు. అలానే పౌరుల సమగ్ర మెడికల్ రికార్డ్స్, వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరిచే యాప్ హెల్త్ హబ్. ఎక్కడ ఉన్నా తమ ఆరోగ్య సమాచారాన్ని చూసుకునే వెసులు బాటు కల్పించే ఈ విధానంపై ఆసక్తి కనప రిచారు. నగర పాలనలో డిజిటల్ పబ్లిక్ సర్వీస్ విధానాలను ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై చర్చించారు.

**స్వర్ణాంధ్ర - 2047 విజన్**

సింగపూర్‌లో నేర్చుకున్న ఉత్తమ విధానాలను ఆంధ్రప్రదేశ్ లో అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా 'స్వర్ణాంధ్ర - 2047' విజన్‌లో భాగంగా రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, పారదర్శకమైన, వేగవం తమైన డిజిటల్ పౌర సేవలు, ఆరోగ్య రంగంలో సమగ్ర డిజిట ల్ డేటా నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ఏడురోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేసిన మంత్రులకు సింగపూర్ కోపరేషన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు సర్టిఫికెట్లను అందజేశారు. తమకు విలువైన సమాచారాన్ని అందించిన టాన్ ఎంగ్ ఫెంగ్‌ను మంత్రులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

**కమాండ్ సెంటర్ సందర్శన**

సింగపూర్‌లోని న్యూ ఫినిక్స్ పార్క్‌లో ఉన్న పోలీస్ ఆపరే షన్స్ కమాండ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రుల బృందం సందర్శించింది. సింగపూర్ దేశ అంతర్గత భద్రత, శాంతిభద్ర తల నిర్వహణలో పోలీస్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్ అత్యం త కీలక విభాగంగా ఉంది. దేశంలో ఏదైనా అత్యవసర పరిస్థితి, విపత్తులు, భద్రతా సమస్యలు తలెత్తినప్పుడు అన్ని ప్రభుత్వ విభాగాలను (పోలీస్, సివిల్ డిఫెన్స్ మొదలైనవి) ఏక తాటిపైకి తెచ్చి సమన్వయ పరిచే కేంద్రంగా సింగపూర్ హోమ్ మంత్రిత్వ శాఖ పరిధిలో పోలీస్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్ పనిచేస్తుం ది. సెంటర్ పనితీరు విధానాన్ని ప్రతినిధులు మంత్రుల బృందానికి వివరించారు. నగరం అంతటా ఉన్న కెమెరాలు - సెన్సార్ల ద్వారా నిరంతరం రియల్ టైమ్ మానిటరింగ్, ఏఐ/ అధునాతన డేటా అనలిటిక్స్ ఉపయోగించి నేరాలను అరికట్ట డం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం, నేరాలు, డ్రగ్స్, ఉగ్రవాదాన్ని సింగపూర్ హోంమంత్రిత్వ శాఖ ఈ కేం ద్రం ద్వారా ఎలా ఎదుర్కొంటుందో అధ్యయనం చేశారు. ఒక ఊహాజనిత సంక్షోభాన్ని సృష్టించి ఎలా పరిష్కరించాలో అధికా రులకు 'సిమ్యులేషన్ ఎక్సర్‌సైజ్' శిక్షణ నిర్వహించడం వంటి అంశాలపై మంత్రులకు అవగాహన కల్పించారు. సింగపూర్ పోలీస్ ఫోర్స్, ఇంటర్‌పోల్‌కు సంబంధించిన కీలక విభాగాలు కూడా న్యూ ఫినిక్స్ పార్క్ ప్రాంగణంలోనే ఉండటం గమనార్హం.

చైతన్యరథం

# క్రమశిక్షణ తప్పవద్దు... చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు



**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

అమరావతి (చైతన్యరథం): బెంగళూరులో స్టాండప్ కమెడియన్ శరత్‌ఉదయ్ ప్రదర్శనలో చోటుచేసుకున్న పరిణామాలపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు, సోషల్ మీడియా వినియోగదారులకు కీలక సూచనలు చేశారు.

ఏదైనా అంశంపై అభ్యంతరాలు ఉన్నప్పుడు చట్టపరమైన మార్గాల్లోనే ముందుకు వెళ్లాలి. నిబంధనల ప్రకారం ఫిర్యాదు చేయాలి తప్ప ఆవేశంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదన్నారు. 'తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు. కార్యకర్తలు భావోద్వేగాలకు లోనై పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దు. సంయమనం పాటిస్తూ, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా చూసుకోవాల'న్నారు. కొందరు వ్యక్తులు కావాలనే వివాదాలు సృష్టించి ప్రచారం పొందాలని చూస్తుంటారని అటువంటి వారి ఉచ్చులో పడి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు.

వినోదం పేరుతో సమాజంలో విద్వేషాలు నింపే ధోరణిని పల్లా శ్రీనివాసరావు తప్పుబట్టారు. రాత్రికి రాత్రే ప్రాచుర్యం పొందాలనే పిచ్చితో, భావప్రకటనా స్వేచ్ఛను అడ్డంపెట్టుకుని వ్యవస్థలను, రాజకీయ నాయకులను కించపరచడం సమర్థనీయం కాదన్నారు. కామెడీ అనేది నవ్వు పుట్టించాలి తప్ప సమాజంలో ఉద్రిక్తతలు పెంచకూడదన్నారు. పరిమితులు దాటి ప్రవర్తించే వారు ఎవరైనా సరే రాజ్యాంగం కల్పించిన చట్టపరమైన చర్యలను ఎదుర్కోక తప్పదన్నారు. "సామాజిక బాధ్యత లేని ప్రచారం తాత్కాలికమే. చట్టం ముందు ఎవరైనా లొంగాల్సిందే. కార్యకర్తలు సంయమనంతో ఉంటూనే, అభ్యంతరకర అంశాలపై చట్టబద్ధంగా పోరాడాలి." అని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# ప్రయాణికుల సేవల్లో అంతరాయం ఉండొద్దు



**మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశం**

అమరావతి(చైతన్యరథం): పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ రవాణా సేవలు ఆగకూ డదని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశిం చారు. రవాణా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవా లని మంత్రి సూచించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కా లిక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు, ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించాలని వ్యాఖ్యా నించారు. రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వల్ల ప్రయాణి కులకు అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా తమకు సహకరించాలని మంత్రి కోరారు.

# భారత్ ఏఐలో విశాఖ గూగుల్ క్లౌడ్ స్వర్ణయుగం

**ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి (చైతన్యరథం): విశాఖపట్నంలో ఏర్పాటు చేసే గూగుల్ ఏఐ డేటా సెంటర్ భారతదేశ డిజిటల్ రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవబోతోందని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండప ల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గూగుల్ క్లౌడ్ ఇండి యా ఏఐ హబ్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో దీనిని ఏపీ చరిత్రలో అతి గొప్ప ప్రాజెక్టుగా అభి వర్ణించారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక దేశం మొత్తం ఏపీ వైపు చూడడం ఖాయమన్నారు. రూ.87,520 కోట్ల పెట్టుబడితో గూగుల్ ద్వారా 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ హబ్ ఏర్పాటు ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అతిపెద్ద సింగిల్ కార్పొరేట్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడ ప్రాజెక్టుగా నిలిచిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, మంత్రి నారా లోకేష్ అకుంఠిత దీక్ష ఫలితంగానే గూగుల్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థ రాష్ట్రానికి తరలివచ్చిందని కొనియా డారు. గతంలో ఐటీ రంగానికి బీజం వేసిన చంద్రబాబు ఇప్పుడు ఏఐలో ఏపీని ప్రపంచస్థాయిలో నిలబెడుతున్నారని.. గూగుల్ లాంటి సంస్థలను ఒప్పించి ఏపీకి తీసుకురావడంలో ఆయనకు ఆయనే సాటి అని ప్రశంసించారు. ఐటీ మంత్రిగా లోకేష్ క్షేత్రస్థాయిలో చేసిన కృషి మరువలేనిది... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో విశాఖపట్నాన్ని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చాలన్న ఆయన లక్ష్యం ఈ గూగుల్ ప్రాజెక్టుతో నెరవేరబోతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాన్ని దేశంలోనే పొందుతోన్న తొలిరాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని.. ఇది నెక్స్ట్ జనరేషన్ ఏఐ టెక్నాలజీతో పాటు గ్లోబల్ డిజిటల్ ప్లాట్ ఫామ్‌లకు వెన్నుముకగా నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేసవిలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

- విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష



అమరావతి(చైతన్యరథం): వేసవిలో విద్యుత్ కోతలు లేకుం డా ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఉన్న తాధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మూడు డిస్కంల సీఎండీలు పృథ్వీతేజ, శివశం కర్, పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌లు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేసవి కాలంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజుకు సుమారు 275 నుండి 285 మిలియన్ యూనిట్ల వరకు ఉండే అవకాశం ఉందని తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా బ్రేక్‌డౌన్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. వేసవి కాలంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా గృహ, వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయ వినిగియోగ దారులకు నిరంతర సరఫరా కొనసాగించాలని స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్లు తగ్గిస్తూ.. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ అమలును మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. పథకాల సమర్ధవంతమైన అమలుకు ఉన్నతాధికారులు కూడా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటనలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్య మంత్రి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఆగస్టు నాటికి 6 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్లను తప్పక పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

# మంత్రి పయ్యావుల అర్జీల స్వీకరణ



అనంతపురం (చైతన్యరథం): ఉరవకొండ నియోజకవర్గ పరిధి లోని ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో తన క్యాంపు కార్యాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ రకాల సమ స్యలపై అర్జీలను స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వ ర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పీజీ ఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందు లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని వివరించారు. ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుం టామని తెలిపారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- సోషల్ మీడియాలో అపోహలు నమ్మొద్దు
- పెట్రోల్, డీజిల్‌పై మంత్రి నిమ్మల సమీక్ష
- కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్




పాలకొల్లు (చైతన్యరథం): పట్టణంలో మూడు ముఖ్య కూడళ్ల ల్లో వేసవి మజ్జిగ చలివేంద్రాలను మంత్రి నిమ్మల రామానా యుడు సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రతి ఏటా ధర్మా రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలో బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొరతపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృత్రిమ కొరతను అదునుగా తీసుకు పెట్రోల్ డీజిల్ బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. ఎన్నికల అనంతరం పెట్రోలు డీజిల్ ధరలు పెరుగుతాయని సోషల్ మీడియాలో వస్తున్న అపోహలు నమ్మ వద్దని సూచించారు. గత సంవత్సరం ఇదే ఏప్రిల్ నెలలో 92. 59 లక్షల లీటర్ల డీజిల్ వాడితే, నేడు 74.23 లక్షల లీటర్లు సప్లై చేశాం. అర్ధాంతరంగా హెచ్‌పీసీ ఎల్, బీపీసీఎల్, ఐవోసీ, జియో, వంటి కంపెనీలు రెండు రోజులుగా సప్లై తగ్గించడంతో కొంత సమస్య వచ్చింది. సాంకేతిక కారణాలతో మూడురోజులు పవర్ కట్, ఆక్వా, ధాన్యం కోత వంటి పనులతో తాత్కాలిక డిమాండ్ పెరిగింది. రైతులకు, ఆక్వాకు ప్రాధాన్యత ఇస్తూ కూపన్ సిస్టం పెట్టడం జరిగింది. రెవెన్యూ, వ్యవసాయ అధికా రులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. డీజిల్ బ్లాక్ చేసి ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. వాస్తవ డిమాండ్ కంటే సప్లైను పెంచడం వల్ల ఒకటి రెండురోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

# యువ నేత కృషి వల్లే విశాఖకు గూగుల్ ఏఐ హబ్

- ప్రపంచానికి డేటా షేరింగ్‌లో విశాఖ కేంద్రంగా నిలవనుంది
- విశాఖకు వైసీపీ గంజాయి తెస్తే కూటమి గూగుల్ తెచ్చింది
- గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ విశ్వప్రయత్నాలు విఫలం
- చేసేదేమీ లేక గూగుల్ తెచ్చింది మేమే అంటూ క్రెడిట్ చోరీకి యత్నం
- శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ




మంగళగిరి (చైతన్యరథం): విశాఖను గ్లోబల్ స్థాయి టెక్ నగరం తీర్చిదిద్దుతుంటే వైసీపీ మాత్రం ప్రభుత్వంపై విషం చిమ్ముతూ చంద్రబాబు అభివృద్ధి క్రెడిట్‌ను చోరీ చేసే పనిలో నిమగ్నమైందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మండిపడ్డారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదట్లో గూగుల్ వద్దని కోర్టులో పిటిషన్లు వేసి వ్యతిరేకించిన వారే నేడు క్రెడిట్ కొట్టేసే పనిలో ఉన్నారని, క్రెడిట్ చోరీ వైసీపీ సిద్ధాంతమని విరుచుకుపడ్డారు.

'ఉత్తరాంధ్రను ఆర్థిక, సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలబెట్టాలనే దృఢ సంకల్పంతో 2014లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దేలా సన్నాహాలు చేశారు. ఆయన కృషితో అనేక అంతర్జాతీయ సంస్థలు విశాఖకు వచ్చాయి. యువతకు ఐటీ రంగంలో వేలాది ఉద్యోగ అవకాశాలు దొరికాయి. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధి పూర్తిగా స్తంభించింది. అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం నగరాన్ని గంజాయి, భూకబ్జాలు, కిడ్నాప్‌లు, బ్లాక్ మనీ, లిక్కర్ మాఫియా వంటి అక్రమ కార్యకలాపాలకు కేంద్రంగా వైసీపీ నాయకులు మార్చేశారు. ప్రజలు భయాందోళనల మధ్య జీవించే పరిస్థితి ఏర్పడింది. ఐదు సంవత్సరాల పాటు ఉత్తరాంధ్రను... ముఖ్యంగా విశాఖను పూర్తిగా వెనక్కి నెట్టిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో 2024లో తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు ఉత్తరాంధ్ర అభివృద్ధిని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకున్నారు. "విజన్ 2047"లో భాగంగా విశాఖపట్నాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అదే దిశగా గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకువచ్చారు" అని తెలిపారు.

**యువ నేత కృషి ఫలితమే విశాఖలో గూగుల్ ఏఐ హబ్**

"ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతూ నిరంతర శ్రమతో గూగుల్ డేటా సెంటర్‌ను వైజాగ్‌కు తీసుకురావడంలో విజయవంతమయ్యారు. ఒప్పందం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రాజెక్ట్ గ్రౌండ్ అయి యువతకు ఉద్యోగాలు కల్పించేలానే ఉద్దేశంతో వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్ సంస్థకు 610 ఎకరాల భూమిని కేటాయించగా మంగళవారం శంకుస్థాపన జరగనుంది. ఇది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనం. ఈ ప్రాజెక్ట్ ద్వారా విశాఖపట్నం 1 గిగావాట్ డేటా హబ్‌గా ఎదుగుతుంది. సబ్‌సీ కేబుల్స్ ద్వారా ప్రపంచానికి డేటా సేవలు అందించే కేంద్రంగా మారుతుంది. క్లౌడ్ ఆపరేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, సర్వర్ తయారీ, కూలింగ్ టెక్నాలజీ వంటి రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1.80 లక్షల ఉద్యోగాలు సృష్టి అవుతాయి' అని సంతోషం వ్యక్తం చేశారు.

**గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ విశ్వ ప్రయత్నాలు**

"గూగుల్ ప్రాజెక్టుకు వైసీపీ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించింది. భూసేకరణను అడ్డుకోవాలంటూ ప్రోత్సాహకాలు, రాయితీలపై కోర్టుల్లో పిటిషన్లు వేసింది. విశాఖలో ఏర్పాటు అయ్యేది గూడౌన్ అంటూ డేటా సెంటర్‌ను తక్కువ చేసి మాట్లాడారు. కానీ కోర్టు స్పష్టంగా పెట్టుబడులకు అనుకూల వాతావరణం అవసరమని వ్యాఖ్యానించింది. పరిశ్రమలను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తే తప్పేమిటి? రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకుంటే ఏ కంపెనీ అయినా పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తాయా? వీటిని యువత భవిష్యత్తుకు మేలు కలిగించే ప్రాజెక్టులుగా పరిగణించాలని వైసీపీ నేతలకు మొట్టికాయలు వేసింది. అన్ని అడ్డంకులనూ దాటుకుని ఈ ప్రాజెక్టు ముందుకు రావడం అభివృద్ధి పట్ల ఉన్న నిజమైన నిబద్ధతకు నిదర్శనం" అన్నారు.

**గుడివాడ అమర్నాథ్‌కు ప్రశ్నల వర్షం**

'గుడివాడ అమర్నాథుని నేను సూటిగా ఒకటే ప్రశ్న అడుగుతున్నా.. మీ హయాంలో ఒక్క పరిశ్రమ అయినా వచ్చిందా? చంద్రబాబు తెచ్చిన పరిశ్రమల్ని మీరు వెళ్లగొట్టిన మాట వాస్తవం కాదా? వైజాగ్‌ని గంజాయి అడ్డాగా మార్చడం వాస్తవం కాదా? మీ నాయకుడి విలాసాల కోసం రుషికొండకు గుండు కొట్టి రూ.600 కోట్లతో ప్యాలెస్ కట్టిన మాట వాస్తవం కాదా? 22(ఎ) భూములను కబ్జా చేసి ఉత్తరాంధ్రను కబ్జాలు మయం చేసిన మాట వాస్తవం కాదా? భూముల విషయంలో మీ నాయకులు మీ ఎంపీ కుటుంబాన్నే కిడ్నాప్ చేసిన సంఘటన గుర్తులేదా?" అని ప్రశ్నించారు. ఈ రోజు విశాఖపట్నం ప్రపంచ పటంలో ఏఐ హబ్‌గా నిలబడే దిశగా ముందుకు సాగుతోంది. గూగుల్ ప్రాజెక్ట్‌తో పాటు అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా రావడానికి ఆసక్తి చూపుతున్నాయి. ఉత్తరాంధ్రలో మొత్తం 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో నారా లోకేష్ కృషి చేస్తున్నారని, ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఇక ఎవరూ ఆపలేరని... ఇది స్పష్టమైన మార్గం, భవిష్యత్తు అని అనురాధ స్పష్టం చేశారు.

# అమరావతికే తలమానికంగా డయాగ్రిడ్ టవర్స్





- అత్యాధునిక సాంకేతికతో ఎత్తయిన భవనాలు
- కోర్‌వాల్, త్రిభుజాకారపు ఇనుప స్తంభాలపైనే బరువు
- లిఫ్టులు, పాంట్రీలు తదితర వసతులు కోర్‌వాల్‌లోనే
- విశాలమైన ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉండేలా చర్యలు

అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాలను ఆధునిక దయా గ్రిడ్ టెక్నాలజీతో కళ్లు చెదిరే రీతిలో నిర్మిస్తున్నారు. రాజధానికి వచ్చేవారి చూపు తిప్పుకోనివ్వని విధంగా ఐకానిక్ టవర్లలా అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అంత భారీ ఆకాశ హర్మ్యాల్ని పూర్తి దయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మించడం దేశంలో ఇదే తొలిసారి. ప్రపంచంలో దయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మించిన ప్రసిద్ధ భవనాల్లో లండన్‌లోని 30 సెయింట్ మేరీ యాక్స్, మన్‌హటన్లోని హెర్స్ట్ టవర్, అబుదాబిలోని క్యాపిటల్ గేట్, చైనాలోని ఐఎఫ్‌సీ గువాన్ జౌ వంటివి ఉన్నాయి. ఇప్పుడు జాబితాలో అమరావతిలో నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్లు చేరబోతున్నాయి. బహుళ అంతస్తుల నిర్మాణంలో సంప్రదాయ పద్ధతుల్లో కాలమ్స్(నిలువు స్తంభాలు), బీమ్స్‌పై భవనం, స్కెలిటన్ తయారవుతుంది. భవనం బరువంతా కోర్‌వాల్‌పై కేంద్రీకృతమవుతుంది.

**విపత్తులను తట్టుకునేలా నిర్మాణం**

తీవ్రమైన గాలులు, భూ ప్రకంపనల వల్ల వచ్చే లోడ్‌ను తట్టుకునేందుకు విడిగా భవనాలకు బ్రేసింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తారు. ఇనుప కడ్డీలు, పైపులను ఎక్స్, కే వంటి ఆంగ్ల అక్షరాల ఆకారాల్లో భవ నానికి దన్నుగా ఏర్పాటు చేస్తారు. దయాగ్రిడ్ నిర్మాణంలో భవనం కింది నుంచి పై వరకు వెన్నెముకలా ఒక కోర్‌వాల్ ఉం టుంది. దాని చుట్టూ దృఢమైన ఇనుప స్తంభాలు త్రిభుజాకారంలో ఒక షెల్‌లా అమరుస్తారు. ఆ షెల్‌కు మందపాటి గాజు పలకల్ని అమరుస్తారు. దీన్ని భవనానికి స్కిన్‌గా పిలుస్తారు. భవనంలో ఎక్క డా కాలమ్స్ అన్నవే ఉండవు. కోర్‌వాల్‌తో పాటు, త్రిభుజాకారం లో అమర్చే ఇనుప స్తంభాలే మొత్తం గ్రావిటీ లోడ్‌నూ, లేటరల్ లోడ్‌నూ తీసుకుంటాయి. తుపాన్లు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినా దయాగ్రిడ్ భవనాలు చెక్కు చెదరకుండా ఉంటా యి. త్రిభుజాకారంలో అమర్చిన ఇనుప స్తంభాలు ఒక దానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. కాబట్టి భవనంలో ఏదైనా ఒక భాగం దెబ్బతిన్నా అక్కడ లోడ్ మిగతా స్తంభాలకు పంపిణీ అవుతుంది. కోర్‌వాల్ వెలుపల ఒక్క స్తంభం కూడా ఉండదు. కాబట్టి దాన్ని మొత్తం ఆఫీస్ స్పేస్‌గా వాడుకోవచ్చు. సంప్రదాయ విధానంలో నిర్మించిన భవనాల కంటే దయాగ్రిడ్ భవనాలకు స్టీల్ అవసరం 20 శాతం వరకు తక్కువ ఉంటుంది.

**షియర్‌వాల్ టెక్నాలజీతో కోర్‌వాల్**

సచివాలయం, హెచ్‌వోడీ టవర్లలో కోర్‌వాల్ విస్తీర్ణం 26- 23 విస్తీర్ణంలో ఉంటుంది. కోర్‌వాల్ అంటే నాలుగు వైపులా దృఢమైన గోడలతో చేసే నిర్మాణం. లిఫ్టులు, మరుగుదొడ్లు, పాం ట్రీ, అగ్నిమాపక వ్యవస్థలు వంటివన్నీ కోర్‌వాల్ లోపలే వస్తాయి. కోర్‌వాల్ షియర్‌వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. కోర్‌వాల్ జీఏడీ టవర్లో 16, మిగతా నాలుగు టవర్లలో 15 చొప్పున లిఫ్టులు ఉంటాయి. కొన్ని లిఫ్టులలో డ్యూయల్ కాప్స్యూల్స్ పెడుతున్నారు. ఒకే లిఫ్ట్ ఛాంబర్‌లో రెండు కాప్స్యూల్స్ పెడతారు. దయాగ్రిడ్ త్రిభుజాకారంలో అమర్చుతూ వెళ్లే కాలమ్స్ ఆకృతి బయటకు డైమండ్ ఆకారంలో కనిపిస్తుంది. ఈ ఒక్కో డైమండ్ ఆకృతి ఆరు అంతస్తులంత ఉంటుంది.

## 108 సిబ్బంది సమయస్ఫూర్తి

## రోడ్డు ప్రమాద బాధితుడికి ప్రాణదానం




సిద్ధవటం (చైతన్యరథం): మండల కేంద్రమైన సిద్ధవటం హై లెవెల్ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 అత్యవసర సేవలు సకాలంలో స్పందించి రక్షించాయి. ఆదివారం సాయంత్రం బద్వేల్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు... భాకరాపేట వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న కోటయ్య అనే వ్యక్తిని సిద్ధవటం వంతెనపై బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి ఎడమ కాలుకు తీవ్ర గాయం కావడంతో పాటు చెవి నుంచి రక్తం కారి పరిస్థితి విషమంగా మారింది.

స్థానికులు వెంటనే 108 కాల్ సెంటర్‌కు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది తక్షణం ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆపద సమయంలో త్వరితగతిన స్పందించి బాధితుడిని ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఈ ఘటనపై సిద్ధవటం ఎస్ఐ పోకల హరిక ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

## పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదం

### క్షతగాత్రుడిని క్షేమంగా ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బంది

కొచ్చెర్ల (చైతన్యరథం): పల్నాడు జిల్లా కొచ్చెర్ల ప్రధాన రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని 108 అత్యవసర సేవలు సకాలంలో స్పందించి రక్షించాయి. తెల్లవారుజామున 5:01 గంటల సమయంలో కొచ్చెర్ల మెయిన్‌రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం జరిగినట్లు 108 కాల్ సెంటర్‌కు సమాచారం అందింది. తక్షణం స్పందించిన సిబ్బంది పల్నాడు జిల్లాకు చెందిన AP16TJ1443 నెంబరు గల అంబులెన్స్‌ను ఘటనా స్థలానికి పంపించారు. ఈ ప్రమాదంలో జి.మరియా దాసు (35) తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అత్యవసరంగా వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో ఆసుపత్రికి చేర్చిన అంబులెన్స్ సిబ్బందికి బాధితుడి కుటుంబ సభ్యులు, స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

# క్రెడిట్ చోరీలో జగన్‌ది 5జీ స్పీడ్

- ఐదేళ్ల విధ్వంసానికి 'క్రెడిట్' జగన్‌ది అయితే.. అభివృద్ధి 'క్రెడిట్' చంద్రబాబుది
- అమరావతిని కాదని 'మావిగన్' అంటూ కొత్త నాటకానికి తెరలేపిన జగన్ రెడ్డి
- హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ పాలన
- జే-బ్రాండ్ మద్యం విక్రయించి వేల కోట్ల ప్రజల సొమ్ము దోచుకున్న 'క్రెడిట్' జగన్‌ది
- అధికార గర్వంతో సొంత తండ్రి ఫొటోలనే తొలగించిన చరిత్ర జగన్ రెడ్డిది
- సర్వే రాళ్ల మీద కూడా తన బొమ్మలే వేయించుకున్న ప్రచార పిచ్చి జగన్‌ది
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో "క్రెడిట్ చోరీ" అనే కొత్త రాజకీయ సంస్కృతిని ప్రవేశపెట్టిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ప్రజలకు ముందుగానే ఒక అంశంపై సందేహాలు సృష్టించి, తర్వాత అదే విషయాన్ని తమ విజయంగా ప్రకటించడం ఆయనకు అలవాటైందన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డికి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఎదుటివారి కష్టాన్ని తన ఖాతాలో వేసుకోవడమే కాకుండా రాష్ట్రాన్ని అధోగతిపాల్జేసిన క్రెడిట్ అంతా ఆయనకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. 'క్రెడిట్ చోరీ' చేయడంలో జగన్ రెడ్డికి ఎవరూ సాటిరారన్నారు. ఏ పథకమైనా, ప్రాజెక్టైనా అది ఎందుకు అవుతుందో మొదట ప్రజలను తప్పుదోవ పట్టించి తీరా అది పూర్తయ్యాక మాత్రం "నా వల్లనే అయింది" అని చెప్పుకోవడంలో ఆయన సిద్ధహస్తుడన్నారు. ఈ ఐదేళ్ల విధ్వంసానికి పూర్తి బాధ్యత ఆయనదేనని విమర్శించారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఐదేళ్ల పాటు 'మూడు ముక్కలాట' ఆడి అమరావతిని భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌దే. దేశ చరిత్రలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టిన క్రెడిట్ ఆయనది కాదా? ఈరోజు మళ్లీ అమరావతి పేరు వినపడటం ఇష్టం లేక కొత్త రాగాలు అందుకుంటున్నారు. ఐదేళ్ల పాటు అమరావతిని గ్రాఫిక్స్ అని, భ్రమ అని అవహేళన చేసిన జగన్ రెడ్డి ఇప్పుడు అదే ప్రాంతాన్ని 'మావిగన్' అని పిలుస్తూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకనే ఇలా కొత్త పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీసి ఏపీని అప్పులపాలు చేసిన క్రెడిట్ జగన్ రెడ్డిదే. ఆయన పాలనలో సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి అండర్‌వేర్ కంపెనీల వరకు అన్నీ పారిపోయాయి. కియా ఎక్స్‌పాన్షన్, అమర్ రాజా బ్యాటరీస్ వంటి సుమారు 40 భారీ పరిశ్రమలు రాష్ట్రం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి కల్పించారు.' అన్నారు.

**ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారు...**

ఐదేళ్ల కాలంలో కల్తీ మద్యాన్ని ఏరులై పారించి సుమారు 30వేల మంది ప్రజల ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేసిన పాపం ఆయనదే. రాష్ట్రవ్యాప్తంగా నాసిరకం 'జే-బ్రాండ్' మద్యాన్ని ఏరులై పారించి, ప్రజల ప్రాణాలతో ఆడుకున్న ఘనత జగన్‌ది. అదే విధంగా ఇసుక రీచ్‌లను అడ్డాగా చేసుకుని వేల కోట్లు దోచుకున్నారు. ఇసుకను సామాన్యులకు అందకుండా చేసి దాన్ని 'బంగారం' ధరతో సమానంగా అమ్మిన క్రెడిట్ పూర్తిగా ఆయనదే. ఇసుక కొరతతో రాష్ట్రంలో 21 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. వారి కుటుంబాల్లోని కోటి మంది జీవితాల్లో జగన్ రెడ్డి చీకట్లు నింపారు. కార్మికుల సంక్షేమ పథకాలను ఒకే ఒక్క జీవోతో ఆపేసి వారిని రోడ్డున పడేసిన పాపం జగన్‌కే దక్కుతుంది. ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో హత్యా రాజకీయాలను పెంపొందించారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను మానసిక వేదనకు గురిచేసి చనిపోయేలా చేశారు. సొంత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి మృతదేహాన్ని ఇంటికే 'డోర్ డెలివరీ' చేసిన భయంకరమైన సంస్కృతి జగన్ టీమ్‌ది కాదా?' అని ప్రశ్నించారు.

'పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్టు అబద్ధపు ప్రచారం చేసుకున్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును రివర్స్ టెండరింగ్ పేరుతో నాశనం చేశారు. నిర్వాసితులు పరిహారం అడిగితే "మన దగ్గర ఏమైనా మనీ ప్రింటింగ్ మిషన్ ఉందా?" అని వెటకారం చేయడం ఆయన అహంకారానికి నిదర్శనం. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ వ్యవస్థను కూడా వాడుకుని అడ్డగోలుగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ప్రతి రూపాయినీ దోచుకోవడమే లక్ష్యంగా పాలన సాగించార'ని మంత్రి విమర్శించారు.

**జగన్‌కి బొమ్మల పిచ్చి**

రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం తల తీయించిన చరిత్ర, అంతర్వేది రథానికి నిప్పంటించిన ఘనత జగన్ ప్రభుత్వానిదే. ఆంజనేయ స్వామి విగ్రహాలను ధ్వంసం చేయించి కనీసం ఎంక్వైరీ కూడా లేకుండా కేసులను క్లోజ్ చేసిన 'క్రెడిట్' ఆయనదే. గోవిందరాజ స్వామి గుడిలో బంగారు తాపడం దొంగతనం జరిగినా, పరకామణిలో దొంగతనం జరిగినా "అది చిన్న విషయమే" అని కొట్టిపారేసిన మీ గొప్ప మనసుని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు.

రాష్ట్ర భవిష్యత్తును, రాబోయే పాతికేళ్ల మద్యం ఆదాయాన్ని కూడా ముందే తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన ఘనత మీది కాదా? అని మంత్రి ప్రశ్నించారు. భూముల సర్వే రాళ్ల మీద, రైతుల పాస్‌బుక్కుల మీద తన బొమ్మ వేయించుకున్న వింత చరిత్ర జగన్‌ది. "తెల్లవారితే ప్రజలందరూ నా ముఖమే చూడాలి" అనే అహంకారంతో, చివరికి చనిపోయిన సొంత తండ్రి ఫొటోను కూడా పక్కనపెట్టి తన బొమ్మలే వేయించుకున్న ప్రచార పిచ్చి ఆయనది. సొంత బాబాయిని హత్య చేయించి, ఆ క్రెడిట్ కూడా మీరే పొంది, భోగాపురం ఎయిర్‌పోర్ట్ విషయంలో బోగస్ మాటలు చెప్పి ప్రజలను నమ్మించాలని చూశారు. చివరికి ఆస్తుల కోసం సొంత తల్లిని, చెల్లిని బయటికి గెంటేసిన 'ఘనత' కూడా జగన్ రెడ్డిదే. ఇది ఎవరికీ సాధ్యం కాని 'అరుదైన క్రెడిట్' అని మంత్రి ఎద్దేవా చేశారు.

**అరాచకానికి కేరాఫ్...**

సొంత పార్టీ కార్యకర్తలను కారు కింద వేసి చంపిన చరిత్ర జగన్ రెడ్డిది. 70 మంది తెలుగుదేశం కార్యకర్తలను పొట్టనబెట్టుకుని, అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంటికి తాళాలు వేసి పార్టీ కార్యాలయాలపై దాడులు చేయించిన అరాచకవాది జగన్. అగ్రిగోల్డ్ భూములను సైతం వదలకుండా తన మంత్రుల బినామీ పేర్ల మీద రాయించుకున్న ఘనత ఆయనదే. ఎస్సీలను వేధించి, వారిని కించపరిచిన చరిత్ర కూడా మీ ఖాతాలోనే ఉంది. డార్క్ రూమ్‌లో కూర్చుని 'వన్ మ్యాన్ షో' చేస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాల్జేశారు. "ఒక్క ఛాన్స్" అని బతిమాలితే ప్రజలు నమ్మి ఓటు వేశారు. కానీ మీ అసలు రంగు చూసిన తర్వాత జనం ఛీత్కరించి మిమ్మల్ని 11 సీట్లకే పరిమితం చేశారు. అయినా బుద్ధి రాకుండా ఇంకా విష ప్రచారాలు చేస్తూనే ఉన్నారు. ఈ నెల 5న కడపలో జరిగిన ఘటన జగన్ రెడ్డి విష ప్రచారానికి పరాకాష్ట. పెల్లమల్లి రమణమ్మ అనే మహిళతో ప్రెస్‌మీట్ పెట్టించి, అంబులెన్స్ ఆలస్యం వల్లే తన భర్త చనిపోయాడని అబద్ధాలు చెప్పించారు. కానీ అసలు నిజం ఏంటంటే.. అది వైసీపీ నాయకుడు నిత్యానంద రెడ్డి, దస్తగిరి అనే వ్యక్తుల మధ్య ఉన్న రియల్ ఎస్టేట్ గొడవ. ఆ గొడవను ప్రభుత్వం మీదకు నెట్టాలని చూడటం సిగ్గుచేటు. తన బినామీల ద్వారా కుట్రలు చేస్తూ చనిపోయిన వారిని కూడా రాజకీయం కోసం వాడుకుంటున్న జగన్ రెడ్డి నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి సుభాష్ అన్నారు.

**దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట**

"గొడ్డలి నాది.. బాబాయి నావాడు.. నరుక్కుంటే మీకెందుకు?" అన్న జగన్ రెడ్డి ధోరణినే వైసీపీ నాయకులు అలవర్చుకున్నారు. కడపలో వైసీపీ నాయకుడు నిత్యానందరెడ్డి, తన బినామీ అయిన దస్తగిరిని రియల్ ఎస్టేట్ గొడవలతో చంపేశారు. చంపిన వ్యక్తి వైసీపీ, చనిపోయిన వ్యక్తి వైసీపీ.. కానీ రాజకీయం కోసం ఆ మృతుడి భార్యకు డబ్బు ఆశ చూపి, అంబులెన్స్ లేట్ వల్లే చనిపోయాడని అబద్ధాలు చెప్పించడం సిగ్గుచేటు. ఒక ప్రాణం పోతే ఆ కుటుంబాన్ని పరామర్శించాల్సింది పోయి గంటల వ్యవధిలోనే అంబులెన్స్ వచ్చినప్పటికీ.. కావాలని ఆలస్యమైందని ప్రెస్ మీట్లు పెట్టించడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. ఈ 'డైవర్ట్ పాలిటిక్స్'ను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్‌లు రోగులపాలిట సంజీవనిలా పనిచేస్తున్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో మారుమూల గ్రామాలకు కూడా ఈ సేవలు అందుతున్నాయి. గడిచిన 10 నెలల్లో అత్యవసర కేసుల్లో 108 సిబ్బంది వెంటనే స్పందించి సుమారు లక్ష మందికి పైగా ప్రాణాలను కాపాడారు. అంబులెన్స్ ఆలస్యమంటూ దుష్ప్రచారం చేసిన అదే జిల్లాలో (కడప), చింతకొమ్మలదిన్నె మండలం అలంకారపల్లిలో జరిగిన ఘటనే మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. అర్ధరాత్రి 12:01 గంటలకు ఫోన్ చేస్తే... కేవలం 18 నిమిషాల్లోనే అంబులెన్స్ (ఏపీ 39 యూ 8735) అక్కడికి చేరుకుంది. తీవ్రంగా గాయపడిన నలుగురిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడి మా సిబ్బంది నిజమైన ప్రాణదాతలుగా నిలిచారు. 108 సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి రాత్రీ, పగలూ తేడా లేకుండా సేవలు అందిస్తున్నారు. అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వైసీపీ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని మంత్రి కోరారు.

**జగన్‌కు మానసిక స్థితి సరిగా లేదు**

'గతంలో "అమరావతి సాధ్యం కాదు.. అది ఒక భ్రమ" అన్న అదే నోటితో, ఈరోజు అభివృద్ధి జరుగుతుంటే "మా వల్లే జరిగింది" అని చెప్పుకోవడం హాస్యాస్పదం. గతంలో ఇదే అర్సెలార్ మిట్టల్ గురించి మాట్లాడుతూ.. "ఈ ప్రాజెక్ట్ అసలు సాధ్యమే కాదు, ఈ రాష్ట్రానికి రాదు" అని అదే నోటితో అసత్య ప్రచారం చేసిన వ్యక్తి జగన్ రెడ్డి. తీరా ఇప్పుడు చంద్రబాబు చొరవతో ఆ సంస్థ వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్రానికి వస్తుంటే, "మా వల్లే వచ్చింది" అని చెప్పుకోవడం ఆయన వింత ప్రవర్తనకు నిదర్శనం. పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించే నాయకుడు చంద్రబాబు కాబట్టే ఇంతింత పెద్ద సంస్థలు ఏపీకి వస్తున్నాయి. ఐదేళ్ల పాటు పరిశ్రమలను తరిమేసిన జగన్ రెడ్డి ఇప్పుడు వస్తున్న కంపెనీలకు తన బొమ్మ వేసుకోవాలని చూడటం 'క్రెడిట్ చోరీ' కాక మరేమిటి? ఇలాంటి క్రెడిట్ చోరీలకు పాల్పడితే పసిపిల్లవాడు కూడా మిమ్మల్ని చూసి నవ్వుతాడు. ఐదేళ్లలో విధ్వంసం చేసిన 'క్రెడిట్' తప్ప మీకు మరేమీ దక్కదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక విజనరీ ఉన్న నాయకుడు. ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, పెట్టుబడులను వెల్లువెత్తేలా చేస్తున్నారు. ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేక జగన్ రెడ్డి మానసిక వ్యథతో పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే ప్రజలకు జాలి వేస్తోంది. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమంతో వైసీపీ నేతలతో 'మైండ్ గేమ్' ఆడుతున్నారు. జగన్ రెడ్డి తన మానసిక స్థితిని కోల్పోయి మాట్లాడుతున్నారు. అందుకే చంద్రబాబు ఒక మంచి పరిష్కారం చూపారు. వైజాగ్‌లో యోగా డేని ఘనంగా నిర్వహించడమే కాకుండా జగన్ రెడ్డి వంటి వారు రోజుకు రెండు గంటలు యోగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి యోగా ప్రాక్టీస్ చేసి మానసిక ఉల్లాసం పొందాలి. అలా చేస్తేనే కనీసం యథాస్థితికి వచ్చి ప్రజల దగ్గర కొద్దిగా అన్నా గౌరవం తెచ్చుకోగలరు. అపహాస్యం పాలు కాకుండా హుందాగా ఉండటం నేర్చుకోవాలి' అని మంత్రి సుభాష్ హితవు పలికారు.

## మార్కెట్‌ను ముంచెత్తిన పచ్చడి మామిడి

**- కొత్తపల్లి కొబ్బరి 100 కాయలు రూ.2500**

తాడేపల్లిగూడెం(చైతన్యరథం): మార్కెను కొత్తపల్లి పచ్చడి మామిడి కాయలు ముంచెత్తాయి. గత వారంతో పోల్చుకుంటే అధిక సంఖ్యలో మామిడి కాయలు వచ్చాయి. కొత్తపల్లి మామిడి అత్యధిక ధర పలికింది. నాణ్యత ఆధారంగా ఈ ధరలను వ్యాపారులు నిర్ణయించారు. కొత్తపల్లి కొబ్బరి 100 కాయలు రూ.2000 నుంచి 2500 వరకు అమ్మారు. పెద్ద రసాలు రూ.1500 నుంచి 2000, చిన్న రసాలు రూ.1000 నుంచి 1500, సువర్ణరేఖ రూ.800 నుంచి 1000, కలెక్టర్ (తోతాపురి) రూ.800 నుంచి 1200 వరకు విక్రయాలు జరిగాయి. అయితే హోల్‌సేల్‌గా మాత్రం కొత్తపల్లి కొబ్బరి 100 కాయలు



రూ.1500 నుంచి 1800, పెద్దరసాలు రూ.1200 నుంచి 1500, చిన్నరసాలు రూ.800 నుంచి 1200, సువర్ణరేఖ రూ.500 నుంచి 800, తోతాపురి రూ.600నుంచి 1000 మధ్య విక్రయాలు జరిగాయి.

## ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిల చెల్లింపు ప్రారంభం

అమరావతి(చైతన్యరథం): ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ అనుబంధ ప్రైవేటు ఆసుపత్రులకు బకాయిల చెల్లింపును ప్రభుత్వం ప్రారంభించింది. ఒప్పందానికి అనుగుణంగా 25 ఆసుపత్రులకు రూ.62 కోట్లు చెల్లించింది. అందుకు సంబంధించిన నివేదికను సోమవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు అధికారులు అందజేశారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 323 ఆసు పత్రుల యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్ విధానంలో రూ.వెయ్యి కోట్లు జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. వైద్య సేవల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తమకు రూ.3 వేల కోట్ల బకాయి ఉందని ఈ ఏడాది మార్చిలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం వెల్లడించింది. దాంతో ప్రభుత్వం చర్చలు జరిపి బకాయిలు చెల్లిస్తా మని ప్రకటించింది. దీంతో ఏప్రిల్ నెలాఖరు నుంచి ఈ చెల్లింపు లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

చైతన్యరథం

# ద్వారంపూడి ప్రోత్సాహంతో వారసత్వ ఆస్తి కబ్జా

- కాకినాడ మాజీ మేయర్ భర్త సుంకర విద్యాసాగర్‌పై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- వైసీపీ ఎంపీటీసీ దౌర్జన్యం.. చట్టబద్ధంగా కొన్న భూమి సరిహద్దుల ఆక్రమణ
- ఇంటిని ముంచేలా వంక నీటి మళ్లింపు... వైసీపీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని వినతి
- కల్లూరులో భూదందా... నకిలీ డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు
- అర్జీలు స్వీకరించిన కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు
- సమస్యల పరిష్కారానికి నేతల కృషి



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

కాకినాడ జిల్లా జిల్లా గైగోలుపాడుకి చెందిన వెంకటరమణ అర్జీ... కాకినాడలో మా కుటుంబానికి చెందిన సుమారు రూ.10 కోట్ల విలువైన వారసత్వ ఆస్తిని గత ప్రభుత్వ అండదండలతో కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో అప్పటి వైపీపీ మేయర్ భర్త సుంకర విద్యాసాగర్, సుంకర మాధవకృష్ణ, నా సోదరుడు అనుసూరి సుబ్రమణ్యం కలిసి ఈ అక్రమానికి పాల్పడ్డారు. ఫోర్జరీ సంతకాలతో కూడిన దస్తావేజులు సృష్టించి తప్పుడు సర్వే రిపోర్టులు, తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మా ఆస్తిని కాజేశారు. గత మూడేళ్లుగా ఈ స్థలాన్ని వారి ఆధీనంలో ఉంచుకుని ప్రస్తుతం అక్కడ "శ్రీనివాసం" పేరుతో అక్రమంగా ఒక అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

సత్యసాయి జిల్లా రొద్దం మండలం దందేపల్లికి చెందిన కిష్టప్ప వినతి... చిన్నమంతూరులోని సర్వే నెం.17లో నేను 17 సెంట్ల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశాను. దీనికి అన్ని పత్రాలు, స్పష్టమైన సరిహద్దులు ఉన్నాయి. గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ హరిజన తిమ్మయ్య నా భూమి సరిహద్దులను ఆక్రమించుకోవడమే కాకుండా నాకు కనీసం దారి లేకుండా అడ్డుకుంటున్నాడు. నేను నా భూమిలోకి వెళ్లకుండా దౌర్జన్యం చేయడమే కాక దాడికి కూడా పాల్పడ్డారు. ఈ అన్యాయంపై ఇప్పటికే కలెక్టర్‌కి, ఎస్పీకి, ప్రభుత్వ యంత్రాంగానికి పలు మార్లు ఫిర్యాదులు చేశారు. తహసీల్దారు, పోలీసులు ఇప్పటిదాకా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టిపల్లెకి చెందిన చంద్రశేఖరనాయుడు వినతి... మా గ్రామంలో 118 సెంట్ల పట్టా భూమి ఉంది. ఇందులో 20 సెంట్ల స్థలాన్ని వంక (వాగు) కోసం వదిలిపెట్టి మిగిలిన స్థలంలో నేను ఎంతో కష్టపడి 18 సెంట్లలో ఒక ఇల్లు నిర్మించుకున్నాను. మిగతా స్థలం ఖాళీగా ఉంది. గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకుడైన ఈశ్వరయ్య నా ఖాళీ స్థలాన్ని ఆశించి దౌర్జన్యంగా వంక నీరు నా ఇంటి మీదకు, నా 18 సెంట్ల స్థలంలోకి వచ్చేలా మళ్లించాడు. దీనివల్ల వర్షం వస్తే వంక నీరంతా నా ఇంట్లోకి వచ్చి నివసించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఇప్పటికే తహసీల్దారు, సీఐలకు ఫిర్యాదు చేశాను. విచారణ కోసం గ్రామ సర్వేయర్‌కు రూ.10వేలు లంచం ఇచ్చినా ఇప్పటిదాకా నా భూమిని సర్వే చేయలేదు సరికదా ఎటువంటి న్యాయం జరగలేదు.

కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన మహమ్మద్ ఖాన్ విజ్ఞప్తి... మా గ్రామంలో 7.07 ఎకరాల భూమి 1947 నుంచీ మా స్వాధీనంలో ఉంది. మా తాతలు, తండ్రుల పేరిట రికార్డులు ఉండి మేము సాగు చేసుకుంటున్న సొంత భూమి ఇది. కొంతకాలంగా భూ ఆక్రమణదారులు మా భూమిపై కన్నేసి, నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారు. మేము భూమిలోకి వెళ్తుంటే దౌర్జన్యానికి దిగుతూ ప్రాణహాని తలపెడుతున్నారు. ఎటువంటి చట్టబద్ధమైన హక్కులూ లేకపోయినా సదరు భూమిలో అక్రమంగా అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లను అడ్డం పెట్టుకుని రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకుంటున్నారు.

కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఏసుబాబు వినతి... 2018లో ఏలేశ్వరానికి చెందిన ఆకేటి సుబ్బారావు వద్ద ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలోని 182, 247-1ఎ, 236/1 సర్వే నెంబర్లలో మొత్తం 2.50 ఎకరాల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశాను. పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉంది. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో 2.50 ఎకరాలకు బదులుగా 1.86 ఎకరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. సర్వే నెం. 247-1ఎ లో అసలు భూమి లేకపోయినా నాకు భూమి అమ్మిన వ్యక్తి ఆకేటి సుబ్బారావు పేరు మీద భూమి ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. రెవెన్యూ అధికారులు అతడికి సహకరిస్తూ రికార్డులు సరిచేయకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం మాల్యావంతం గ్రామానికి చెందిన మారెక్క అర్జీ... నాకు ఆరోగ్యం బాగాలేక చికిత్స కోసం బత్తలపల్లికి చెందిన జి.సాయమ్మ వద్ద రూ. 5లక్షలు అప్పు తీసుకున్నాను. దానికి ప్రతిఫలంగా నాకున్న 419-1బి4లోని 2.50 ఎకరాల భూమిని వడ్డీ లేకుండా ఆమె అనుభవించేలా (గుత్తకు) ఒక బాండ్ పేపర్ రాసి ఇచ్చాను. కేవలం అప్పు కోసం మాత్రమే భూమిని ఆమెకు అప్పగించాను తప్ప అమ్మలేదు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ఇల్లు, సామాన్లు, నిత్యవసరాలు అన్నీ కాలిపోయి సర్వస్వం కోల్పోయాను. ఈ విషయంలో సహాయం కోసం అప్పటి తహసీల్దారును ఆశ్రయించాను. విచారణ సమయంలో అధికారులు తన నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని సహాయం చేస్తామని చెప్పి నా దగ్గర సంతకాలు చేయించుకున్నారు. ఆ సంతకాలను అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వ హయాంలో అధికారులు నా 2.50 ఎకరాల భూమిని జి.సాయమ్మ పేరున ఆన్‌లైన్ చేసి ఆమెకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చేశారు.

బాపట్ల జిల్లా రేపల్లె మండలం వేజళ్ళవారిలంకకు చెందిన వెంకటేశ్వరమ్మ వినతి... 2011లో భట్టిప్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా సర్వే నెం.364/4లో 0.40 ఎకరాల భూమి కొనుగోలు చేశాను. వెబ్ ల్యాండ్‌లో పేరు నమోదు కోసం 15 ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాను. విచిత్రం ఏమిటంటే ఒక అధికారి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేస్తే, ఆ తర్వాత వచ్చే అధికారి ఆ పేరు తొలగిస్తున్నారు. ఇలా ఇప్పటికే మూడుసార్లు జరిగింది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందంటే.. ఒకే భూమికి రెండు వేర్వేరు ఖాతా నంబర్లు (1359, 2514) కేటాయించి గందరగోళం సృష్టించారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో నా భూమికి సంబంధించిన ఎల్‌పీఎం 2028ను, అసలు సంబంధం లేని 'చిలకా విజయరత్నం' అనే వ్యక్తి పేరుకు అనుసంధానం చేసి, నోషనల్ ఖాతా (100900) జారీ చేశారు. నా భర్తకు ఆయన పూర్వీకుల నుంచి వచ్చిన 0.30 ఎకరాల భూమిని కూడా అధికారులు వేరే వ్యక్తుల ఖాతాల్లో కలిపేశారు.

## జగన్ దళం రెడ్లమయం..

# వినిపించని బీసీ గళం

- ఐదేళ్ల పాలనలో చిత్రహింసలు పెట్టారు
- అణచివేసిన దుష్టశక్తులు ముఖ్యఅతిథులా
- నేడు ప్రేమ ఒలకబోస్తూ సభలు పెడితే నమ్మరు
- వారంతా బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- టీడీపీ బీసీ ప్రజాప్రతినిధుల మండిపాటు



అనంతపురం(చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో బీసీ నేతలను అత్యంత దారుణంగా అవమానించి రాజకీయంగా అణచివేసి అక్రమ కేసులు, నిర్బంధాలతో చిత్రహింసలకు గురిచేసిన నీచ చరిత్ర వైకాపాదేనని తెలుగుదేశం బీసీ ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనంతపురం ఆర్అండ్‌బీ అతిథిగృహం లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, అనంతపురం, హిందూపురం ఏంపీలు కాలవ శ్రీనివాసులు, అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబును, తెలుగుదేశం పార్టీని నిందించడమే లక్ష్యం గా ఆదివారం అనంతపురంలో వైసీపీ ఆధ్వర్యంలో రాయలసీమ బీసీ గళం పేరుతో సభ నిర్వహించారని మండిపడ్డారు. దశాబ్దాలు గా బలహీన వర్గాలకు అడుగడుగునా అన్యాయం చేస్తున్న వారు, వారి వారసులు సభలో కనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమ గడ్డపై బలహీనవర్గాల స్వాతంత్ర్యాన్ని అణిచివేసిన రెడ్లు ముఖ్యఅతిథులా అంటూ ప్రశ్నించారు. "జగన్ బలగం... రాయల సీమ రెడ్ల దళం..వినిపించని బీసీ గళం"గా వైసీపీ సభ జరిగిందని ఎద్దేవా చేశారు. బీసీ సభలో గళం వినిపించిన నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి వాళ్లు బీసీలను అణచివేసిన దుష్టశక్తులని ఆరోపించారు. ఇలాంటి వాళ్ల గళం బీసీల గళం ఎలా అవుతుం దని మండిపడ్డారు. వీరి వాలకం చూస్తుంటే బీసీలపై జగన్ విషం కక్కేందుకు ఉపయోగించిన సొంత సైన్యంలా తనకు అనిపించిం దన్నారు. సభలో అంబేద్కర్, జ్యోతీబా పూలే పక్కన జగన్, పెద్దిరెడ్డి ఫొటోలు పెట్టి వారికి వాళ్లు వారసులు అన్నట్లుగా ఆ పార్టీ చూపిస్తుందా అంటూ ప్రశ్నించారు. జగన్ హయాంలో ముగ్గురు రెడ్లకి రాష్ట్రాన్ని అప్పచెప్పారని..అధికారం ఉన్నా లేకున్నా ఆ పార్టీ లో నిండుకున్నది రెడ్ల సామాజికవర్గమేనని స్పష్టం చేశారు. వారికి మినహా మిగిలిన మైనార్టీలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు ఇతరత్రా ఏ సామాజికవర్గానికి కూడా ఆ పార్టీలో ప్రాధాన్యం లేదని పేర్కొ న్నారు.

### వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం

వైకాపా పాలనలో నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య సహా 76 మంది బీసీలను హతమార్చారని ఆరోపించారు. అలాగే 2540 మందిపై దాడులు చేయించారని, మరో 650 మందిపై అక్రమ కేసులు బనాయించాలని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించారన్నారు. దాంతో దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు. దళిత బిడ్డలకు విదేశీ ఉన్నత విద్యను అందించాలని గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన "అంబే ద్కర్ విదేశీ విద్య నిధి" పథకానికి అంబేద్కర్ పేరును తొలగిం చారని, మహాత్మ జ్యోతిబా పూలే స్మృతివనం ఏర్పాటుకు పది ఎకరాల స్థలం కేటాయిస్తే. దాన్ని కూడా రద్దు చేసిన చరిత్ర వైకాపా ప్రభుత్వానిదేనని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### అప్పుడు వేధింపులు..ఇప్పుడు మొసలికన్నీరు

అధికారంలో ఉన్నప్పుడు అంతగా బీసీలపై కక్షగట్టిన పార్టీ నేడు అధికారం చేజారాక మొసలి కన్నీరు కారుస్తోంది. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచే సమాజంలో బీసీలకు రాజకీయ చైతన్యం మొదలైంది. అప్పటినుండి నేటి చంద్రబాబు నాయుడు పాలన వరకు తెలుగుదేశం పార్టీనే బీసీల పార్టీగా బలమైన ముద్ర వేసుకుందని గుర్తు చేశారు. నాడు బీసీల గొంతు కోసి నేడు చంద్రబాబును, టీడీపీని తిట్టడానికి సభలు పెడితే ప్రజలు ఎలా విశ్వసిస్తారని కాలవ నిలదీశారు. బీసీల ఎదుగుదలకు అడుగ డుగునా అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌ను జగన్ రద్దు చేస్తే సీఎం చంద్రబాబు సరిచేసి పనిలో ఉన్నారని పేర్కొన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏ ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తుందో చర్చకు రావాలని వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సవాల్ విసిరారు. బీసీల ను దుర్మార్గంగా అణిచివేస్తున్న సామాజికవర్గం ఆటలు తెలుగు దేశం ప్రభుత్వంలో సాగవని హితవు పలికారు. కూటమి ప్రభు త్వంపై, చంద్రబాబుపై బురదజల్లేందుకు రాయలసీమ బీసీ గర్జన సభను నిర్వహించారని ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ ఆరోపించారు. వైసీపీ బీసీలకు చేసిన ద్రోహానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావే శంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదినారాయణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో ఆకట్టుకున్న సైకత శిల్పం

**● గుగూల్ డేటా సెంటర్ రాకతో ఐటీ మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేసిన టీడీపీ యువనేతలు చింతకాయల విజయ్, ఎం.వి ప్రణవ్ గోపాల్**




విశాఖపట్నం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు పలు ఐటీ కంపెనీలను తీసుకువచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తరుణంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేస్తూ సైకిత శిల్పం రూపొందించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్ ఎం.జీ.ఎం ఆవరణలోని సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన ఈ సైకత శిల్పం సందర్శకులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన పురస్కరించుకొని, గూగుల్ డేటా సెంటర్ విశాఖకి తీసుకురావటంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి విశాఖ నిరుద్యోగుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ, జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ లోకేష్ అన్న, థ్యాంక్ క్యూ లోకేశ్ అన్న ఇట్లు వైజాగ్ అంటూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటంతో కూడిన ఈ సైకత శిల్పాన్ని రూపొందించిన సైకిత శిల్ప కళాకారుడు బాలాజీ వర ప్రసాద్‌ను వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా వి.ఎం.ఆర్.డి. ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విశాఖ ఏఐ హబ్‌గా మారబోతోందని పేర్కొన్నారు. వెనుక బడిన ఉత్తరాంధ్ర ఉపాధితో ఉత్తమ ప్రాంతంగా మారుతుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మార్చేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర యువత తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

# వైసీపీని వీడి టీడీపీలో చేరిన 200 మంది కార్యకర్తలు

**● పార్టీలో ఆహ్వానించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**



పలాస (చైతన్యరథం): నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు భారీ షాక్ తగిలింది. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు స్వగ్రామం దేవునల్తాడ గ్రామానికి చెందిన వంద మంది వైసీపీ కార్యకర్తలు కుటుంబాలతో సహా.. గత ఆదివారం ఎమ్మెల్యే గౌతు శిరీష సమక్షంలో టీడీపీలో చేరారు. వీరితోపాటు కొత్తపేట పంచాయతీకి చెందిన 200 మంది వైసీపీ కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పలాసలోని టీడీపీ కార్యాలయంలో వారందరికీ ఎమ్మెల్యే శిరీష పసుపుకండువాలు కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మరింత బలోపేతమైందని, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే శిరీష కోరారు. టీడీపీ చేరిన వారంతా మాట్లాడుతూ.. వైసీపీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మా కులానికి చెందినవాడిగా మాజీమంత్రికి అండగా నిలిచాం. పదవిలో ఉన్నప్పుడు మా గ్రామాన్ని అభివృద్ధి చేయలేదు. కూటమి పాలనలో ఎమ్మెల్యే గౌతు శిరీష సమర్థవంతంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు నేరుగా ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. మహిళగా ఆమె పడుతున్న కష్టాన్ని గుర్తించి.. తాము అండగా ఉండాలని టీడీపీలో చేరామ'ని గుంటు వాసు, గుంటు బాలకృష్ణ, సీత బాలరాజు తదితరులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, గోవిందు పాపారావు, పుచ్చ ఈశ్వరరావు, తులే అప్పోజి పాల్గొన్నారు.

# విజయనగరం జిల్లాలో సమృద్ధిగా ఇంధన నిల్వలు

విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో డీజిల్, పెట్రోల్ కొరతలేదని కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, ఎస్పీ ఏ. ఆర్. దామోదర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వై కూడలి, జొన్నాడ వద్ద ఉన్న పెట్రోల్ బంకులను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంకుల యజమానులతో మాట్లాడి నిల్వలను పరిశీలించారు. అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని చెప్పారు. బ్లాక్ మార్కెట్లో వీటి విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్ కొరత ఉందని అసత్య ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెప్పారు. వారివెంట తహసీల్దార్ నీలా కూర్మనాథరావు, పౌర సరఫరా, పోలీస్ శాఖల అధికారులు ఉన్నారు.

# శ్రీకూర్మనాథ ఆలయ అభివృద్ధికి ఉపరాష్ట్రపతికి వినతి

**● అరసవల్లి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక అభ్యర్థన**



శ్రీకాకుళం (చైతన్యరథం): నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మూడు కీలక అంశాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వగృహంలో ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణకి ఎమ్మెల్యే గొండు శంకర్ వినతిపత్రం సమర్పించారు. శ్రీకూర్మనాథ ఆలయం సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ మరియు వారసత్వ సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోనే కూర్మ అవతారానికి అంకితమైన అరుదైన ఆలయంగా దీనికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, మౌలిక సదుపాయాల కొరత వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆలయ ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడంతో పాటు, వసతి, పారిశుద్ధ్యం, రవాణా వంటి సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం పరిధిలోకి చేర్చి, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ ఆలయం రాష్ట్రంతో పాటు పొరుగు ప్రాంతాల నుండి భారీగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉండటంతో, యాత్రికులకు తగిన సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలను వేగవంతంగా ఆమోదించి అభివృద్ధి పనులు ప్రారంభించాలన్నారు. ఇక కళింగపట్నం–శ్రీకాకుళం–పార్వతీపురం రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించి జాతీయ రహదారిగా ప్రకటించాలని కూడా వినతిలో ప్రాధాన్యంగా ప్రస్తావించారు. ఈ మార్గం ఒడిశా రాష్ట్రాన్ని అనుసంధానించే ముఖ్య రహదారిగా ఉండటంతో పాటు, యాత్రికులు మరియు సాధారణ ప్రజల రాకపోకలకు కీలకంగా మారిందని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించి పనులు ప్రారంభించాలంటూ ఉపరాష్ట్రపతిని ఎమ్మెల్యే గొండు శంకర్ వినయపూర్వకంగా కోరారు.

# పెట్టుబడులకు విశాఖ గమ్యస్థానం : ఎమ్మెల్యే గంటా




భీమిలి (చైతన్యరథం): పెట్టుబడులకు విశాఖ గమ్యస్థానంగా మారుతోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, విశాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఆనందపురం మండలం తరువాడ గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి అనేది స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకూ అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మైక్రో సాఫ్ట్ మాదిరిగా విశాఖకు గూగుల్ గేమ్ ఛేంజర్ కాబోతుందన్నారు. సీఎం చంద్రబాబు విజన్‌కు... మంత్రి లోకేశ్ యాక్షన్ తోడైతే... గూగుల్ డేటా సెంటర్ లాంటి అద్భుతాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. 21 నెలల్లో విశాఖకు తరలివచ్చిన ఐటీ కంపెనీలు ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతున్నాయన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రహేజా, బ్రూక్ ఫీల్డ్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థల రాకతో విశాఖ అభివృద్ధి ముఖచిత్రమే మారిపోతుందని అభిప్రాయపడ్డారు. పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు మొదటి వరసలో ఉందని వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్టు కూడా అందుబాటులోకి రానున్న నేపథ్యంలో విశాఖ అభివృద్ధి ఎవరూ ఊహించలేరన్నారు. ఇంతటి చారిత్రక ఘట్టంలో భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. పరిశ్రమ స్థాపించిన వారితో పాటు భూములిచ్చిన రైతు సంతోషంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు దిశానిర్దేశం మేరకు రైతులంతా సంతృప్తి చెందేలా అందరికీ పరిహారం చెల్లించామని తెలియజేశారు. శంకుస్థాపన అనంతరం రైతులతో సమావేశమై ఇతర అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# అంగన్వాడీల్లో ఉద్యోగాలు.. మొదటి విడత 2,645 పోస్టులకు నోటిఫికేషన్

**● కీలక ప్రకటన చేసిన రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



సాలూరు (చైతన్యరథం): ఏపీలోని పలు మినీ అంగన్వాడీ సెంటర్లను గతేడాది కూటమి ప్రభుత్వం అప్– గ్రేడ్ చేసింది. వీటిని మెయిన్ సెంటర్లుగా మార్చింది. ఇందులో పనిచేసే ఆయాలనే కార్యకర్తలుగా నియమించింది. దీంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏపీ మొత్తం 5 వేల హెల్పర్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు తాజాగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ప్రకటించారు. అయితే, వీటిని రెండు దశల్లో భర్తీ చేస్తామని.. మొదట 2,645 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. అంగన్వాడీల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేల హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఆమె వెల్లడించారు. మంత్రి సంధ్యారాణి సోమవారం పార్వతీపురంలో మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మినీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు.

వాటిల్లో పనిచేసే ఆయాలకు పదోన్నతి కల్పించడంతో వారు అంగన్వాడీ కార్యకర్తలుగా బాధ్యతలు తీసుకున్నారని మంత్రి వివరించారు. వీరికి టీచర్ హోదా ఇచ్చి, చట్టబద్ధమైన జీతాలు, విధులు కల్పించనున్నట్లు వివరించారు. ఈ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. మొదటి విడతలో 2,645 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన పోస్టులను రెండో విడతలో భర్తీ చేస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మొత్తంగా 5 వేల ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. నియామకాలు పారదర్శకంగా చేపడతామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో మొత్తం 257 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ కేంద్రాల సేవలను మరింత వేగంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం మొత్తం 58,204 మంది కార్యకర్తలు , సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు ఇటీవలే ప్రభుత్వం స్మార్ట్ 5 జీ ఫోన్లు అందించింది. కాగా, కేంద్రం ప్రారంభించిన ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, సురక్ష బీమా యోజనను అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వర్తింపజేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల అంగన్వాడీ కార్యకర్తలకు ప్రయోజనం కలగనుంది. 18 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉన్నవారికి పీఎం జీవనజ్యోతి యోజన వర్తింపజేస్తున్నారు. అయితే, ఈ పథకం కింద ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా ప్రమాదం లేదా సహజ మరణం సంభవించినా రూ. 2 లక్షలు బీమా వస్తుంది.

# నిప్పుల కొలిమిలా రాష్ట్రం... వాతావరణ శాఖపై అలర్ట్

● బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



ఆంధ్రప్రదేశ్‌ను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భానుడి భగభగలతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయి. తాజాగా వాతావరణ శాఖ మరియు విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. రాష్ట్రంలో 23 మండలాల్లో ప్రమాదకరమైన స్థాయిలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరో 26 మండలాల్లో కూడా ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని ఈ ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా 49 మండలాల్లో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు వాతావరణశాఖ అధికారులు. ప్రధానంగా ఉత్తరాంధ్ర మరియు రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. విజయనగరం జిల్లాలో 8 మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలాలకు వడగాల్పుల హెచ్చరికలు జారీ చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం ప్రాంతాలు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, మార్కాపురం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత నమోదు అయ్యే అవకాశం ఉంది. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని.. ప్రభుత్వం , వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. శరీరం డీ హైడ్రేషన్ బారినపడకుండా ఉండేందుకు దాహం వేయకపోయినా క్రమం తప్పకుండా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ లాంటి ద్రావణాలను తీసుకుంటూ ఉండాలని సూచిస్తున్నారు. ఎండలో వెళ్లాల్సి వస్తే కాటన్ దుస్తులు ధరించాలని,గొడుగు లేదా టోపీని తప్పనిసరిగా వాడాలని సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ, ఎండల తీవ్రతను తక్కువ అంచనా వేయకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.



# నాణ్యతా లోపంతో కోత విధించడానికి వీల్లేదు : కలెక్టర్ లక్ష్మీషా



గంపలగూడెం (చైతన్యరథం): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో నాణ్యతా లోపంతో కోతవిధించి ధర తగ్గించేందుకు రైస్ మిల్లుల యజమానులకు అనుమతి ఇవ్వలేదని జిల్లా కలెక్టర్ లక్ష్మీషా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ గంపలగూడెంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. రైతుల నుంచి క్వింటాల్ ధాన్యం తీసుకుంటే ఆ మొత్తానికి మద్దతు ధర చెల్లించాల్సిందేనన్నారు. తగ్గింపుపై ఇంతవరకు ఎటువంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదన్నారు. గోనె సంచులు కూడా కొరత లేకుండా రైతులందరికీ అందిస్తామన్నారు. రైతులు జీపీఎస్ సౌకర్యంతో తమ వాహనాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే రవాణా ఛార్జీ చెల్లిస్తామన్నారు.

# నర్సాపురం పార్లమెంటరీ పరిధిలో చేరికలు

తణుకు (చైతన్యరథం): నర్సాపురం పార్లమెంటరీ పరిధిలోని తణుకు నియోజకవర్గం అత్తిలి, ఇరగవరం మండలంలోని ఫోకస్ బూత్ 6, 133, 210ల్లో సుమారు పది కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరాయి. వారికి తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు, ఫోకస్ బూత్ అబ్జర్వర్ పార్టీ కండువాలు కప్పి ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# 72వ రోజు ప్రజల వద్దకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బెల్లంకొండ మండలం మన్నేసుల్తాన్‌పాలెం, శ్రీ రామాంజనేయపురం గ్రామాల్లో 72వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 1.55 కోట్లతో నిర్మించిన డ్రైనేజీలు, సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన పాలనతో దేశ చరిత్రలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు శాశ్వత స్థానాన్ని సంపాదించారని ఆయన పాలనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న లింక్ రోడ్లను నిర్మించడంతో పాటు డొంక రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎమ్మార్వో, ఎంపిడిఓ, మండల, గ్రామ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల రుణం

● గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశం



దెందులూరు (చైతన్యరథం): రైతులు మరియు పశువుల పెంపకందారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిసాన్ క్రెడిట్ కార్డు అమలుపై మాట్లాడుతూ "అర్హులైన ప్రతి రైతుకు, పశుపోషకునికి రూ. 2 లక్షల వరకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణం అందేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ రుణాల ద్వారా లభించే తక్కువ వడ్డీ ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పశువుల పెంపకందారులకు, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు వల్ల కలిగే లాభాలను వివరించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అని సూచించారు. మంజూరైన రుణాలను వ్యవసాయం మరియు పశుపోషణ అభివృద్ధికి మాత్రమే వాడేలా రైతులకు మార్గదర్శకత్వం చేయాలనీ, తద్వారా వారికి మెరుగైన ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బ్యాంకర్లతో అధికారులు సమన్వయం చేసుకోవాలనీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. గ్రీవెన్స్‌కు విచ్చేసిన పలువురు బాధితుల సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఓపికగా విని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సేవలో ఎక్కడా రాజీ పడబోమని, ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ స్థాయి అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# టీడీపీలో పది కుటుంబాల చేరిక



ఏలూరు (చైతన్యరథం): ఏలూరు పార్లమెంటు పరిధి పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు మండలం చిగురుమామిడి ఫోకస్ బూత్-50లో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అమరావరపు అశోక్, పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఫోకస్ బూత్ అబ్జర్వర్ పట్నాల వెంకటేష్ సమక్షంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

**దుర్గం పంచాయతీలో 80 మంది టీడీపీలో చేరిక**

అరకు : హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ పరిధిలోని ఫోకస్ బూత్ 119,120ల్లో వైసీపీకి చెందిన 80 మంది టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సియారి దొన్నుదొర, మండల శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

**విజయనగరంలో 300 కుటుంబాలు టీడీపీలో చేరిక**

విజయనగరం : విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బూత్ నెంబర్లు 1,4,73,76, విజయనగరం 36వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ బాలి పద్మావతి, బాలి కృష్ణారావు దంపతులు, బమ్మెర ప్రమీల ఆధ్వర్యంలో 300 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



# పెట్రోల్ కొరత... ఆ వదంతులను నమ్మకండి : కలెక్టర్ కె.వెట్రి సెల్వి

ఏలూరు (చైతన్యరథం): జిల్లా కేంద్రమైన ఏలూరులోని పలు పెట్రోల్ బంకులను జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు ఫైరేషన్ సెంటర్లోని భారత్ పెట్రోలియం బంకును జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ కలిసి పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ నిల్వలపై బంకు యజమానితో మాట్లాడారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్నారు.

## అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోండి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరగడానికి వీలు లేదని, రేపు ఉంటా కదా అనుమతులు లేకుండా అనధికారికంగా అక్రమ మైనింగ్ జరిగితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హాను ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ కృత్రిమ నియంత్రణలో భాగంగా వినుకొండకు వచ్చిన జెసి సంజనా సిన్హా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ను కలిసి చర్చించారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. అక్రమ మైనింగ్ పై రెవిన్యూ పోలీస్ మైనింగ్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని చీఫ్ విప్ జీవి ఆదేశించారు. నియోజకవర్గంలో జరిగే ప్రజా ప్రయోజనాల అభివృద్ధి పనులకు అవసరమైన మట్టి, ఇసుక సరఫరాకు సంబంధించిన అనుమతులు అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినుకొండలో అక్రమ వెంచర్లకు వెళుతున్న మట్టి తరలింపు అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన జెసి సంజనా సిన్హా మాట్లాడుతూ అక్రమంగా మైనింగ్ పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రమ మైనింగ్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలతో పాటు ఫైన్లు వేయటం జరుగుతుందని హెచ్చరించారు.

**డీజిల్, పెట్రోలు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు..**

డీజిల్, పెట్రోల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా జెసి సంజనా సిన్హా సోమవారం వినుకొండ పెట్రోలు బంకులను సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, జెసి సంజనా సిన్హా విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్ డీజిల్ కొరత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ విప్ జీవి ఆదేశించారు.

## పెట్రోల్ కొరతపై అపోహలు సృష్టించవద్దు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- బంకుల వద్ద తనిఖీలు, ప్రభుత్వ కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతుంది
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



గుంటూరు (చైతన్యరథం): పెట్రోల్ కొరతపై ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని, పెట్రోల్ బంకుల వద్ద ప్రభుత్వ కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గళ్ళా మాధవి పేర్కొన్నారు. సోమవారం పెట్రోల్ కొరతపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి బృందావన్ గార్డెన్స్ సెంటర్, లాడ్జి సెంటర్ సహా పలు పెట్రోల్ బంకులను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బంకు నిర్వాహకులతో మాట్లాడి నిల్వ వివరాలు తెలుసుకొని నిల్వ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... ప్రస్తుతం కనిపిస్తున్న పెట్రోల్ కొరత అసలు కొరత కాదని, కేవలం కృత్రిమ కొరత వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కొన్ని ప్రచారాల కారణంగా ప్రజలు ముందుగానే భారీగా పెట్రోల్ నింపుకోవడంతో అవసరం ఒక్కసారిగా పెరిగి, బంకులపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. దుకాణాలు మూసివేయడానికి కూడా ఇదే కారణమని, ముందస్తుగా నిల్వలు కొనుగోలు చేయడం వల్ల సాధారణ సరఫరా కంటే ఎక్కువ అవసరం ఏర్పడిందని నిర్వాహకులు వెల్లడించినట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెట్రోల్ బంక్ యజమానులు, ఆయిల్ సంస్థలతో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతి పెట్రోల్ బంక్ వద్ద ఒక గ్రామ రెవెన్యూ అధికారి, ఒక పోలీసు సిబ్బందిని నియమించి కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. అలాగే జిల్లా కలెక్టర్ కూడా పరిస్థితిని సమీక్షిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## గూగుల్ భారీ పెట్టుబడి కొత్త ఊపిరి పోసింది : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): పెట్టుబడిదారులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంవైపు మళ్లించడం వెనకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల పాత్ర, కృషి మాటల్లో వర్ణించలేనిది. ఏపీ ప్రభుత్వ సులభతర వాణిజ్య విధానాలు, ఇండస్ట్రియల్ పాలసీలు అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల దృష్టిని విశేషంగా ఆకర్షించడంలోనూ వారిరువురి పనితీరు అద్భుతం. వారు సాధించిన అతిపెద్ద విదేశీ పెట్టుబడి అయిన గూగుల్.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి. నేడు ముఖ్యమంత్రి చేసేది గూగుల్ సంస్థ శంకుస్థాపన కాదు... రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నూతన ప్రతిష్ఠాపన. దేశంలోని పలు ప్రధాన రాష్ట్రాల కంటే వేగంగా ఏపీ నాయకత్వం సకాలంలో స్పందించినందునే రాష్ట్రానికి అతిపెద్ద భారీ విదేశీ పెట్టుబడి వచ్చింది. గూగుల్ సంస్థ రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో రాష్ట్రానికి భారీ ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఈ పెట్టుబడి గ్రౌండింగ్‌తో వెనుకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్ర ప్రాంతం భవిష్యత్ లో ప్రపంచ ఏఐ గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా తొలి అడుగు పడనుంది. ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి ఏఐ నైపుణ్యాలపై అవగాహన ఏర్పడుతుంది. అదేవిధంగా సబ్ మెరైన్ కేబుల్ కనెక్టివిటీ ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ సమాజంతో దృఢమైన అనుసంధానం ఏర్పడుతుంది. హైస్పీడ్ ఫైబర్ నెట్ వర్క్‌తో విశాఖ నగరం ఏఐ సాంకేతికతకే ప్రపంచ డెస్టినేషన్‌గా మారుతుంది.

**విశాఖ నగర ప్రత్యేక భౌగోళిక ప్రాధాన్యతలు.. ఉత్తరాంధ్రఅభివృద్ధికి అదనపు బలం**

గూగుల్ పెట్టుబడి సాధనలో కూటమి ప్రభుత్వం చూపిన విజన్ పట్ల ప్రపంచ పారిశ్రామిక వర్గాల్లో విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. విశాఖ నగరానికి ఉన్న భౌగోళిక ప్రాధాన్యతలు పారిశ్రామిక వర్గాల్ని విశేషంగా ఆకర్షిస్తూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అదనపు బలంగా మారుతున్నాయి. పారిశ్రామికవేత్తల అంతరంగంతో, రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా ప్రభుత్వం వారికి తగిన ప్రోత్సాహకాలు, రాయితీలు అందించడం నిజంగా చాలా గొప్ప పరిణామమనే చెప్పాలి." అని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతంపై ఎంపీ కేశినేని శివనాథ్ దిశానిర్దేశం



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే కొండంత బలంగా పార్టీకి అండగా ఉంటారని కార్యకర్తలకు తగినటువంటి ప్రాధాన్యత ఇచ్చే పార్టీ టీడీపీ అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు వ్యాఖ్యానించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో కార్యకర్తలతో వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వ పథకాల అమలుపై సుదీర్ఘంగా ఎంపీ కేశినేని శివనాథ్ చర్చించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... టీడీపీలో కార్యకర్తల అసలైన అధినేతలను కేడర్ లీడర్ అనే తేడా లేకుండా అందరూ సమానంగా ప్రాధాన్యత పొందే పార్టీ ఒక్క టీడీపీని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్తని నాయకుడిగా తీర్చిదిద్దడమే పార్టీ లక్ష్యమని కేడర్ సైతం అవకాశాలను అందిపుచ్చుకోవడం తెలుసుకోవాలని కోరారు. ప్రజలకు మంచి చేస్తే వారు నిరంతరం గుర్తుంచుకుంటారని సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దే అవకాశం టీడీపీ కల్పిస్తుందని, సామాన్య కార్యకర్తగా వచ్చి నేడు పార్టీలో అత్యున్నతమైన పదవులలో ఉన్న వారు ఎందరో ఉన్నారని తెలియజేశారు. పార్టీని ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసి ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకువెళ్లాలని ఎంపీ శివనాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## జలహారతిలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

- గండేపల్లి గ్రామంలో అధికారులతో, కూటమి నేతలతో కలిసి పర్యవేక్షణ...



నందిగామ (చైతన్యరథం): నియోజకవర్గంలోని కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన జలధార జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులు, కూటమి నేతలతో కలిసి పర్యటించి, గ్రామీణ అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు సమర్థవంతంగా అమలు కావాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థులతో మాట్లాడిన తంగిరాల సౌమ్య, "జలధార కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వలు పెరిగి, రైతులకు సాగు నీరు అందుబాటులోకి వస్తుంది. ఇది ఉపాధి హామీతో పాటు గ్రామీణ అభివృద్ధికి పునాది వేస్తుంది" అని పేర్కొన్నారు.

### యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా క్రీడలను ప్రోత్సహించాలి

ఉయ్యూరు (చైతన్యరథం): ఉయ్యూరు మండలం, ఆకునూరు గ్రామంలో ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ యువత అధ్యక్షులు రామినేని కుటుంబయ్య సహకారంతో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నేటి సమాజంలో యువత చెడు అలవాట్లకు గురై అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి టోర్నమెంట్ల ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడమే కాకుండా, వాళ్లను మంచి మార్గంలోకి వెళ్లే విధంగా తీర్చిదిద్దిన వారం అవుతామని, ఇంతటి చక్కని టోర్నమెంటును నిర్వహిస్తున్న రామినేని కుటుంబయ్య గారిని, ఆకునూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువత పాల్గొన్నారు

## జగ్గయ్యపేటలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): రోజు రోజుకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేలా జగ్గయ్యపేట పట్టణంలోని బుద్ధయ్య మెడికల్ షాప్ వద్ద నియోజకవర్గ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాటసారులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మంచి చేయడంలోనే ఆనందం



## నెల్లూరు కలెక్టర్ హిమాన్ను శుక్లా

కావలి (చైతన్యరథం): వెంగళరావు నగర్‌లో సుమారు రెండు వేల కుటుంబాలకు ఎంతో కొంత మంచి చేశాననే సంతృప్తి కలిగింది" అని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల అన్నారు. సోమవారం కావలి పట్టణంలో పర్యటించిన ఆయన, ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంగళరావు నగర్‌లో నిర్వహించిన చుక్కల భూమి విముక్తి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఈ సమస్యపై ప్రత్యేకంగా చర్చించినప్పుడు 24 గంటల్లో పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చానని, ఆ మేరకు అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యను పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా పనిచేశారని, వారికి అభినందనలు తెలిపారు. కావలి పట్టణం గోల్డెన్ సిటీగా మారుతుందని, పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడంతో వచ్చే రెండేళ్లలో ఊహించని అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. చుక్కల భూముల సమస్యలు ఎక్కడైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, రెండు రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ, దమ్మున్న అధికారులు ఉంటే ఎంతటి సమస్యనైనా పరిష్కరించవచ్చని ఈ ఘటన నిరూపించిందన్నారు. కలెక్టర్ హిమాన్ను శుక్లా, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లకు కావలి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సుమారు 190 ఎకరాల చుక్కల భూముల సమస్య పరిష్కారంతో వెంగళరావు నగర్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని, ఈ రోజు కావలి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అనంతరం చుక్కల భూముల సమస్యను పరిష్కరిస్తూ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ ఉత్తర్వుల కాపీలను లబ్ధిదారులకు అందజేశారు.

# ఇంధన సమస్యపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడి



కోవూరు (చైతన్యరథం): వేసవి తీవ్రత కారణంగా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. బుచ్చిరెడ్డి పాళెం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు. మండలంలోని 13 పంచాయతీల నుంచి తాగునీటి ఎద్దడి, రోడ్ల మరమ్మతులు, పంట కాలువల పూడికతీత, భూ వివాదాలు, ఇళ్ల స్థలాలు ఇలా వివిధ సమస్యలపై దాదాపు రెండు వందల మందికి పైగా ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారికి వినతి పత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ఓపికగా ఆలకించిన ఆమె అక్కడికక్కడే అధికారులను పిలిచి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ం కలిగితే ఆక్వా రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి సరిచేయాలని స్పష్టం చేశారు. డీజిల్ కొరతపై స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో నియోజకవర్గంలో ఇప్పటికే గిట్టుబాటు ధర, గోతాల కొరత వంటి సమస్యలను అధిగమించామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# శప్తభూమిని తడిపిన గొప్ప సీఎం చంద్రబాబు

## ఎమ్మెల్యే సింధూర, మాజీమంత్రి పల్లె, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి శ్రీరామ్



బుక్కపట్నం (చైతన్యరథం): గతంలో జలయజ్ఞం ధనయజ్ఞంగా మారితే.. దానిని మళ్లీ జలయజ్ఞంగా మార్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బుక్కపట్నం మండలం మారాల రిజర్వాయర్ నుంచి ముదిగుబ్బ మండలం గుంజేపల్లి చెరువుకు నీటిని విడుదల చేశారు. గత కొన్ని రోజులుగా గుంజేపల్లి ప్రాంతంలో కనీసం తాగునీరు కూడా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న సమయంలో పరిటాల శ్రీరామ్ చొరవ తీసుకున్నారు. మారాల రిజర్వాయర్లో నీరు సమృద్ధిగా ఉన్న నేపథ్యంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి నీరు విడుదల చేయాలని కోరారు. మొదట మారాల ప్రాంతంలో ప్రజలు ఇబ్బంది పడతారని చెప్పినప్పటికీ.. హంద్రీనీవా ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మంచి మనసుతో రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి దీనికి ఒప్పుకున్నారు. దీంతో సోమవారం సాయంత్రం మారాల రిజర్వాయర్ నుంచి గుంజేపల్లి చెరువుకు నీటిని ఒక పండుగ వాతావరణంలో విడుదల చేశారు. దీనిపై ఇరు ప్రాంతాల్లో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ సాధారణంగా ఒక ప్రాంతంలో నీటిని మరో ప్రాంతానికి తీసుకెళ్తే.. ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తారని.. కానీ ఇక్కడ ప్రజలు ఎంతో మంచి హృదయంతో స్వాగతించారని అన్నారు. 2014 ముందు హంద్రీనీవా పనులు ముందుకు సాగక.. కేవలం డబ్బు కోసమే పనులు అన్న విధంగా అప్పటి నేతలు వ్యవహరించారన్నారు. ఆ తర్వాత హంద్రీనీవా నీటిని ఇటు కుప్పం అటు మడకశిర వరకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అప్పట్లో ఈ కాలువ నిర్మాణం వేగవంతం కావడానికి మంత్రులుగా ఉన్న పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. నీరు కావాలని అడిగిన వెంటనే పెద్ద మనసుతో ఒప్పుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మారాల ప్రాంత ప్రజలకు శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక ప్రాంతానికి నీరు ఇస్తున్నామంటే కేవలం వ్యవసాయం, తాగునీటి సమస్య తీర్చడమే కాకుండా అక్కడ ప్రజల జీవన విధానం మారుతుందన్నారు. అనంతపురం జిల్లాను కరవు పట్టిపీడిస్తున్న సమయంలో చాలామంది కవులు ఈ ప్రాంతాన్ని శప్తభూమిగా పరిగణించే వారని గుర్తు చేశారు. శప్తభూమి అంటే శపించబడిన భూమి అని అర్థం అని శ్రీరామ్ వివరించారు. అలాంటి శప్తభూమిని నీటితో తడిపి శాప విమోచనం చేసిన గొప్ప సీఎం చంద్రబాబు అని అన్నారు.



# సత్వరం డీజల్, పెట్రోల్ సమస్య పరిష్కారం

## వాహనదారులకు కోటంరెడ్డి సోదరుల భరోసా

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): అధికారులతో, పెట్రోల్ బంక్ యజమానులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు. వాహనదారులకు ఎక్కడా అంతరాయం కలక్కుండా చర్చలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్రోల్, డీజిల్ పై ప్రత్యేక దృష్టి పెట్టి, డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. కొందరు పనికట్టుకొని ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. వదంతులు నమ్మి ఆందోళనకు గురికావద్దని వినియోగదారులకు పిలుపునిచ్చారు.

# టీడీపీలోకి 'కటిక' సోదరులు

ఎమ్మిగనూరు (చైతన్యరథం) ఎమ్మిగనూరు పట్టణంలోని 9, 10, 11 వార్డులకు చెందిన మైనార్టీ సోదరులు, కటిక సోదరులు తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మిగనూరు అబ్జర్వర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి హృదయపూర్వకంగా ఆహ్వానించారు. 150, 156, 136 బూత్‌లకు సంబంధించిన ప్రత్యేక ప్రణాళికలను వారి సమక్షంలో వివరించి పార్టీలో చేరిన వారిని ప్రోత్సహించారు. ఈ చేరికల ద్వారా టీడీపీ బలోపేతానికి మరింత ఊపిరి అందింది. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ ఆత్మీయ స్వాగతం పలికి రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.



# సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం



మైదుకూరు (చైతన్యరథం): ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కడప జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం పనులను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి . యువ నాయకుడు పుత్త లక్ష్మారెడ్డి పరిశీలించారు.

# ఉపాధి కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించండి

## అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



రాప్తాడు (చైతన్యరథం): వేసవి కాలం దృష్ట్యా ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె సోమవారం ఉదయం పరిశీలించారు. కూలీలు ఎంత మంది హాజరయ్యారన్నది చూశారు. ఆ తర్వాత తానే స్వయంగా హాజరును నమోదు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పనులు చేసేందుకు ఇబ్బందిగా ఉందని కూలీలు అన్నారు. వేసవిలో కూలీలకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. షామియానాలు, తాగునీరు కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. ఉదయం కొంత తొందరగా పనులు ప్రారంభించి.. త్వరగా ముగించేలా అధికారులు చూడాలన్నారు. 11తర్వాత బయట ప్రాంతాల్లో పనులు చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుదని, దీనిని దృష్టిలో ఉంచుకుని పనుల కేటాయింపులు చేయాలన్నారు. కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఎప్పటికప్పుడు నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. ఈ రెండు నెలల పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె వెంకటాపురం సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. వేసవి కాలంలో పంటలకు నీరు అందిస్తున్నారా లేదా.. పంటలు ఎలా ఉన్నాయన్నది చూశారు. అలాగే భూగర్భజలం ఏమైనా తగ్గిందా అన్నది కూడా తెలుసుకున్నారు. పంటలకు ఎప్పటికప్పుడు నీరు అందించాలన్నారు. కూలీలు కూడా ఉదయం, సాయంత్రం మాత్రమే పనిలో ఉండాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని.. మధ్యాహ్నం వేళ పనులు చేయించవద్దని ఎమ్మెల్యే సూచించారు.



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలు, ఓపి విభాగంలో చికిత్సకు వచ్చిన రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, దీనికి అనుగుణంగా సిబ్బంది కట్టుబడి పనిచేయాలని తెలిపారు. పేషెంట్లకు అందిస్తున్న భోజనాన్ని తిని ఆహార నాణ్యతని పరిశీలించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## పులివెందుల టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి

పులివెందుల (చైతన్యరథం): పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల విన్నపాలను స్వయంగా స్వీకరించాను. ?గత ఐదేళ్ల కాలంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించి, వారికి మెరుగైన సేవలందించడమే మన కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రజల నుండి అందిన అర్జీలపై తక్షణమే స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపేందుకు సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగిన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకమైన పాలనను అందిస్తామని మీకు భరోసా ఇస్తున్నాను. మీ కష్టసుఖాల్లో తోడుంటూ, పులివెందుల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.అని భరోసా ఇవ్వడం జరిగింది..

# మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం

## పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ రఘునాథ్ రెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే దేశం ఆర్థిక అభివృద్ధి చెందుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి సాయి ఆరామం లో సోమవారం డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వచ్చిన 196 మంది డ్వాక్రా మహిళా గ్రామైక్య సంఘాల సహాయకులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి డీఆర్డీఏ పీడీ నరసయ్య చేతుల మీదుగా మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థన చేపట్టారు. అంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, మహిళా సాధికారికతను లక్ష్యంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని డ్వాక్రా గ్రామ సంఘాల మహిళా సహాయకుల పనితీరును మరింత సమర్థవంతం చేయడానికి ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తూ, మొత్తం 196 మంది మహిళా సహాయకులకు మొబైల్ ఫోన్లు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, డి.ఆర్.డి.ఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ సువర్ణ, డీఆర్డీఏ ఏపీవోలు సత్యనారాయణ సుభద్ర, సువర్ణ రవీంద్ర హాజరయ్యారు.



# పెట్రోల్, డీజిల్ తీవ్ర కొరతపై చర్యలు తీసుకోవాలి

## జేసీ నూరుల్ ఖమర్‌ను కోరిన ఆర్వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

కర్నూలు (చైతన్యరథం): జిల్లాలో పెట్రోల్, డీజిల్ తీవ్ర కొరత ఏర్పడి, ప్రజల సాధారణ జీవనం పూర్తిగా దెబ్బతిని ప్రజల్లో తీవ్ర ఆందోళన, అసంతృప్తి పెంచుతోందని కావున పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, జిల్లా కార్యదర్శి కె. రాము జేసీ నూరుల్ ఖమర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది డీలర్లు పెట్రోల్, డీజిల్‌ను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరాను తక్షణమే సాధారణ స్థితికి తీసుకురావాలని,నిల్వలు దాచిపెట్టే మరియు అక్రమంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



# బీసీ గళం కాదు.. పక్కా వైసీపీ రాజకీయ డ్రామా!

## అనంత టీడీపీ అధ్యక్షుల కౌంటర్

అనంతపురం (చైతన్యరథం): నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ నిన్న వైసీపీ వాళ్లు బీసీ గళం నిర్వహణపై విమర్శలు గుప్పించారు. వైసీపీ అధికారం వచ్చాక వడ్డేర, నాయీ బ్రాహ్మణులు, చేనేత కార్మికులకు కనీస పనిముట్లు ఇవ్వకుండా మోసం చేశారని మండి పడ్డారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడిన తీరు చాలా సిగ్గు చేటన్నారు. సూపర్ సిక్స్ సూపర్ గురించి మాట్లాడినప్పుడు ఒక్క సారి మీ అబద్దాలు గుర్తు చేసుకోవాలని సూచించారు. పెన్షన్ వేయి రూపాయలు పెంచడానికి ఐదేళ్ళు పట్టిందని, అదే మా నాయకుడు ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం ఒకేసారి పెంచారని గుర్తు చేశారు. .బీసీల అభివృద్ధి కోసం పని చేసిన నాయకుడు ఎవరు అంటే స్పష్టంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబేనని, మంత్రి నారా లోకేష్ బీసీ యువతకు ఉపాధి, నైపుణ్య, అభివృద్ధి, అవకాశాల పెంపు కోసం ఎప్పటికప్పుడు కార్యక్రమాలు పథకాలు తీసుకొస్తూ బీసీ సమాజాన్ని బలోపేతం చేసే దిశగా పనిచేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీల కోసం తీసుకున్న నిర్ణయాలు ఒక్కొక్కటి చరిత్రలో నిలిచిపోతాయన్నారు. బీసీల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసివారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బీసీ కుటుంబాలకు లోన్లు, సబ్సిడీలు, పథకాల ద్వారా ప్రత్యక్ష సహాయం అందించారన్నారు. విద్యలో వెనుకబడిన బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలు కల్పించారన్నారు. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి, వారిని నిర్ణయాత్మక స్థానాల్లో నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పలు చైర్మన్లు, డైరెక్టర్లు నాయకులు పాల్గొన్నారు.





# విదేశీ నేలపై తెలుగు దీపం

## పియోరియాలో ఉత్సాహంగా 'మన బడి' పిల్లల పండుగ

**అరిజోనా, పియోరియా:** భాష అంటే కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు... అది ఒక సంస్కృతి, ఒక గుర్తింపు, ఒక తరం నుంచి మరో తరానికి చేరే వారసత్వం. దానిని పరిరక్షించే ప్రయత్నాల్లో 'మన బడి' చేస్తున్న కృషి పియోరియాలో మరోసారి ప్రతిఫలించింది. సియెర్రా వెర్డే స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన 'మన బడి' పిల్లల పండుగ తెలుగు కుటుంబాలకు ఒక సాంస్కృతిక వేడుకగా నిలిచింది.

సుమారు 350 మందికి పైగా హాజరైన ఈ ఉత్సవం సంప్రదాయ దీప ప్రజ్వలనతో ఆరంభమైంది. వినాయక ప్రార్థనలు, తెలుగు భక్తి గీతాలు ఆధ్యాత్మికతను జోడించాయి. అదే సమయంలో అరిజోనా మన బడి సమన్వయకర్త బాలాజీ తండ్రి మరణం నేపథ్యంలో సభికులు రెండు నిమిషాలు నివాళులర్పించడం... ఈ వేడుకలో మానవీయతకు కూడా చోటు ఉందని గుర్తు చేసింది.

ఆ తర్వాత కనిపించింది చిన్నారుల ప్రతిభ, వారి శ్రమ, భాష పట్ల వారి ప్రేమ. బాల బడి నుంచి ప్రభాసం వరకు వివిధ స్థాయిల్లో ఉన్న విద్యార్థులు తెలుగు నాటికలు, కూచిపూడి నృత్యాలు, పద్యపఠనం, గేయాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా తెలుగు పాటలపై చిన్నారులు అందించిన ప్రదర్శనలు అక్కడి వాతావరణాన్ని ఉత్సాహంతో నింపాయి. ఈ ప్రదర్శనల్లో ప్రతి ఒక్కరి వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం స్పష్టంగా కనిపించింది.

పియోరియా ప్రాంతీయ సమన్వయకర్త శ్రీనివాస్ డోకి తన ప్రసంగంలో మన బడి ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ... ఫీనిక్స్‌లో చిన్నగా ప్రారంభమైన ఈ ఉద్యమం నేడు విస్తృతమైందని తెలిపారు. తెలుగు భాషాభ్యాసం పిల్లల్లో కేవలం చదువు మాత్రమే కాదు... విలువలు, సంస్కారం, కుటుంబ అనుబంధాన్ని పెంపొందిస్తుందన్నారు. రాబోయే కాలంలో మరింత మంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం విజయవంతానికి శ్రీనివాస్ డోకి, దీపక్ పైడిమర్రి, వంశీ కృష్ణ ఇరువారం, పద్మజ, లత, మల్లికార్జున్ ఇరగం, దివ్య, నీలిమ, శిరీష, రుష్మ తదితరులు సమిష్టి కృషి చేశారు. బాల గురువులు శిశిర్, అన్విత, షమిత, అదితి, కార్తీక, అనూహ్య, ఆర్యన్, అంజన, ఆకాశ్, యశస్వి కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొన్నారు.

వీడియో చిత్రీకరణను అరుణ్ సమర్థవంతంగా నిర్వహించగా, కేన్యాన్ పార్టీ ప్లానెర్స్ అందించిన అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సిద్ధం చేసిన విందు ఆకట్టుకుంది.

సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమం కేవలం వినోదం మాత్రమే కాకుండా ఒక విలువైన అనుభవంగా నిలిచింది. తెలుగు భాషలో పిల్లల ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు ఆనందపరవశులయ్యారు. విదేశీ నేలపై పెరుగుతున్న పిల్లల్లో తమ భాష పట్ల అనుబంధం పెరుగుతుందన్న నమ్మకాన్ని ఈ వేడుక మరింత బలపరిచింది.

'మన బడి-పిల్లల పండుగ ప్రతి ఏటా ఒక కార్యక్రమం మాత్రమే కాదు- అది ఒక సాంస్కృతిక ప్రకటన. తెలుగు భాషను నిలబెట్టాలనే సంకల్పానికి ఇది ఒక ప్రతీక. విదేశాల్లో జీవిస్తున్న తరాలకు తమ మూలాలను గుర్తు చేస్తూ ఆ అనుబంధాన్ని నిలబెట్టే ప్రయత్నంగా 'మన బడి' చేస్తున్న సేవలు ప్రశంసనీయం.





# ప్రవాసాంధ్రులతో మంత్రుల ముఖాముఖి

## సింగపూర్ తెలుగుదేశం ఫోరం సభ్యులతో భేటీ... రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యంపై దిశానిర్దేశం

**సింగపూర్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రవాసాంధ్రులను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా సింగపూర్‌లో పర్యటిస్తున్న ఏపీ మంత్రుల బృందానికి తెలుగుదేశం ఫోరం సింగపూర్ (TDFS) కృతజ్ఞతలు తెలిపింది. గత ఐదు రోజులుగా అత్యంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే ప్రవాస తెలుగువారితో మంత్రులు భేటీ అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులుగా సింగపూర్ పర్యటనకు వచ్చిన మంత్రులు అక్కడ జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల్లో ఎంతో నిబద్ధతతో పాల్గొంటున్నారు. శని, ఆదివారాలు కూడా విరామం తీసుకోకుండా శిక్షణ సెషన్లకు హాజరవుతూ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా కష్టపడుతున్న తీరుపై ప్రవాసాంధ్రులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీఎస్ఎఫ్ విన్నపాన్ని మన్నించి తమ విలువైన సమయాన్ని కేటాయించిన మంత్రులు ఫోరం సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ముఖ్యంగా 'పి4' వంటి వినూత్న పథకాల గురించి మంత్రులు సభ్యులకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో టీడీఎస్ఎఫ్ వంటి సంస్థలు ఏ విధంగా తోడ్పడగలవు, ప్రభుత్వంతో కలిసి ఏయే రంగాల్లో పనిచేయవచ్చు అనే అంశాలపై మంత్రులు దిశానిర్దేశం చేశారు.

మంత్రుల మార్గదర్శకత్వం, సమయపాలనపై టీడీఎస్ఎఫ్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల మంత్రులకున్న చిత్తశుద్ధి మాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బిజీ షెడ్యూల్లో కూడా మాతో సమయం గడిపి, ఏపీ భవిష్యత్తు కోసం మావంతు సహకారం ఎలా ఉండాలో వివరించినందుకు మంత్రులకు వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# సెయింట్ లూయిస్‌లో చంద్రబాబు జన్మదిన వేడుకలు

**సెయింట్ లూయిస్ (మిస్సోరీ):** నవ్యాంధ్ర నిర్మాత, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు వేడుకలు అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం సెయింట్ లూయిస్‌లో అట్టహాసంగా జరిగాయి. ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో స్థానిక టీడీపీ సానుభూతిపరులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి చంద్రబాబు అనుభవం అత్యంత ఆవశ్యకమని పేర్కొంటూ ప్రవాసాంధ్రులుగా ఆయన విజన్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామని సభ్యులు ప్రతినబూనారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ కీలక సభ్యులు తేజ్ మన్నవ, ప్రసాద్ జాస్తి (ప్రధాన కార్యదర్శి), పవన్ చేబ్రోలు (కోశాధికారి), సందీప్ గంగవరపు, సుధాకర్ నర్రా, వంశీ పాతూరి, సందీప్ కొలిపర్ర, మధు దాడ్ల, చంద్ర నర్రా, పూర్ణ, హరి, సాంబ, అరుణ్, పాల్గొని తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.



# జన్మభూమి రుణం తీర్చుకుందాం

## ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం

**ఫిలడల్ఫియా:** 'ప్రవాసాంధ్రుల్లో నేను ఒకడిగా ఉన్నందుకే నాకు ఈ అవకాశం లభించింది... చంద్రబాబు నాపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తా' అని ఉత్తర అమెరికా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం అన్నారు. ఫిలడల్ఫియాలో కోమటి జయరాం గౌరవార్థం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు నోరి దత్తాత్రేయుడు ముఖ్య అతిథిగా హాజరు కాగా రవి పొట్లూరి సమన్వయ పరిచారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అందించడానికి సహకారం అందించి ప్రవాసాంధ్రులు జన్మభూమి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గుగూల్ డేటా సెంటర్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఏపీకి వచ్చాయి. సాంకేతిక విద్యను విద్యార్థులకు అందిస్తే రేపటి తరానికి



ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ఈ సందర్భంగా 'పద్మవిభూషణ్' నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ... నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని అమెరికాలో జయరాం నిలబెట్టారని కొనియాడారు. 'నాకు చిన్నతనం నుంచీ ఎన్టీఆర్ అంటే అభిమానం. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. ఎన్టీఆర్ సతీమణి బసవతారకం సలహా మేరకే హైదరాబాద్‌లో క్యాన్సర్ ఆసుపత్రికి బీజం పడింది' అన్నారు. కార్యక్రమంలో మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, శ్రీధర్ అప్పసాని, రాధాకృష్ణ మూల్పూరి, రంజిత్ కోమటి, మురళి పమిడిముక్కల, ఫణి కంతేటి, శ్రీధర్ సాదినేని, నందగిరీష్ మూల్పూరి, నాగరాజు చింతం, సురేష్ యలమంచిలి, గోపి వాగ్వాల, హరి దుంగతావుల, విశ్వనాథ్ కోగంటి, లావా ఐనంపూడి, గౌరి కొర్రోతు, భాను మాగలూరి, సాయి బొల్లినేని, మధు ముప్పాల, శ్రీధర్ వీర్మచినేని, శ్రీహరి మందడి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోమటి జయరాం, నోరి దత్తాత్రేయుడులను ఘనంగా సత్కరించారు.

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సందేశాలను ఏవీ ద్వారా ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

# మళ్లీ బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారానికొస్తా

## బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



బెంగాల్లో భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.. ఎన్నికల ప్రచారంలో సోమవారం చివరి ర్యాలీలో పాల్గొన్నానని.. మళ్లీ బెంగాల్లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో తాను వెళ్తున్నట్లు పేర్కొన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని ఊహించలేదని సంతోషం వ్యక్తం చేశారు. బెంగాల్లోని బారక్‌పూర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని.. ఈ రోడ్లే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన "మా, మాటి, మనుష్" నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు.



# లద్ధాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు

## లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా వెల్లడి

కేంద్రపాలిత ప్రాంతం లద్ధాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రకటించారు. వీటి ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఆమోదం తెలిపినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇదొక చరిత్రాత్మక రోజు అని అభివర్ణించారు. ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. అలాగే కొత్త జిల్లాల పేర్లను వెల్లడించారు. అవి.. జన్స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, వాంగ్లింగ్. ఇప్పటికే లేహ్, కార్గిల్ రెండు జిల్లాలు ఉన్నాయి. వీటితో కలిపి జిల్లాల సంఖ్య ఏడుకు పెరగనుంది. వీటి ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరగడంతో పాటు వృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయని సక్సేనా తెలిపారు. 2010లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీరు రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే. శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా లద్ధాఖ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పాలనలో ఉంది.

## భారతీయ సమాజాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించిన కెమెరా కన్ను

# ప్రపంచ ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ రఘురాయ్ మృతి



తన కెమెరా కన్నుతో భారతీయ సమాజాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించిన ప్రపంచ ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ రఘు రాయ్ (83) ఇక లేరు. క్యాన్సర్ మహమ్మారితోపాటు వృద్ధాప్య సమస్యలతో పోరాడుతూ ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. 1942లో పంజాబ్‌లోని ఝుంగ్లో (ప్రస్తుతం పాకిస్థాన్లో ఉంది) జన్మించిన రఘు సివిల్ ఇంజనీరింగ్ చదివారు. 23 ఏళ్ల వయసులో ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని 'ద స్టేట్స్ మన్ వార్తా పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా చేరారు. అప్పటి నుంచి దాదాపు ఆరు దశాబ్దాలపాటు ఛాయాచిత్రకారుడిగా కొనసాగిన రఘు, మనసు పొరల్లో ముద్రించుకుపోయేలా వేల ఫొటోలను క్లిక్మనిపించారు. ఆయన చిత్రాలు భారతదేశ సంస్కృతి, రాజకీయ ముఖచిత్రం, పేదరికం, సామాజిక వాస్తవాలను సుస్పష్టంగా ప్రతిబింబించాయి. చరిత్ర మరువని దృశ్యాలను బంధించి, 1972 నాటి బంగ్లాదేశ్ శరణార్థ సంక్షోభం, 1084లో భోపాల్ గ్యాస్ విషాదం సహా భారతదేశ ఆధునిక చరిత్రలోని కొన్ని ముఖ్యమైన ఘటనలను రఘు తన ఫొటోల ద్వారా ప్రపంచం కళ్లకు కట్టారు. మరీ ముఖ్యంగా భోపాల్ గ్యాస్ దుర్ఘటన సృష్టించిన మారణహోమానికి ప్రతీకగా నిలిచిన ఓ శిశువు మృతదేహం ఫొటో దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. అదే విధంగా భారత దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ కుర్చీలో ఆసీనులై ఉండగా, ఆమె చుట్టూ మంత్రులు (అందరూ పురుషులే) గుంపుగా నిల్చొని ఉండటం స్త్రీశక్తికి సాక్ష్యంలా నిలిచింది. రఘు తన ఫొటోగ్రఫీ. ప్రస్థానంలో దలైలామా, మదర్ థెరీసా, సత్యజిత్ రే, హరిప్రసాద్ చౌరాసియా, బిస్మిల్లా ఖాన్ వంటి ప్రముఖుల జీవితాల్లోని అరుదైన కోణాలను తన కెమెరాలో స్పృశించారు. ఛాయచిత్ర రంగంలో విశేష సేవలందించిన రఘు రాయ్‌ని భారత ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించింది. ఆయనకు మరెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. రచయితగా కలం పట్టి రఘు 50కిపైగా పుస్తకాలు రాశారు. ఆయన తీసిన 50వేలకు పైగా ఫొటోలను రఘు రాయ్ ఫౌండేషన్ వెబ్సైట్లో భద్రపరిచారు. దేశ సామూహిక స్మృతిలో చెరగని జ్ఞాపకాలను అందించిన రఘురాయ్ మృతి పట్ల ప్రధాని మోదీ, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# భర్త సోదరిని సవతిగా చూపించి...

## విడాకులు పొంది షాకిచ్చిన మహిళ!



విడాకులు పొందేందుకు ఓ మహిళ వ్యవహరించిన తీరు షాక్‌కు గురిచేస్తోంది. ఎవరూ ఊహించని రీతిలో తన అడపడుచునే భర్తకు రెండో భార్యగా చూపి, ఏకపక్షంగా విడాకులు పొందింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో భర్త మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, గ్వాలియర్‌కు చెందిన ఓ మహిళ మార్కెటింగ్ కంపెనీలో పనిచేసే వ్యక్తిని వివాహం చేసుకుంది. అతడు వృత్తిరీత్యా తరచూ ఇంటికి దూరంగా ఉండాల్సి వచ్చేది. అదే దంపతుల మధ్య గొడవలకు కారణమైంది. గొడవలు తీవ్రరూపం దాల్చడంతో ఆమె 2015 నుంచి వేరుగా జీవిస్తోంది. అలాగే విడాకులు కావాలని ఎన్నిసార్లు అడిగినా అతడు మాత్రం నిరాకరించేవాడు. ఎట్టిపరిస్థితుల్లోను విడాకులు పొందాలని నిర్ణయించుకున్న ఆమె 2021లో గ్వాలియర్లోని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన భర్త మళ్లీ పెళ్లి చేసుకున్నాడని తనకు విడాకులు ఇవ్వాలని కోరింది. ఆ క్రమంలో అతడు తన సోదరి, ఇతర బంధువులతో దిగిన ఫొటోలను కోర్టుకు చూపించింది. అతడు రెండో పెళ్లి చేసుకున్నాడని బుకాయించింది. ఆ ఫొటోను ఆధారంగా పరిగణించిన కోర్టు.. ఆమెకు విడాకులు మంజూరు చేసింది. వాస్తవంగా అతడి పక్కన నిల్చున్నది. సొంత సోదరి కావడం గమనార్హం. తన వాదనను వినిపించే అవకాశం కల్పించలేదని, ఏకపక్షంగా విడాకులు మంజూరుచేశారని భర్త వాపోయాడు. ఏప్రిల్ నెలలో డివోర్స్ డిక్రీ రావడంతో భార్య చూపించిన ఫొటో గురించి అతడికి తెలిసింది. దీంతో వెంటనే మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి తన భార్య తప్పుడు వివరాలు చూపించి పొందిన విడాకుల తీర్పును నిలిపివేయాలని కోరాడు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది.

# బిడ్డను కని లైంగిక దాడి అంటారా : సహజీవన బంధాలపై సుప్రీంకోర్టు



సహజీవన బంధాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా. అవుతుందని ప్రశ్నించింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై ఓ మహిళ వేసిన పిటిషన్పై విచారణ సందర్భంగా అత్యున్నత తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లైంగిక దాడికి పాల్పడ్డాడని తన సహజీవన భాగస్వామిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. పరస్పర అంగీకారంతో ఏర్పడిన సహజీవన బంధాలు, లైంగిక దాడులకు మధ్య ఉన్న వ్యత్యాసం గురించి ప్రస్తావించారు. "ఈ కేసు సహజీవన బంధానికి సంబంధించినది. వివాహం కాకుండానే ఆ మహిళ ఒక బిడ్డకు కూడా జన్మనిచ్చింది. ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోంది. ఇందంతా ఏంటి..? సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారింది..? కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్నారు. పెళ్లి ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవి" అని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. "నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయసు 19. అప్పుడు ఆమె ఒక వితంతువు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయింది. ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడు. ఇతర మహిళలను ఇలాగే మోసగించాడు" అని వాదనలను వినిపించారు. "ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులుగా కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించింది" అని న్యాయమూర్తి ఈ సందర్భంగా ప్రశ్నించారు. అలాగే ఆ మహిళ పరిస్థితిపై సానుభూతి వ్యక్తంచేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. "వివాహేతర సంబంధాలు ఉండొచ్చు. కానీ అలాంటి బంధాల వల్ల జన్మించిన పిల్లలు వివాహేతర సంతానం కాదు.. పెళ్లి జరిగిఉంటే. చట్టపరంగా ఆమె పరిస్థితి మెరుగ్గా ఉండేది" అని వ్యాఖ్యానించింది. ఇరువర్గాలు ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది.

# భాజపాలో ఏడుగురు ఆప్ ఎంపీల విలీనం!

రాజ్యసభలో భాజపాలో ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ పరిణామంతో రాజ్యసభలో భాజపా బలం 115కు చేరింది. మరోవైపు అప్ బలం మూడుకు పడిపోయింది. రాఘవ్ చడ్డా, హర్భజన్ సింగ్, స్వాతి మాలీవాల్ సహా ఏడుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు ఇటీవల ఒకేసారి భాజపాలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. వారంతా ప్రస్తుతం భాజపాలో విలీనమయ్యారు. విలీనం తర్వాత తమను భాజపా ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురు ఎంపీలు రాజ్యసభ చైర్మన్కు వినతిపత్రం సమర్పించగా, తాజాగా దానిని ఆయన ఆమోదించారు. రాజ్యసభ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ఈ ఏడుగురు ఎంపీలు ఇప్పుడు భాజపా సభ్యుల జాబితాలో ఉన్నారు. కాగా పార్టీ మారిన ఈ ఏడుగురు ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభచైర్మను వినతిపత్రం సమర్పించింది.



# నిల్వలతో నిండుతున్న ఖర్గ్



* రంగంలోకి 'డెడ్ ట్యాంకర్'...
* అమెరికా దిగ్బంధనం ముందు ఇరాన్ నిలుస్తుందా?

ఇరాన్-అమెరికాపైకి భీకర ప్రకటనలు చేస్తున్నా.. రెండూ యుద్ధంనుంచి ఎప్పుడెప్పుడు బయటపడాలా? అని చూస్తున్నాయి. ఈ క్రమంలో చర్చలకు వచ్చినట్టే వచ్చి, పట్టుదల ప్రదర్శిస్తున్నాయి. శాంతి ఒప్పందం కుదిరేదాకా ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించే వరకూ చర్చలు జరపబోమని ఇరాన్ తేల్చిచెప్పింది. అమెరికా దిగ్బంధనంతో ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపం చమురు నిల్వలతో నిండిపోతోంది..! దాంతో ఇరాన్ చమురు నిల్వకు ఇతర మార్గాలను అన్వేషిస్తోంది.

**చమురు ఉత్పత్తి ఆపితే మొదటికే మోసం..**

అమెరికా ఆంక్షలు, దిగ్బంధనంతో ఇరాన్ చమురు ఎగుమతులు ఆగిపోయాయి. ఎగుమతులు లేవు కదా అని.. చమురు ఉత్పత్తి కూడా నిలిపివేయలేని పరిస్థితి. ఉత్పత్తి ఆపితే.. చమురుబావిలో పీడన సమస్య ఏర్పడుతుంది. దాంతో కింద ఉన్న నీరు పైకి ఉబికి వచ్చి, చమురు ఉన్న శిలల్లోకి చొచ్చుకుపోతుంది. దాంతో వెలికితీసినప్పుడు వచ్చే ఆయిల్ పరిమాణం తగ్గిపోతుంది. ఒకవేళ చమురు బావిని మూసి.. కొంతకాలం తర్వాత మళ్లీ తవ్వడం ప్రారంభిస్తే నీరే వస్తుంది. ఇవన్నీ చమురు బావుల జీవితకాల ఉత్పాదకతపై ప్రభావం చూపిస్తాయి. కొన్ని అయితే పూర్తిగా వినియోగానికి రాకుండా పోవచ్చు.

పర్షియన్ గల్ఫ్‌లో ఖర్గ్ ఒక చిన్న ద్వీపం. ఇరాన్ తీరానికి 25-30 కి.మీ దూరంలో ఉండే ఇది.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం. ఇరాన్ తమ చమురు ఎగుమతుల్లో 90శాతం ఇక్కడినుంచే నిర్వహిస్తోంది. అది 30 మిలియన్ బ్యారెళ్ల చమురును నిల్వ చేయగలుగుతుంది. ఇప్పుడు వెలికితీస్తోన్న చమురుతో.. ఇక నిల్వచేసే సామర్థ్యాన్ని కోల్పోతోంది. ఖర్గ్ ఐలాండ్‌లో నిల్వ సామర్థ్యం ప్రస్తుతం 13 మిలియన్ బ్యారెళ్లకు మాత్రమే చోటు ఉంది. రోజుకు ఉత్పత్తి చేసే సామర్థ్యమేమో 1 మిలియన్ బ్యారెళ్ల వరకు ఉంది. అంటే రెండువారాల్లోగా టెహ్రాన్‌కు వేరే నిల్వ కేంద్రం తప్పక కావాలి.

**'డెడ్ ట్యాంకర్' మళ్లీ అందుబాటులోకి..**

ఈ నేపథ్యంలో 30ఏళ్ల క్రితం పక్కన పెట్టేసిన నషా ట్యాంకర్ (డెడ్ ట్యాంకర్)ను మళ్లీ అందుబాటులోకి తీసుకువస్తోంది. ఏప్రిల్ 16నుంచి ఖర్గ్‌నుంచి మూడు ట్యాంకర్లలోకి 5 మిలియన్ బ్యారెళ్ల చమురును లోడ్ చేసినట్టుగా ఉపగ్రహ చిత్రాలను బట్టి మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ లెక్కలన్ని చూస్తుంటే. ఇరాన్ ఓడరేవులు లక్ష్యంగా అమెరికా చేస్తోన్న దిగ్బంధనం ఎఫెక్ట్ భారీస్థాయిలో ఉన్నట్టు తెలుస్తోంది.

"కొన్ని రోజుల్లోనే ఖర్గ్ ద్వీపంలోని చమురు స్టోరేజీ ట్యాంకులు నిండిపోతాయి. కీలకమైన ఇరాన్ చమురు బావులు మూతపడక తప్పదు. దీంతో ఆ దేశ ప్రధాన ఆదాయానికి గండి పడనుంది" అని ఇటీవల యూఎస్ ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దిగ్బంధనం కేవలం మిలిటరీ వ్యూహం మాత్రమే కాదని.. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసే చర్య అని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. పక్కన పెట్టిన ట్యాంకర్‌ను తిరిగి తీసుకువస్తుందంటే.. ఇరాన్ ఇంకా కొంతకాలం వేచి చూసే ఉద్దేశంలోనే ఉందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఒత్తిడి ఇలాగే కొనసాగితే.. ఏ మార్గాన్ని ఎంచుకుంటుందో చూడాలి..!

## బాధను దిగమింగుతున్న అమెరికా



అమెరికా-ఇరాన్ యుద్ధంలో ప్రస్తుతానికి కాల్పుల విరమణ కొనసాగుతోంది. యుద్ధం ఆగుతుందా..? చర్చలు జరుగుతాయా..? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇంకా దొరకడం లేదు. ఈ యుద్ధంలో ఇరాన్‌ను సైనికంగా దెబ్బతీశామని, వారు ఒప్పందానికి రావాల్సిన పరిస్థితి కల్పించామని అగ్రరాజ్యం చెప్తోంది. అయితే ఇరాన్ కూడా మిలిటరీ శక్తి అయిన యూఎస్‌ను గట్టిగా దెబ్బకొట్టినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. బయటకు చెప్తున్న దానికంటే నష్ట తీవ్రత ఎక్కువగానే ఉందని పేర్కొన్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై టెహ్రాన్ విరుచుకుపడింది. అక్కడ ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కమాండ్ సెంటర్లు, నిల్వ కేంద్రాలు, విమానాలు ఉంచే ప్రాంతాలు, రన్వేలు, రాడార్ వ్యవస్థలపై దాడులు చేసింది. సైనిక కదలికలు, నిఘాకు వాడే వ్యవస్థలను దెబ్బకొట్టింది. యూఎస్ వద్ద అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలున్నప్పటికీ.. ఇరాన్ తన పాత ఎఫ్-5 యుద్ధ విమానాన్ని వాడి దాడి చేయడంతో యూఎస్ ఖంగుతింది. ఇరాన్ దాడుల్లో జరిగిన నష్టానికి సంబంధించి కచ్చితమైన లెక్కలను అమెరికా ఇప్పటివరకు బయట పెట్టలేదు. ఈ విషయంలో ట్రంప్ యంత్రాంగం పారదర్శకంగా లేకపోవడంపై కొందరు సొంత పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వారాలుగా ఆ వివరాలు ఇవ్వాలని అడుగుతున్నా.. పూర్తి వివరాలు మాత్రం బయటకు రావడం లేదంటున్నారు. మరోవైపు.. యుద్ధం నేపథ్యంలో 200 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.18 లక్షల కోట్లు) పైగా నిధులు ఇవ్వాలని అమెరికా పార్లమెంట్‌ను పెంటగాన్ కోరినట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఇక, ఘర్షణలు ప్రారంభమైన మొదటివారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్లమేర ఖర్చు చేసింది. ఈ వార్ ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ 1.5 ట్రిలియన్ డాలర్ల డిఫెన్స్ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆ మొత్తం క్రితం ఏడాదితో పోలిస్తే 50శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఘర్షణలు కొనసాగించడానికి పెట్టే ఖర్చు ఒకవైపు అయితే.. దెబ్బతిన్న వాటిని బాగు చేయడానికి కొన్ని బిలియన్ల డాలర్లమేర అవసరం కానుందని అంచనా. ఈ బాధ ఎక్కువగా ఉన్నా.. దానిని బయటకు చెప్పలేని పరిస్థితిలో అమెరికా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఒరాకిల్‌లో భారీ లేఆఫ్

**20వేల మందిని పక్కన పెడుతున్న సంస్థ**



దిగ్గజ టెకీ కంపెనీ ఒరాకిల్ కూడా లేఆఫ్స్ ప్రకటించింది. సుమారు 20 వేలమంది ఆ కంపెనీలో ఉద్యోగాలు కోల్పోనున్నారు. సోమవారం ఆ కంపెనీ ఈ ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా 20నుంచి 30 వేలమందిని తొలిగించే అవకాశాలున్నట్టు పేర్కొంది. ఇవాళ ఉదయం పంపిన ఈ-మెయిల్స్ ద్వారా ఈ విషయాన్ని ఉద్యోగులకు చేరవేశారు. అమెరికా, ఇండియా, కెనడా, లాటిన్ దేశాల్లో ఉన్న ఒరాకిల్ కంపెనీ ఉద్యోగులపై భారీ వేటు పడనున్నది. ఒరాకిల్ కంపెనీలో పనిచేస్తున్న సీనియర్లను కూడా తొలగిస్తున్నారు. 33 ఏళ్లుగా ఒరాకిల్‌లో చేసిన సీనియర్ సెక్యూర్టీ ప్రొఫెషనల్ నీనా లివస్ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోనున్నారు. 30 వేలమంది లేఆఫ్స్‌లో తాను కూడా ఉండబోనున్నట్టు ఆమె తన లింక్డిన్ ప్రొఫైల్‌లో రాశారు. తమ కంపెనీ తీసుకున్న నిర్ణయం షాకింగ్‌గా ఉన్నట్టు ఆమె చెప్పింది. కృత్రిమ మేధ ప్రభావం సీనియర్ల ఉద్యోగులపై పడుతున్నట్టు ఆమె తన పోస్టులో అభిప్రాయపడ్డారు. 1990లో లివిస్ ఆ కంపెనీలో చేరారు. డేటాబేస్, సెక్యూర్టీ ప్లాట్‌ఫామ్‌లపై ఆమె పనిచేశారు. ఇటీవల సెక్యూర్టీ అలర్ట్ మేనేజర్‌గా చేశారు. ఇంజినీరింగ్, సెక్యూర్టీ టీమ్‌లతోనూ ఆమె పనిచేశారు. ఒరాకిల్ కంపెనీలో ప్రిన్సిపల్ ఎథికల్ హ్యాకర్, ప్రిన్సిపల్ సెక్యూర్టీ అనలిస్టుగా లివిస్ చేశారు. సీనియర్ ఉద్యోగులను టార్గెట్ చేసినట్లు భావిస్తున్నానని ఆమె తన పోస్టులో తెలిపారు. లేఆఫ్స్‌లో సంఖ్య కన్నా.. సీనియర్ల తొలగింపు ప్రశ్నార్థకంగా మారింది. సుదీర్ఘకాలం కంపెనీలో పనిచేస్తున్నవారు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై ప్రభావం పడడం శోచనీయంగా మారింది. ఇటీవల మెటా, మైక్రోసాఫ్ట్, డిస్నీ, ఏఎస్ఎంఎ కంపెనీలు కూడా లేఆఫ్స్ ప్రకటించాయి. మెటా, మైక్రోసాఫ్ట్ కంపెనీలు గత వారంలో 20 వేల ఉద్యోగులను తొలగించాయి. ప్రస్తుత దశలో చాలా వరకు కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. పనివిధానాలను ఆటోమెట్ చేయడంలో కంపెనీలు నిమగ్నమయ్యాయి. వర్కింగ్ టీమ్స్‌ను పునర్ నిర్మిస్తున్నారు. అయితే అధిక సామర్థ్యం, తక్కువ ఇన్‌పుట్, ఎక్కువ లాభాలు అన్న రీతిలో కంపెనీలు పనిచేస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లాభాలపై దృష్టి పెట్టిన కంపెనీలు.. భారీ వేతనపరులు అవసరమా? అన్న రీతిలో ఆలోచిస్తున్నాయి. అయితే వీరిస్థానంలో ఏఐతోపాటు యువ ఉద్యోగులను నియమించేందుకు ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఒరాకిల్ కంపెనీ ఎక్కువగా క్లౌడ్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పెట్టుబడి పెడుతోంది. వర్క్‌ఫోర్స్‌ను రిడీజైన్ చేస్తున్నది. దీనిలో భాగంగానే సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తున్నారు. టెక్నాలజీకి పెద్దపీట వేయడంతో.. ఆటోమేషన్ పెరిగిపోయిందని, లాభాలపై దృష్టిపెట్టడం వల్లే లేఆఫ్స్ కూడా అధికంగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## ఒకటికి నాలుగే మా లెక్క

**అమెరికాను హెచ్చరించిన ఇరాన్**



మూడు రోజుల్లో ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చమురు పైప్‌లైన్లను పేల్చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడంపై ఇరాన్ స్పందించింది. చమురు క్షేత్రాలు సహా తమ మౌలిక సదుపాయాలపై దాడులకు పాల్పడితే.. అమెరికాకు మద్దతిచ్చే దేశాల్లో దానికి నాలుగు రెట్లు ఎక్కువగా విధ్వంసానికి పాల్పడతామని ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సాహెబ్ ఇస్ఫహానీ హెచ్చరించారు. తమ లెక్కలు అందరిలా కాకుండా భిన్నంగా ఉంటాయన్నారు. శత్రువులు ఒక్క చమురు బావిపై దాడి చేస్తే.. తాము నాలుగు చమురు బావులపై దాడులు చేస్తామన్నారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఆస్తులను ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే.. టెహ్రాన్‌లోని చమురు పైప్‌లైన్లను పేల్చేస్తామని హెచ్చరించారు. ప్రధాన ఆర్థిక వనరు అయిన చమురును నాశనం చేస్తే.. ఆ దేశం తప్పకుండా తమ మాట వింటుందన్నారు. చర్చల కోసం తమ బృందాన్ని పాక్‌కు వెళ్లొద్దని ఆదేశించారు. యుద్ధం ముగిసిపోవాలనుకుంటే ఇరాన్ నేతలే తమను సంప్రదిస్తారని అన్నారు. మరోవైపు అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతినిధి బృందం కూడా సుముఖత వ్యక్తం చేయలేదు. తమ డిమాండ్ల జాబితాను పాక్ అధికారులకు అందజేసి.. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ త్వరలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం కానున్నట్టు తెలుస్తోంది.

## పాక్ సరైన మీడియేటర్ కాదు

**ఇరాన్ విదేశాంగ అధికారి వ్యాఖ్యలు**



అమెరికా-ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించగలదా? అని టెహ్రాన్ అధికారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ.. పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్ దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు. "పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసించదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేనివిధంగా డిమాండ్లు తెరపైకి తీసుకువచ్చినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షంవైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా? అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయి" అని ఇబ్రహీం రెజాయీ పార్లమెంట్‌లో పేర్కొన్నారు.

అమెరికా-ఇరాన్‌ల మధ్య తొలివిడత చర్చలు విఫలమైన తర్వాత మళ్లీ చర్చలు జరపాలని ఇరాన్ ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. శాంతిఒప్పందం కుదిరేవరకు ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించేవరకూ చర్చలు జరపబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. కాగా తమ మధ్యవర్తిత్వంలో ఇరువర్గాల మధ్య పరోక్ష చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాక్ అధికారులు పేర్కొన్నారు.

# చిన్నస్వామి స్టేడియంలో భద్రతా లోపం..

### 240 సీసీటీవీ కెమెరాల ఫీడ్ నిలిపివేత!

ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంగా కొనసాగుతోన్న వేళ ఓ సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం మరోసారి వార్తల్లోకెక్కింది. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత గతేడాది ఆర్సీబీ కప్పు నెగ్గిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నిర్వహించిన విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట చోటు చేసుకుని 11 మంది మృతి చెందారు. ఆ ఘటన ఇంకా మరువకముందే మరో వార్త ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. స్టేడియంలో దాదాపు 240 కెమెరాల ఫీడ్‌ను ఇద్దరు ఉద్యోగులు నిలిపివేశారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇప్పుడు స్టేడియంలోనే భద్రతకు సంబంధించి కలకలం రేగడం గమనార్హం. సీసీటీవీలను పర్యవేక్షించే సబ్ కాంట్రాక్ట్ కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు మంజునాథ్, అబ్దుల్ కలామ్ డీయాక్టివేట్ చేసిన యాక్సిస్ కార్డును వినియోగించి అనుమతి లేకుండా కంట్రోల్ రూమ్‌లోకి ప్రవేశించి సీసీటీవీ ఫైబర్ కనెక్షన్లు, వీడియో రికార్డర్లను ధ్వంసం చేసినట్లు పోలీసులు తేల్చారు. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేశారు. సీసీటీవీ కెమెరాలకు సంబంధించి బ్యాకప్ సాయంతో సాధారణ స్థితికి తీసుకొచ్చారు. రియల్ టైమ్ మానిటరింగ్‌ను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. అయితే రూ.10 లక్షల బకాయిలు తమకు రావాల్సి ఉండని, వాటిని చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని పోలీసు విచారణలో సదరు ఉద్యోగులు తెలిపారు.



**అసలేం జరిగిందంటే?**

ఏప్రిల్ 24న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య చిన్నస్వామి స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్ అనంతరం కీలక ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫీడ్స్ నిలిపివేసినట్లు అధికారులు గుర్తించారు. సబ్ కాంట్రాక్ట్ కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. 'స్టేడియంలోని కీలక ప్రాంతాల్లో పనిచేసే సీసీటీవీలకు సంబంధించి ఎన్‌వీఆర్, ఫైబర్ కనెక్షన్లను తొలగించారు. ఎంట్రీ గేట్స్, కన్‌కోర్స్ సెక్షన్స్, కార్పొరేట్ స్టాండ్‌తో పాటు స్టేడియంలోని ఇతర ప్రాంతాలను కవర్ చేసే సీసీటీవీల కనెక్షన్లు తొలగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం' అని కబ్బన్ పార్క్ పోలీసులు వెల్లడించారు. అయితే చిన్నస్వామి స్టేడియంలో భద్రతకు సంబంధించి ఉల్లంఘన చోటు చేసుకోవడం ఇదేమీ తొలిసారి కాదు. ఐపీఎల్ ప్రారంభమైన కొద్ది రోజులకే బ్లాక్ టికెట్ల రాకెట్‌ను బెంగళూరు పోలీసులు ఛేదించారు. లఖ్‌నవూ-ఆర్సీబీ మ్యాచ్‌కు సంబంధించిన వంద టికెట్లను స్టేడియంలోని క్యాంటీన్ వర్కర్ నుంచి సీజ్ చేశారు.

# మూడేళ్ల నాటి సెహ్వాగ్ సవాల్..



### బ్యాట్‌తోనే రింకు సమాధానం

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందని అనుకున్న మ్యాచ్‌లో స్టార్ ఫినిషర్ రింకు సింగ్.. బ్యాట్‌తో అదరగొట్టాడు. ఆఖరిలో క్రీజు లోకి వచ్చి 51 బంతు ల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్ల తో ఏకంగా 83 పరు గులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దిగ్వేశ్ రాఠి వేసిన ఆఖరి ఓవర్ లో వరుసగా నాలుగు సిక్స ర్లు బాది రింకు మరోసారి సంచలనం సృష్టించాడు. 2023లో కోల్‌కతా విజయానికి 29 పరుగులు అవస రమైనప్పుడు అతడు వరుసగా ఐదు సిక్సర్లు బాదిన సంగతి తెలిసిందే. అప్పుడు టీమిండియా దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ ఓ ఛాలెంజ్ చేశాడు. తాజాగా రింకు ఆ సవాల్‌కు సమాధానం ఇచ్చాడు.

**సెహ్వాగ్ సవాల్ ఇదే..**

2023లో రింకు సింగ్ వరుసగా ఐదు సిక్సర్లు బాది సంచల నం సృష్టించాడు. అప్పుడు సెహ్వాగ్.. రింకుపై కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ఇది క్రికెట్ చరిత్రలో అరుదైన సంఘటన. టీ20 క్రికెట్‌లో ఇలా ఎప్పుడూ జరగలేదు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఇన్ని పరుగులు చేయడం అంత సులభం కాదు. కానీ అతడు చేసి చూపించాడు. అయితే రింకు మళ్లీ ఇలా తన కెరీర్‌లోనే మరోసారి రిపీట్ చేయలేడు. ఇదే నా ఛాలెంజ్' అని అన్నాడు. అప్పట్లో ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. దాదాపు మూడేళ్ల తర్వాత రింకు ఆ సవాల్‌కు సమాధానం ఇచ్చాడు. లఖ్‌నవూతో మ్యాచ్‌లో ఆఖరి ఓవర్లో వరుసగా నాలుగు సిక్సర్లు బాదేశాడు. రింకు చెలరేగి ఆడటంతో.. కేకేఆర్ 155 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది.

**రింకు రియాక్షన్ ఇదే..**

ఎల్ఎస్‌జీపై రింకు బ్యాట్‌తోనే కాదు.. ఫీల్డింగ్‌లోనూ అదర గొట్టాడు. ఏకంగా ఐదు క్యాచ్‌లను అందుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో రింకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మ్యాచ్ అనంతరం సెహ్వాగ్ చేసిన వ్యాఖ్యలపై స్పందించాడు. 'వరుసగా ఐదు సిక్సర్లు కొట్టగలిగితే ప్రపంచంలో ఇంకా చాలా చేయగలం. సెహ్వాగ్ అప్పుడు చేసిన వ్యాఖ్యలే నాకు ప్రేరణనిచ్చాయి. బ్యాటింగ్‌కు దిగిన ప్రతిసారి ఆ మాటలు గుర్తొస్తాయి' అని తెలిపాడు. కాగా ఈ సీజన్ ఆరంభంలో కాస్త నిలకడలేమితో ఇబ్బంది పడిన రింకు.. తాజా నాక్‌తో హీరో అయిపోయాడు.

# అతడిని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించాలి

**వైభవ్‌పై పాక్ క్రికెట్ అనలిస్ట్ ప్రశంసలు**



ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ సంచలనం సృష్టిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులో ప్రపంచ మేటి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 బంతుల్లోనే సెంచరీ బాదేసి అందరినీ మరోసారి ఆశ్చర్యపర్చాడు. అయితే ఈ కుర్రాడి ఆటకు ప్రపంచం మొత్తం ఫిదా అవుతుండగా.. శత్రు దేశం పాకిస్థాన్ నుంచి కూడా ప్రశంసలు వస్తున్నాయి. వైభవ్ బ్యాటింగ్‌ను చూసి పాకిస్థాన్ క్రికెట్ విశ్లేషకుడు నౌమన్ నియాజ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'వైభవ్ సూర్యవంశీపై నాకు అనుమానముంది. అతడిని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించాలి. వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) ఒకసారి వైభవ్‌ను చెక్ చేస్తే బాగుంటుంది. వైభవ్ బ్యాట్‌లో ఏదో ఏఐ చిప్ పెట్టారని నా సందేహం. ఇంత చిన్న వయసులో ఇలాంటి బ్యాటింగ్ చేయడం అసాధారణం. ఇంకాస్త వేగంగా ఆడితే స్ట్రైక్ రేట్ 300 దాటేది. ఇది కేవలం అతడి పవర్ కాదు.. టెక్నిక్. అతడు షాట్లు ఆడే విధానం చూడముచ్చటగా ఉంటుంది. విరాట్ కోహ్లీ ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగిన సమయంలో వైభవ్ పుట్టి ఉండొచ్చు. అతడి భవిష్యత్తు ఎంత ప్రకాశవంతంగా ఉండనుందో ఊహించడం కూడా కష్టమే' అని అని నియాజ్ వ్యాఖ్యానించాడు. ఇదిలా ఉండగా, వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లు ఆడి 357 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ కూడా ఉంది. కాగా త్వరలోనే అతడిని టీమిండియాలోకి తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఐపీఎల్ 2026లో 8 మ్యాచ్‌లు ఆడిన రాజస్థాన్ రాయల్స్.. ఐదు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఈ లీగ్‌లో ఆర్ఆర్ తన తదుపరి మ్యాచ్‌ను మే 1న ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆడనుంది.

# సూపర్ ఓవర్‌లో పూరన్‌ను పంపించడానికి కారణమదే

**విమర్శలపై స్పందించిన కోచ్ లాంగర్**



ఐపీఎల్ 2026లో భాగంగా లఖ్‌నవూ ఏకానా స్టేడియం నిన్న(ఆదివారం) ఓ ఆసక్తికరమైన పోరాటానికి వేదికైంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సూపర్ ఓవర్లో కేకేఆర్ విజయం సాధించింది. అయితే, సూపర్ ఓవర్‌లో లఖ్‌నవూ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఫామ్‌లో లేని, నరైన్ బౌలింగ్‌లో అసలు రికార్డు బాగోలేని నికోలస్ పూరన్‌ను సూపర్ ఓవర్‌లో పంపించడంపై ఎల్ఎస్‌జీ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ క్లారిటీ ఇచ్చాడు. లాంగర్ మీడియాతో మాట్లాడుతూ.. 'కేకేఆర్ తరపున సునీల్ నరైన బౌలింగ్ చేస్తాడని తెలుసు. ఇక నికోలస్ పూరన్ విషయానికి వస్తే..ప్రపంచ క్రికెట్‌లో నరైన్‌ను ఎక్కువగా ఎదుర్కొంది అతడే. అందుకే అతడు సరైన ఎంపిక అని మేం భావించాం. పూరన్ మంచి ఫామ్‌లో లేడనే విషయం తెలుసు. ఈ విషయాన్ని అతడు కూడా అంగీకరిస్తాడు. కానీ, సూపర్ ఓవర్‌ను సమర్థంగా ఎదుర్కోగల ప్లేయర్ నికోలస్ పూరన్ అని గట్టిగా భావించాం' అని తెలిపాడు. 'మేము అత్యుత్తమ ఆటగాళ్లకు ఎప్పుడూ అండగా ఉంటాం. అలానే పూరన్‌కూ మద్దతుగా నిలిచాం. దురదృష్టవశాత్తూ అతడు తొలి బంతికే ఔటయ్యాడు. కొన్నేళ్లుగా టీ20లో అద్భుతమైన ప్లేయర్‌గా రాణించాడు. అతడూ మనిషే. అతడి ఆత్మవిశ్వాసాన్ని ఎవ్వరూ దెబ్బతీయ్యలేరు. ఈ మ్యాచ్‌లో అతడిని తిరిగి ఫామ్?లోకి వస్తాడనుకున్నాం. కానీ మా వ్యూహం విఫలమైంది. క్రికెట్ ప్రపంచంలో ఎప్పుడేమి జరుగుతుందో చెప్పలేం' అని లాంగర్ వెల్లడించాడు.

# ఐపీఎల్ నిర్వహణలో మార్పులు అవసరం

**బీసీసీఐకి సునీల్ గవాస్కర్ లేఖ**



ఐపీఎల్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ఇప్పటికే సగానికి పైగా మ్యాచ్‌లు ముగిశాయి. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల వ్యవధిపై ఇప్పటికే సోషల్ మీడియాలో విమర్శలు వస్తోన్న సంగతి తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఏకంగా నాలుగు గంటల 22 నిమిషాలు సాగింది. ఇదే అంశంపై టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్ బీసీసీఐకి లేఖ రాశాడు. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణలో పలు కీలక మార్పులు అవసరమం టూ లేఖలో పేర్కొన్నాడు. ఒక్క మ్యాచ్ నాలుగు గంటలకు పైగా సాగడంపై సన్నీ అసహనం వ్యక్తం చేశాడు. 'ఐపీఎల్ నిర్వహణలో పలు కీలక మార్పులు కచ్చితంగా అవసరం. మైదానంలోకి అవసరానికి మించి సపోర్ట్ స్టాఫ్, రిజర్వ్ ప్లేయర్లు రావడం వల్ల ఆట ఆలస్యం అవుతోంది. డ్రింక్స్ ఇచ్చే పేరుతో అనవసరంగా ఎక్కువ మంది ప్లేయర్లు మైదానంలోకి వస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఇద్దరు రిజర్వ్ ప్లేయర్లు, మరో ఇద్దరు కోచింగ్ స్టాఫ్‌ను మాత్రమే మైదానంలోకి అనుమతించాలి. గ్రౌండ్ కేవలం ఆడే వాళ్లకు మాత్రమే పరిమితం కావాలి. ఇక వికెట్ల మధ్య గ్యాప్ కూడా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం బ్యాటర్లు డగౌట్‌లోనే ఉంటున్నారు. కొత్త బ్యాటర్ క్రీజులోకి వచ్చి సెట్ అయ్యేందుకు రెండు నిమిషాల సమయాన్ని ఇస్తున్నారు. దాన్ని ఒక నిమిషానికి కుదించాలి. ఆలస్యం చేస్తే పెనాల్టీ రన్స్ ఇవ్వాలి. ఒక్క మ్యాచ్ నాలుగు గంటలకి పైగా సమయం తీసుకోవడం వల్ల అభిమానుల్లో ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది' అని బీసీసీఐకి రాసిన లేఖలో గావస్కర్ పేర్కొన్నాడు.

చైతన్య రథం సినిమా

మంగళవారం 28 ఏప్రిల్ 2026 X



## వైరల్ అవుతోన్న షా 'షో'!

ప్రస్తుతం ఇండియాలో ఐపీఎల్ 2026 సీజన్ క్రికెట్ ఫీవర్ నడుస్తోంది. సాయంత్రం అయ్యిందంటే క్రికెట్ అభిమానులు తమ అభిమాన జట్టు, ప్లేయర్ ఆటను వీక్షించేందుకు టీవీలకు అతుక్కుపోతున్నారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న పృథ్వీ షా తనదైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. అయితే, ఆయన తాజాగా వార్తల్లో నిలిచాడు. ఆయన దిగిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. టాలీవుడ్ స్టార్ హీరోలు రామ్‌చరణ్, విక్టరీ వెంకటేష్‌లతో ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు పృథ్వీ షా ఓ ఈవెంట్‌లో ఫోటోలు దిగాడు. స్పోర్ట్స్, సినీ రంగాలకు చెందిన ఈ ప్రముఖులు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. క్రికెట్‌పట్ల ఎంతో మక్కువ చూపే రామ్‌చరణ్, వెంకటేష్‌లు, పృథ్వీ షా ఆటతీరును ప్రశంసించడమే కాకుండా రాబోయే మ్యాచ్‌ల కోసం అతనికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్న పృథ్వీ షా, తన ఫామ్‌ను నిలబెట్టుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇలాంటి సమయంలో టాలీవుడ్ స్టార్లనుంచి లభించిన ప్రోత్సాహం అతనికి మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అరుదైన కలయిక అటు సినీ ప్రియులను, ఇటు క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## ఛాన్స్ రుక్మిణీ వసంత్‌కేనా..?




సంగీత సామ్రాజ్ఞి ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత కథని సినిమాగా తెరకెక్కించేందుకు ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయి. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో... ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని రూపొందించడానికి కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే, ఈ బయోపిక్‌కి సంబంధించిన పనులు పూర్తయ్యాయి. అయితే, మేకర్స్ ఇంకా నటీనటుల్ని ఫైనల్ చేయలేదు. ముఖ్యంగా సుబ్బులక్ష్మి పాత్రకి ఎవర్ని ఎంపిక చేయాలా? అని చాలా రోజులుగా ఆలోచిస్తున్నారు. ఓ దశలో సాయి పల్లవి పేరు బలంగా వినిపించింది. అయితే, ఉన్నట్టుండి ఇప్పుడు రుక్మిణీ వసంత్ పేరు తెరపైకొచ్చింది. రుక్మిణీ వసంత్, ఎన్టీఆర్‌తో కలిసి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమా చేస్తోంది. మరి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పాత్ర రుక్మిణికి వరిస్తుందా? లేదా? ఆసక్తికరంగా మారింది.

## హీరో నేనుకాదు, కరుప్పస్వామి



సూర్య హీరోగా ఆర్జే బాలాజీ తెరకెక్కించిన సినిమా 'కరుప్పు'. తెలుగులో 'వీరభద్రుడు'. త్రిష హీరోయిన్. మే 14నవిడుదల కానుంది. ఈ నేపథ్యం లో ఆదివారం రాత్రిమదురైలో మూవీ ఆడియో విడుదల వేడుక ఘనంగా జరిగింది. తన ప్రసంగంతో సూర్య అభిమానులను ఆకట్టుకున్నారు. అభిమానులు తనను గత 28 ఏళ్లుగా సపోర్ట్ చేస్తున్నారని, వారి ప్రేమవల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానంటూ థాంక్స్ చెప్పారు. మదురై తనకెంతో ప్రత్యేకమని, ఇక్కడ లభించే ఆహారం ఇష్టమన్నారు. 'కరుప్పు' గురించి మాట్లాడుతూ.. "ఈ సినిమాలో హీరో నేను కాదు.కరుప్పస్వామి హీరో.మన పై మనకు నమ్మకముంటే.. అద్భుతాలు తప్పకజరుగుతాయి. ఆర్జే బాలాజీ క్రియేటివ్ డైరెక్టర్. ఈ చిత్రం విషయంలో టెక్నికల్ టీమ్ కీలకం. స్టంట్స్, సంగీతం సినిమాలో హైలైట్. 'కరుప్పు' ఫస్టాఫ్ ఎమోషనల్‌గా, సెకండాఫ్ ఎంటర్టైనింగ్ సాగుతుంది. మా పని నిజాయతీగా పూర్తి చేశాం. ఫలితం మీ చేతుల్లోనే ఉంది. మే 14న థియేటర్లలో కలుద్దాం"అని పేర్కొన్నారు. దర్శకుడు ఆర్జే బాలాజీ 'కరుప్పు' ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు."సూర్య సర్‌ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో అలా చూపించే ప్రయత్నంచేశా. 45నిమిషాల పాటు కథ విని నటించేందుకు వెంటనే అంగీకరించారు. సాధారణంగా స్టార్ నటుల చిత్రాల్లో.. హీరోలకు ఎక్కువ స్క్రీన్ ప్రెజెన్స్ ఉంటుంది. కానీ, 'కరుప్పు'లో హీరోలేని సన్నివేశాలు చాలానే ఉన్నాయి. ఈ విషయంలోనూ సూర్య నో చెప్పలేదు" అంటూ కొనియాడారు.

## టీజర్ లాక్ చేసుకున్న 'ఎపిక్'




ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఎపిక్ -ఫస్ట్ సెమిస్టర్' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఆదిత్య హసన్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో మూవీపై అంచనాలు పెరిగాయి.ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ ఈ మూవీకి పాజిటివ్ బజ్ క్రియేట్ చేసింది.అయితే, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఓ ఇంటెరెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా టీజర్‌ను ఏప్రిల్ 29న రిలీజ్ చేస్తున్నట్టు తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ సరసన వైష్ణవి చైతన్య మరోసారి హీరోయిన్‌గా నటిస్తుండటంతో 'బేబీ' కాంబినేషన్ మళ్లీ హిట్ రిపీట్ చేస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నాడు. యూత్‌ఫుల్ లవ్ స్టోరీగా రూపొందుతున్న చిత్రం ఆనంద్ దేవరకొండ కెరీర్‌లో మరో గుర్తుండిపోయే సినిమా అవుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

## అందుకూ.. ధైర్యం కావాలి

'ఏక్ దిన్'తో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నారు నటి సాయిపల్లవి. ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్‌తో కలిసి ఆమె నటించిన సినిమాను సునీల్ పాండే తెరకెక్కించారు. ఇది మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో సాయిపల్లవి మాట్లాడుతూ.. హిందీ ప్రేక్షకులు తనను ఎలా స్వీకరిస్తారోనని ఆందోళనగా ఉన్నట్టు తెలిపారు. "నేను ఎన్ని మంచి సినిమాల్లో నటించానో నాకు తెలియదు. కానీ, ఇండస్ట్రీలోని గొప్ప ప్రతిభావంతులతో కలిసి పని చేశానని మాత్రం చెప్పగలను. అలాంటివారి మధ్య ఉండడం నాకు ఆనందంగా ఉంది. కెరీర్‌లో ఇక్కడివరకు వచ్చానంటే అది నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమా చూసి ఆమిరాఖాన్ అందరి ముందు ఎమోషనల్ అయ్యారు. అలా భావోద్వేగానికి గురవ్వాలన్నా ధైర్యం కావాలి. నేను అలా అందరిలో ఎమోషనల్ కాలేను. సినిమా చూస్తున్నప్పుడు ఈ లైట్స్ కొంచెంసేపు ఆగిపోతే బాగుండు అని కోరుకున్నా. ఎందుకంటే నాకు కూడా కన్నీళ్లు వచ్చాయి. కంట్రోల్ చేసుకున్నా" అని చెప్పారు. జునైద్ మంచి సహనటుడని సాయిపల్లవి అన్నారు. ఇది బాలీవుడ్‌లో తన తొలి చిత్రమని.. హిందీ మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. తప్పులుపోతే క్షమించాలని కోరారు. సునీల్ పాండే దర్శకత్వం వహించిన 'ఏక్ దిన్'కు ఆమిరాఖాన్ నిర్మాతగా వ్యవహరించారు. తెలుగులో 'ఒక రోజు' టైటిల్‌తో రానుంది. ఈ చిత్రం గురించి ఆమిర్ మాట్లాడుతూ.. "దర్శకుడు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. విజయం సాధిస్తుందో, లేదో ఎవరికీ తెలియదు. కానీ, మనం కథకు ప్రాణం పోసి చూపించగలిగామా లేదా అన్నదే నాకు ముఖ్యమైన విషయం. నా దృష్టిలో విజయానికి అదే మొదటి కొలమానం. వాస్తవానికి సినిమా విజయాన్ని అర్థం చేసుకోవడానికి వసూళ్లు ముఖ్యమే కానీ, నచ్చిన సినిమా బాగా ఆడితే ఆ విజయంతో నేను సంతోషంగా ఉండలేను" అని అన్నారు.



## అప్పుడే చెప్పలేను..

హీరోల తనయులు ఎప్పుడెప్పుడు సినిమాల్లోకి వస్తారోనని అభిమానులు ఆసక్తి చూపిస్తుంటారు. స్టార్ కిడ్స్ టీనేజీలోకి రాగానే ఆ ఉత్సాహం మరింత ఎక్కువ అవుతుంది. కోలీవుడ్ ప్రముఖ నటుడు ధనుష్ పెద్ద కొడుకు యాత్ర విషయంలోనూ ఇంతే. దర్శకుడిగానూ సత్తా చాటిన ధనుష్.. తానే కొడుకుని హీరోగా లాంచ్ చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఓ ఈవెంట్‌లో యాత్ర సినిమాల్లోకి ఎప్పుడొస్తాడన్న ప్రశ్నపై ధనుష్ స్పందించారు. "కుటుంబ పరిస్థితుల కారణంగా 16 ఏళ్లకే నేను చిత్ర పరిశ్రమలోకి వచ్చా. యాత్రకు ఇప్పుడు 19 ఏళ్లు. అయినా నాకు చిన్నోడిలానే కనిపిస్తాడు. భవిష్యత్తులో తను ఏమవుతాడో నాకింకా తెలియదు. సినిమాల్లోకి వస్తాడా, లేదా? అన్నది ఇప్పుడే చెప్పలేను" అని అన్నారు. 'కర'తో ప్రేక్షకులను పలకరించేందుకే సిద్ధమయ్యారు ధనుష్. ఆయన హీరోగా విఘ్నేశ్ రాజా తెరకెక్కించిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది. ఈ నెల 30న తెలుగులోనూ విడుదల కానుంది.



## పెళ్లి ఫొటోలు పంచుకున్న మెహరీన్..



హనీ ఈజ్ ది బెస్ట్.. అంటూ 'ఎఫ్-2'లో నవ్వులు పూయించిన మెహరీన్ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఏప్రిల్ 26న అర్ష్ బెలిఖ్‌తో తన వివాహం జరిగినట్టు ప్రకటిస్తూ ఫోటోలను ఇన్‌స్టాలో పంచుకున్నారు. దీంతో సెలబ్రిటీలు ఈ జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు.